అమృత కలశం

(కథలు)

ఉషశ్రీ



ఉషశ్రీ మిషన్

రేడియో కాలనీ, విజయవాడ-520 008

అమృతకలశం

(కథల సంపుటి)

ఉషశ్రీ

[redacted]

ఉషశ్రీ మిషన్
రేడియో కాలనీ
విజయవాడ - 520 008.

'ఆ శీ స్సు'

ఉషశ్రీ రచించిన అమృతకలశం అన్న నాలుగు పురాణకథల సంపుటం చూశాను. కథలు పురాణకథలు. రచన వ్యావహారికం. వ్యావహారికమనటం కంటే శిష్టవ్యావహారిక మనటం మంచిది. పలుచోట్ల పెద్దపెద్ద సమాసాలున్నవి. కాని రచన గంభీరంగా నున్నది. అనుశ్రుతంగా ఒక మాధుర్య రేఖ సర్వరచన యందు ప్రవహిస్తున్నది. పురాణకథలు ఈ పద్ధతిలో వ్రాయటం. ఈ పద్ధతిలో అచ్చువేయటం ఇదియొక క్రొత్తమార్గమని చెప్పాలి. ఉషశ్రీ ప్రసిద్ధుడే - ఈగ్రంథము ఆయన ప్రసిద్ధికి మరీ దోహదమే చేస్తున్నది. ఆయనింక నిట్టి గ్రంథములు వ్రాసి, యీ మార్గమునకు ఉపదేష్టయగు గాక! 'ఇది ఉషశ్రీ మార్గము' - అన్న ప్రతిష్ఠ బడయుగాక!

విజయవాడ,
12-12-63.

- విశ్వనాథ సత్యనారాయణ

ముందుమాట

రేడియోలో రామాయణ భారతాలను ప్రజారంజకంగా వినిపించడానికి దాదాపు పుష్కరం పూర్వం ఉషశ్రీ పౌరాణిక కథలు రాశారు.

కథలు రాయడానికి ఆయన ఎంచుకున్నది ప్రౌఢ వ్యావహారిక శైలి. ఆ శైలిలో ఉషశ్రీ రాసిన కథలు వచన కావ్యాలవలె సాగుతాయి.

1960 ప్రాంతంలో ఉషశ్రీ రాసిన కథలు అప్పటి సాహితీ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వాటిలో నాలుగు కథలు పుస్తక రూపంలో వెలువడడానికి, 1963లో ఉషశ్రీ మిత్రులు శ్రీ కె.కె.రామానుజాచారిగారు సహకరించారు.

ఆనాడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఇచ్చిన "ఆశీస్సు"తోనే "అమృతకలశా"న్ని పునర్ముద్రించి, మీ కోసం అందిస్తున్నాం.

ఇందులో ....

అమృత కలశం

మేనక

దేవయాని

విశ్వశాంతి

అమృత కలశం

ఆత్మవేత్తలలో అగ్రగణ్యుడు వరుణుడు. వరుణుని యజ్ఞవేదిక నుండి ఆవిర్భవించినవాడు భృగువు. పరమేష్ఠి కరుణచే వరుణుని యజ్ఞవాటిలో ప్రభవించిన భృగుమహర్షి కుమారుడు చ్యవనుడు.

సుకన్యా చ్యవన పరిణయగాథ విశ్వవిదితము. ఆ పురాణ దంపతులకు జన్మించినవాడు ప్రమతి. ప్రమతికి ఘృతాచియందు పుట్టినవాడు రురువు. ప్రమద్వరా-రురు ప్రేమోదంత మొక విచిత్ర కథ. ప్రమద్వరాసూనుడు శునకుడు. ఆతని సుతుడు శౌనకుడు. భృగువంశ వృక్షమున నిదియొక శాఖ.

ఔర్వ, జమదగ్ని, పరశురామ, శుక్రులు కూడ భార్గవులే. పురాణకాలమున ప్రజాహితైక దృష్టితో భారతవర్షమును ధర్మమార్గమున నడిపించి, ప్రముఖస్థానముల నధిష్ఠించినవారీ మహనీయులు. అందరును ప్రాతఃస్మరణీయులైన ఋషిపుంగవులే.

భారతదేశ రాజ్యాంగ నిర్మాణకేంద్రము నైమిశారణ్యము. పురాణేతిహాస ధర్మనిలయమైన నైమిశారణ్యము శౌనకుల నివాస భూమి. శౌనక నైమిశారణ్యములకు గల అవినాభావసంబంధము

జగద్విదితము. అనేకుల దృష్టికి శౌనకుడు సామాన్యుడుగనే గోచరించును.

అఖిల ప్రజాశ్రేయస్సు పరమలక్ష్యముగ భారతీయ వేదాంతమును బోధించిన మహనీయుడు; అధీత సకల వేద వేదాంగుడు. అది ఆయన శక్తి; నైమిశారణ్య కులపతిత్వము ఆయన పదవి. భరతభూమిలో పురాణప్రచారము శౌనకునివలన నైమిశమునుండి జరిగినది. ఇది శౌనక నైమిశారణ్యములకు గల అనుబంధము.

ఆ నైమిశమున కులపతి శౌనకులు ద్వాదశవర్ష సత్రయాగము నారంభింప సమకట్టిరి. సత్రయాగవార్త దేశమెల్లెడల వ్యాపించినది. దూరదూరాలనుండి మారుమూలల అరణ్యభూముల నుండి, నదీతీర తీర్థాలనుండి ఋషులు, మహర్షులు, మునులు, మహామునులు, తపోదీక్షితులు దండ, కమండలధారులై శిష్యసహితముగ విచ్చేయుచుండిరి.

విచ్చేయుచున్న విద్వజ్జనులకు, వేదవిదులకు వివిధవిధ సత్కారములు యథోచితకాలముల జరుపుటకు సమర్థులగు బ్రహ్మచారులకు ఆదేశము లిచ్చిరి. చతుర్దశభువన వార్తాప్రసారమైనంతనే భృగుసహిత భార్గవఋషిపుంగవులు విచ్చేసిరి.

మహర్షుల ఆధ్వర్యమున, దేవర్షుల సాహాయ్యమున సత్రయాగ మారంభమయినది. ఈ మహాయాగమునకు భార్గవులు సహకారులుగా నుండి పర్యవేక్షించుచుండిరి.

అతిరథదీక్షాశిక్షితులయిన మంత్రవేత్తల ఆదేశానుసారము అనుదినము హోమాది క్రియాకలాపము నిర్వహింపబడుచున్నది. హోమప్రక్రియ జరిగిన పిదప సర్వసభ్యసమావేశములు జరుగుచున్నవి.

పరిషత్తులో అనేకాంశములు చర్చావేదిక నలంకరించెడివి. వాదప్రతివాదములు, రాద్ధాంత సిద్ధాంతములు జరుగుచున్నవి. అనుదినచర్చలో కొన్ని ధర్మసూత్రములు మార్పుచెందుట, కొన్ని సూత్రములు చేర్చుట జరుగుచున్నది.

అగతానాగత వర్తమానజ్ఞులయిన మనీషులు సిద్ధాంత పూర్వపక్ష పీఠాలపై ఉపవేష్టించి ఉన్నారు. సమాజ శ్రేయోనిబంధనల మీద చర్చలు సాగుచున్నవి. కొన్ని ఘడియల తీవ్రచర్చానంతరము సదస్యుల మనస్సు విశ్రాంతిని కోరినది. విజ్ఞులకు విశ్రాంతి మౌన స్థుషుప్తులు కావు: విషయ వైవిధ్యమే తీవ్రతర సమస్యనుండి నాతితీవ్రముల కావలయును.

• ఆ సమయంలో నారదర్షి మహతి స్పందించి సత్యహృదయాల రసనిష్యందమొనర్చినది. పురాతనాద్యతనభావికా విషయజ్ఞుడైన నారదర్షి విజ్ఞసామాజికుల ముఖావలోకన మాత్రాన వారి మనోగత భావమును గుర్తించి మనోజ్ఞహాసంతో పలుకనారంభించినారు. ఆయన గళతంత్రులు శబ్ద సృజనకు పూనుకొన్న సమయమున జనతాపరిషత్తు మహాభారమును నిశ్వాసరూపమున వదలినది.

"అద్యంతరహితమయిన సృష్టిరహస్యములను అవలోడించగల శాస్త్రవేత్తలు పరివేష్టించియున్న మహాసభకు అభివాదములు. ఎట్టి క్లిష్టతమ సమస్యలనైనను, జటిల విషయములనైనను ఈ సభాసదులు విశదీకరించి పరిష్కరింపగలరని నా విశ్వాసము. ఆ విశ్వాసముతో యీ పరిషత్తులో నేనొక్క సమస్య......"

అని నారదర్షి సింహావలోకనం ప్రారంభించినారు. సభ్యుల నేత్ర సంచలన సంకేతము నారదర్షి మోములో మందహాసమై పరువులు తీసినది.

నా ప్రశ్నకు సత్యబద్ధమైన సమాధానము లభించగలదను ఆశతో నిలబడినాను; ఆకర్ణించండి.

“సృష్టికి ఆదికారణం పరమాత్మ. పరమాత్మ ప్రేరితం మాయ. మాయాజన్యులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ఈ మూర్తిత్రయము సృష్టి, స్థితి, లయములకు కారణము. త్రిమూర్తులు జగదాధారులై, చతుర్దశభువన పూజితులైనారు. ఇది సార్వకాలిక సత్యము. సమస్యా శిలాన్యాసము వ్యక్తముకానిదే ఏతద్గతాంశము ప్రసక్తము కారాదు కనుక భూమిక విస్తరింపవలసి వచ్చినది....ఇ-క...స-మ-స్య...”

అని నారదుడు సభను తిలకించినాడు. ఉచ్ఛ్వాస, నిశ్వాసలను సైతము బంధించి కూర్చున్నది పరిషత్తు.

“జగద్ధిత పరాయణులయిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టి, స్థితి, లయకారులై విశ్వంభరావలయస్థ జనతాసమూహమునకు పూజ్యులయినారు. పరమేష్ఠి ఏకాత్మను అనేక దేహములలో స్థాపింపజేయుచు సృష్టికార్యనిర్వహణలో అప్రమత్తులైనారు. మహావిష్ణువు ఉత్తమ, మధ్యమ, తారతమ్య పరిశీలనదృష్టితో, నిర్హేతుక జాయమాన కరుణాకటాక్ష వీక్షణాలను ప్రసరిస్తూ స్థితి కారకుడై పరిపాలన భారాన్ని వహిస్తున్నారు. కాలగతిపర్యాలోకనతో పరమేశ్వరుడు యుక్తకాలమున ఉపసంహరిస్తున్నారు. ద్వంద్వబద్ధులూ, మాయావిమోహిత చేతస్కులూ అయిన మానవులు ఋషులవలె నిత్యతపోలగ్న మనస్కులు కాలేరు. పారమార్థిక చింతనకూ, పారలౌకిక సుఖసాధనకూ వారికిగల అవకాశమే అల్పము. అల్పజ్ఞమయిన అగణిత జనజగతి మోక్షసాధనకై త్రిమూర్తులలో ఎవరి నారాధింపవలయును?”

అని నారదర్షి సాభిప్రాయావలోకనం చేసి సుఖాసీనుడయి నాడు. పరిషత్తులో నిశ్శబ్ద సామ్రాజ్యాధీశ్వరి నిరంకుశ విహారం చేస్తున్నది. నిమేషత్వం, అక్షిసంచలనం చైతన్యసూచకంగా మౌనసమ్రాజ్ఞికి కైవారాలు పలుకుతున్నవి.

స్థూలదృష్టికి అణుసదృశంగా ఉన్న నారదుని ప్రశ్న శ్రీవానుశీలకులకు బ్రహ్మాండకటాహవిచ్ఛేద సదృశంగా గోచరిం చింది. ఆసీనులై ఉన్న సదస్యుల అంతరాంతరాలలో మథనానికి అంకురార్పణ ఆరంభమయినది.

మథన సాగుచున్నది.

మహామేరువులు సంఘర్షిస్తున్నవి.

సాగరస ప్తకంలో కల్లోలం చెలరేగింది. జాతవేదునితో వాయుదేవుని సఖ్యం.

పర్యవసానం ?

పరిష్కారమార్గం దొరకలేదు. ఎవరు ఏమని చెప్ప గలరు ? ఎప్పుడిటువంటి ప్రశ్న వారిముందు నిలబడ్డది ఆద్యంత రహితమయిన సృష్టిరహస్య భేదన మెవరితరం ? స్వయంవరంలో మౌనసమ్రాజ్ఞి మునికోటిని వరించింది.

కదంబతరుచ్ఛాయా న్యాసిత వేదికపై నిలబడిన జటా జూటం సర్వఋషిగణ దృక్చకోరాలను ఆకర్షించింది. ఒక్క సారిగా నిశ్వాసరూపంలో ప్రసరించిన ధ్వనిసేనావాహిని మౌన సమ్రాజ్ఞిని నిలువుదోపిడీచేసి పంపింది.

అర్ధనిమీలిత నేత్రాలలో ఆశారేఖలు పల్లవించినవి. సభ్య జన సమూహాన్ని సువిశాల నేత్రాలతో అవలోకించి సభావందనం

చేసి నారదునిపై దృష్టి కేంద్రీకరించిన గాలవమహర్షిని చూచి సదస్యులు సంతోషభరిత చేతస్కులయినారు.

"దేవర్షి ప్రశ్నకు పరిషత్తు సంతృప్తికరమయిన సమాధాన మీయవలసినదే. ఈ నవరణ కూడా ఆలోచించండి."

గాలవుని మధురగంభీర గళంనుండి వెలువడే ప్రతిశబ్దాన్ని శ్రద్ధగా ఆలకించే సభ్యులు పై వాక్యాన్ని విని ఒకరిపై నొకరు చూచుకున్నారు. వియద్గంగాలహరీ సదృశంగా విషయవిన్యాసం చేయగల గాలవుడు ఇంతనెమ్మదిగా ప్రసంగించడం... తాను ప్రతిపాదించిన ధర్మసూత్రాన్ని ఖండించే ప్రతిపక్షివాదాన్ని పరాస్తం చేయటానికి అనేకోదాహరణలిచ్చి గజగజలాడించగలిగిన గాలవుడు ఇంత సౌమ్యంగా ప్రసంగిస్తూ, ప్రతిపాదిత జటిలసమస్యకు నవరణ చూపబోతుంటే కొద్దిగా చలించారు సదస్యులు. పరస్పరం కన్నులు భాషించుకొన్నవేకాని ఎవరి పెదవులూ విడలేదు.

"సృష్టి రహస్య భేదనతుల్యమయిన ఈ సమస్యను పరిష్కరించడంకంటే అపరిష్కృతంగా ఉంచటమే లోకకల్యాణదాయకము. త్రిమూర్తుః తారతమ్య పరిశీలనకు పూర్వం అందువల్ల ఏర్పడే అనర్థాలను ఆలోచించుకోవాలి."

గాలవుడు ఆసనాన్ని అలంకరించినాడు.

సభను నిశ్శబ్దం నిర్వహిస్తున్నది.

నారదుని మోములో అసంతృప్తి కనిపించుతున్నది.

పురాణమునులు దుర్వాస, విశ్వామిత్రు లొకరివంక నొకరు చూచుకొన్నారు ।

'దేవర్షి ప్రశ్నకు సమాధానం రావాలి' అన్నాడు విశ్వామిత్రుడు. ఇష్టసఖుని ప్రతిపాదనను సమర్థించినాడు దుర్వాసుడు.

సంశయంతో ఉండటం కంటె విర్ణయం జరగటం అవసరం అనే అభిప్రాయం సదస్యులలో కలిగినది.

'సర్వాతిశాయిత్వానికి లక్షణ నిర్వచనం చేస్తే పరిష్కారం అయినట్లే'.

అన్నారు, మెల్లిగా గాలవుడు.

నారదుని మోములో సంతృప్తి రేఖ గోచరించినది. గాలవుని ప్రతిపాదన మరీ క్లిష్టమయినది. నారదుని ప్రశ్నకు ఏదో ఒక సమాధానం మీయవచ్చునేమోకాని గాలవుని నవరణ మరింత జటిలమయినది.

ఇంతవరకూ తామరాకుపై నీటిబిందువులా ఉన్న భృగు మహర్షి వైపు అందరి దృక్కులూ మరలినవి. భృగుమహర్షి మోములో చిరునవ్వు చిందులు త్రొక్కుతున్నది. సభ్యుల అభి మతాన్ని గుర్తించిన నారదుడు—

'చరాచర జగచ్చక్ర పరిభ్రమణ హేతువయిన బ్రహ్మ పదార్థాన్వేషణలో జీవితయాత్ర సాగిస్తూన్న భృగుమహర్షి నిర్ణ యిస్తారు' అన్నారు.

సభాసదులు తమ ఆమోదం ముక్త కంఠంతో వెలి బుచ్చినారు.

సత్యలోకం

సృష్టికర్త వాణీనాథుని క్రీడోద్యానం - ఉద్యానవన్యంలోని సరోవర సమీపాన ప్రజాపతి సరస్వతీ సహితుడై సరససల్లాపాలు సాగిస్తున్నాడు. వీణాపాణి కలకంఠంనుండి వెలువడే ప్రేమ వాక్యాలు పరమేష్ఠికి పులకరెత్తిస్తున్నవి. దేవతల విన్నపాలు,

సత్యలోకవాసుల స్తోత్రపాఠాలు, తపస్వుల ఆకాంక్షలు జీవిత సర్వస్వంగా సాగే చతుర్ముఖుని మనసులో మమకార వికారాన్ని ఆవిర్భవింపజేశాడు మదనుడు. సురుచిరస్మిత వదనారవిందంతో ఉల్లాసకాంతులు ప్రసరించే - వాగ్దేవిని క్రీగంట చూస్తూ మౌన ముద్రాముద్రితుడయినాడు... బ్రహ్మంతవాడు. అంతలో ఆమె విచలితయై ప్రక్కకు జరగటాన్ని గమనించిన ప్రజాపతి, దృష్టి మరల్చినాడు: మరలుటలోనే ప్రజాపతి శాంతవదనంలో లలాటంపై భృకుటి ముడివడ్డది; కన్నులలో ఎర్రజీరలు ప్రాలినవి.

అచంచలంగా నిలబడిఉన్నాడు భృగుమహర్షి. దండ, కమండలధారియై, పండుగడ్డంనుండి వెలువడే చిరునవ్వుతో ఉన్న భృగువును చూస్తూనే అన్నాడు :

'ధార్మిక ప్రవృత్తితో విచక్షణాజ్ఞానం కూడా నీలో సన్నగిల్లింది; కాకపోతే రసమయ సామ్రాజ్యంలో ఉన్న సతీపతుల సన్నిధానంలోకి...'

కమలాసనుని పెదవులనుండి వెలువడే ప్రత్యక్షరం భృగుమహర్షి మనసులో ప్రవేశిస్తూనే ఉన్నది. ఆయన వదనంలో చిరునవ్వు చెదరలేదు. కన్నులలో దీప్తి అణగలేదు.

పరమేష్ఠి తీక్ష్ణతను చూచి ఎరుగని సరస్వతి వణికిపోతున్నది.

ఎదురుగా భృగువు, ప్రక్కనే ప్రజాపతి. ఇరువురివైపు శరవేగంతో చలిస్తున్నవి ఆమె నేత్రాలు.

'నీయీ ధార్ష్ట్యానికి ఫలం అనుభవించు'.

కమండలువులోని ఉదకం చేతిలోనికి తీసి అభిమంత్రించటానికి సన్నద్ధుడవుతున్నాడు.

ప్రళయకాలాగ్ని శిఖలవలె వెలిగే పరమేష్ఠి నేత్రాలను దర్శించలేక, .చిరునవ్వు లొలయించే మహర్షి ముఖోభాసాన్ని గమ నించలేక అవనతశీర్షంతో, కంపితాధరయై——

"ప్రభూ ! భృగువు న్వదంశాసంభూతుడు, పుత్రసముడు, అపరాధం అత్యల్పం—అందుకా శాపం ! అర్యపుత్రులకు..." అంటూ ఆగినది.

కలస్వనం ప్రజాపతి క్రోధాన్ని ఆహరించినది. భృగువు చిరునవ్వులో మరలినాడు. ప్రజాపతి మోములోని అరుణిమను సరస్వతి పాణితలం ధవళితం చేసినది.

కై లా స ం

ముఖాసీనయై యున్న హైమవతి పర్యంకముపై శిరస్సుంచి ఆమె కుటిలాలకాలతో సరాగాలాడుతున్న పరమశివుడు—కొన్ని క్షణాల అనంతరం ఆమె ఆనందంకోసం నాట్యమారంభించినాడు. హైమవతి కరకిసలయములు లయ కూరుస్తున్నవి. నృత్యభంగి మలు హైమవతి మనసులోని పురారహోనుభూతులను ఆమె కనులయెదుట ప్రదర్శిస్తున్నవి; సాత్విక భావాలు ఆమె ప్రత్యంగ మునకు గిలిగింతలు పెడుతున్నవి.

ఆ విలాసవతి కనుదోయిలో అనుక్షణం ప్రవర్ధమాన మవు తూన్న శృంగారభావశబలత పరమశివుని తన్మయత్వమును అవ ధుల నతిక్రమింప జేస్తున్నది. శృంగారరస సంభరిత చిత్తులూ, నాస్మైకరోలురూ అయిన హైమవతి - శశాంక శేఖరుల ఎదుట విలబడి ——

'పుణ్యదంపతులకు ప్రణామములు'
అన్నాడు భృగువు.

లీలావిలాసలాస్య తరంగిత హృదయుడయిన పరమశివుడు మహర్షి ఆగమనాన్ని గుర్తింపలేదు. రసస్థాయికిపోతున్న హైమవతి ప్రస్తారక్రియాన్ని సన్నివేశిస్తుంటూ చివాలున పర్యంకావతరణ మొనర్చినది. పరమశివుని ఆనందము అవధీబద్ధమయినది; ఆయన పాదచలనం స్తంభీభూతమైనది. అంతలో ఆయన హస్తం కాలాన్ని ఆహ్వానిస్తున్నది; భృగువు అదృశ్యుడయినాడు. పరమశివుని క్రోధము పటాపంచలయినది. ఎదురుగా హైమవతి లజ్జావనత వదనంలో నిమీలిత నేత్రాలు ఆయనను ఆశ్వాసించినవి. ఆమె హస్తస్పర్శ ఆయనలో పులకరింపించినది.

వైకుంఠం

మందార వనాంతరాన, సుధాసరోవరతీరాన శ్రీదేవి మందమనోజ్ఞహాసశ్రీ రోచులు శ్రీపతి అరుణారుణాధరాలలో ప్రతిఫలిస్తున్నవి. అంతలో రమాదేవి మోహన రూపిణియై ముందుకు వ్రాలినది. ఆయన వక్షస్థలంపై ఆమె స్తనభారం అనిర్వాచ్యానుభూతులను ఒలికిస్తున్నది; అరమోడ్పు కనుదోయి ఆమెను ఏలోకానికో తీసికొని పోతున్నది. పద్మపాణి పాణిపద్మములు ప్రియుని నునుబుగ్గలపై చలిస్తున్నవి.

అంతలో శ్రీపతి గంభీరశాంతవదనుడై, అంజలిబద్ధుడై నిలబడినాడు.

శ్రీదేవి నేత్రాంచలాలలో బాష్పరసధారలు ప్రవహిస్తున్నవి. రమాపతి అభ్యర్థనానుసారం భృగుమహర్షి శేషతల్పంపై శయ

నించినారు. భక్తవరాధీనుడు మునిపూజ్యునికి పాదసంవాహనం చేయటం, ద్వారమధ్యంలో నిలబడి అవలోకించే విష్వక్సేనాది పారిషదబృందానికి ఆశ్చర్యజనక మయినది. ఒకరిపై ఒకరు చూచుకుంటూ పెదవులు కదపకుండా కదిలారు.

పరిస్థితి పరిణామాన్ని పరికించిన పంకజాక్షి చతుర్దశ భువనాధీశుని సేవాకృత్యాన్ని చూడలేకపోయింది. అంతలో ఆమె క్రీడోద్యానాన్నే కాదు, వైకుంఠాన్నే వదలి చరాచర జగత్తులోని మాంగళ్యాన్ని కేంద్రీకరించుకుని క్షీరపాథోరాశిలో విశ్రాంతి తీసికొన్నది.

మహర్షి శ్రమాపనయాన్ని సూచిస్తూ సంతుష్టచిత్తంతో శ్రీపతిని చూచి శిరఃకంపంతో నైమిశారణ్యానికి కదిలారు.

ఆదేవమయానికి దేవర్షి నారదుడు సర్వఋషిగణ సహితుడై విచ్చేసినాడు. పరిషన్మధ్యంలో భృగుమహర్షి తన అనుభవాలను వివరించి —

"అందుచేత పరమేష్ఠి రజోగుణానికీ, పరమశివుడు తమోగుణానికీ, వైకుంఠుడు సత్వగుణానికి ప్రతినిధులు"

అని నారదుని వదనంలోని దరహాసాన్ని అవలోకించినారు.

౨

నందనవనమందారసుమకోమలమైన శ్రీ నవనీతహృదయం పరాభవాన్ని - అది పరమాణు సదృశమయినా - సహించలేదు. తనకేకాదు, తన ప్రియులకు, ఆత్మీయులకు జరిగినదాన్ని కూడా నిర్లిప్తంగా త్రోసిపుచ్చలేదు. ప్రతీకారాన్ని కోరుతుంది; పరా

భవం కొనదేరిన కంటకంలా ఆమె మృదుహృదయాన్ని కలత పెడుతూనే ఉంటుంది—

అనునిత్యమూ ఆదిదేవుని అధర ప్రసాదాలకోసం ఆరాట పడే ఋషిమాత్రుడు.

తన భర్తతో తాను శృంగారలీల జరుపబోయే శుభావ కాశంలో వెంచేయటం—

వెంచేసి ఆదిదేవుని వక్షఃస్థలంపై పాదతాడనం చేయటం!...

శ్రీదేవి హృదయంలో ప్రళయాగ్ని కీలామాలలు ప్రజ్వ లించినవి. ఋషి పాదతాడనం పొందిన పతి సద్యఃశిక్షాప్రదానం చేయక మునికి పాదసంవాహనం చేయటం... అగ్ని శిఖలపై ఆజ్యధార అయినది.

అనన్యలభ్యమైన ఆదిశేషునిపై చిదానందమూర్తియై మరి శయనించటం!

ఆదిలక్ష్మి అవమానం అవధుల నతిక్రమించినది. ఈ సమస్త దృశ్యాన్ని అవలోకించిన ప్రేక్షకపరిజనులను కన్నెత్తి చూడలేకపోయింది. వాణీ - ఉమా తన యెట్టయెదుట నిలబడి పరిహసిస్తున్నట్లు భావించుకొన్నది. భావనమాత్రంలో ఆమె హృదయభారం ద్విగుణీకృతమైనది - వైకుంఠమే పరేతభూమి వలె కనిపించటంతో అడుగు కదిపి విలయకాలజనిత మహాప్రభం జన సదృశవేగంతో సాగిపోతున్నది.

ప్రచండవేగంతో పరిభ్రమించే శ్రీదేవి పాదాలు అంతలో ఒక్కసారిగా ఆగినవి. ఆమె తనూలత మాత్రం తీవ్రతరో

ర్వ్యాన విశ్వానలతో ఊగిపోతున్నది; మహాభువనమే గిజగిజ
లాడుతున్నది. చెవియొగ్గి విన్నది...మహాఘోష...

నిర్విరామంగా నిశ్వసిస్తున్న సముద్రం ! ఆమె రక్తారుణ
వదనంలో ఒక హాసరేఖ అంకురించింది. కన్నులు నెరవిచ్చి
చూచినది. ఎదురుగా మహాశ్వేత కమలంవలె క్షీరసాగరం. ఆమె
హృదయమే క్షీరసాగరమయినది. అమందస్మితయై దశదిశావ
లోకనంచేస్తూ సాగరగర్భంలో ప్రవేశించింది.

శ్రీశూన్యమయిన భువనంలో ఓషధులు, శశాంకుడు, ఐరా
వతాదులు విలువలేక లక్ష్మినే అనుసరించినవి. ప్రపంచమే దారి
ద్ర్యంలో మునిగి తేలుతున్నది. మహాభువనం శూన్యవిభవ అయి
నది. ఓషధీరహితమయిన వసుంధర విస్తేజమయినది. ఐరావ
తాదులు లేని అలకాపురి లక్ష్మిలేని వైకుంఠమయినది. శశాంక
హీనమయిన గగనం తమోవిలయమయినది. ధరణీచక్రం వక్రప
భ్రమణోద్యుక్త అవుతున్నది.

*   *   *

భేరీ భాంకారాలు
కాహళస్వనాలు
గోముఖధ్వానాలు
ఢంకా ఢమఢమలు

యుద్ధవాద్యాలు దిగంతాల దిగంతులను దద్దరిల్లజేసి, ప్రతి
ధ్వనిరూపంలో అమరావతిని ఊగిసలాడిస్తున్నవి. రాక్షససేనా
నివహం అమరావతిని చుట్టుముట్టినది. దరహాస ధవళితానన
అయిన శచీదేవి కుడికన్ను అదరగా భర్తవైపు దీనంగా చూచి

నది. వలత మందహాస సుందరకపోలాలపై ఆవేదనచ్ఛాయలు అమరాధిపతి అంతరాంతరాలను అలజడి పరచినవి.

చతుర్దశభువనాలలో సుధర్మాస్థానాన్ని అధివసించగల అర్హతేకాదు సాహసం కూడా కలవాడు లేడని నిర్భయంగా ప్రియ సతితో ప్రణయవ్యవహారం సాగిస్తున్న సహస్రాక్షునికి భేరీ, కాహళ, ఢంకా ధ్వానాలు వినిపించలేదు. ప్రణయినీ సుందర వదన పారిజాత ప్రసూత మృదుమధుర మనోజ్ఞ భాషణాలనే ఆయన శ్రీకర్ణాలు గ్రహిస్తున్నవి.

"శచీ! సహస్రాక్షుని సతి అననసీమలో ఆవేదన..."

సవ్యతగా, చిబుకం పైకెత్తి ఆమె ఫాలపార్శ్వాన్ని వక్షంపై అదుముకున్నాడు. శచీదేవి కన్నుల ఎదుట అసుర సేనావాహం దండువిడిసి, ఆమె చెవులలో యుద్ధభేరీ మ్రోగిస్తున్నట్లని పించింది.

శ్రీ హృదయం!

'ప్రభూ!'

భయోత్కంపిత గాత్రయై దేవేంద్రునిపై వ్రాలి పొదివి పట్టుకున్నది. కంపిత వక్షాన్ని ఆయన హస్తం నొక్కిపట్టినది.

చలించాడు, ఇంద్రుడే.

ఉద్వేగమయిన స్పందిత శచీహృదయం ఊగిసలాడించింది. ప్రళయ ప్రభంజన ప్రకంపిత బాలరసాలంలా గజగజలాడే శచిని అదిమి పట్టుకొని..

'ఎవరక్కడా!'

అని పిలిచాడు.

పిలుపు వెదలిన మరుక్షణంలో దేవతానీకం దేవాధీశుని మ్రోల అంజలించి నిలబడ్డది.

శిరఃకంపం చేసి సింహావలోకనం చేశాడు మహేంద్రుడు. ప్రతిపక్షాల యుద్ధవాద్యాలు మహేంద్రుని కర్ణమూలాలలోనికి చొచ్చుక దూసికొనిపోయినవి; అవి ఆయన శరీరంమీదనే నడిచినట్లనిపించినవి. సన్నివేశాన్ని సమీక్షిస్తున్న శచీదేవి అంతరంగిక సఖి, శచిని దగ్గరగా అదిమి పట్టుకొని శీతలోపచారాలు చేసి అంతఃపురానికి నడిపించింది.

మహేంద్రుని హస్తద్వయం మహాధ్వనితో ఒకదానిలో ఒకటి బిగిసినది; భృకుటి ముడివడినది; కన్నులలో అరుణిమ అంకురించినది. భుజాగ్రాలు అదిరినవి.

అర్థమయినది. ఆచార్య బృహస్పతి ఏమన్నారు ?'

సమాధానాన్ని దేవతాధీశు డాశించనూలేదు. దేవతలు చెప్పనూ లేదు.

ఆచార్య బృహస్పతి ఆలోచనా మందిరంవైపు అమరేంద్రుని అడుగులు అతివేగంగా పడుతూంటే అనుచరబృందం అనుసరించింది.

అమరేశ్వరుని ఆగమనాన్ని ఆగంతుకుని వలన ఆకర్ణించిన ఆచార్య బృహస్పతి ఆసనసీమలో ఆలోచన లంతరించినవి.

అంజలిబద్ధుడై నిలబడ్డ దేవేంద్రుడు,

'అమాత్యశ్రీకి మా ఆగమనకారణం...

అంటుండగానే

"అవగతపూర్వం అదే ఆలోచిస్తున్నాను. అన్యథా శరణం

జుణానంతరం బలి ఆరంభించిన ప్రజాళిక నిరంతర దానం; త్రిలోకాధిపత్యాన్ని పరిహసించే స్థానాన్నిచ్చింది దానం.

బలి యెదుట ప్రాంజలి ఘటించి శిరసు వాల్చని వాడు లేడు.

ప్రార్థించి అపంత్యప్తుడై అడుగు కదిపినవాడు లేడు.

దానమే జీవిత పరమాశయంగా పరిపాలన సాగించే దైత్యనాథుని కన్నెత్తి చూడలేక చేయెత్తి జోహార్లర్పిస్తున్నారు దేవతలు.

దేవేంద్రుని వజ్రహస్తానికి నతశీర్షమయిన మహాభువనం బలిదానహస్తానికి ప్రహర్ష పరిప్లుతమయినది.

దేవేంద్రుని హృదంతరాళంలో అగ్నిపర్వతాలు భుగభుగ లాడుతున్నవి. అవక్రపరాక్రమోపేతం, అజేయం, అరాతి నిర్మూలన సమర్థం ఐన వజ్రకాంతి తననే చూచి పరిహసిస్తున్నట్లు బాధపడుతున్నాడు, దేవేంద్రుడు.

వైరోచనుని కీర్తితారలు చతుర్దశ భువనవీధులలో ప్రకాశిస్తున్నవి; దేవేంద్రుని కన్నులలో బలి యశశ్చంద్రికలు, శూలాలై పొడుస్తున్నవి.

ఆచార్య బృహస్పతి ధిషణ అసురసేనానీక నిర్మూలనోపాయాన్వేషణలో అశక్తతను మౌనంగా అంగీకరించింది. శ్రీశూన్య భువనంలో దేవతలు నిరాశోపహతులుగానే జీవించాలి. వైకుంఠుని వక్షఃస్థలంమీద శ్రీదేవి కపోలాలఅరుణిమ ప్రతిఫలించే వరకూ దేవేంద్రుడు సుధర్మాస్థానాన్ని అధిష్ఠించలేడు. అన్యథాశరణం నాస్తి.

అదితేయులు ఆవేదనాద్భాదితాననులై అమరేంద్రుని అనుసరిస్తుండగా అమాత్య బృహస్పతి అగ్రగామిగా చతుర్ముఖుని సాంత్వనవచనాలతో క్షీరసాగర శయనుని మందిరానికి నడిచారు.

లక్ష్మీ వియోగసంజనిత బాధాగతోచ్ఛ్వాసనిశ్వాసయుతు డయిన మహావిష్ణువు శిరఃకంపంతో అభివాదాలందుకొన్నారు.

విషయాన్ని వివులంగా విన్నవించారు విధాత.

సావధానచిత్తుడై సకౌతుకలోచనాలతో ఆకర్ణించారు మహావిష్ణువు.

ఆయన మోములో మందహాసం ఛాయగా ప్రవేశించింది. స్వామి విచారవదనాన్ని వీక్షించలేక వ్యథపడుతూన్న వైనతేయుడు ఒక్కసారి రెక్కలు విదలించినాడు; స్థానభ్రష్టులైనారు నిర్జరవీరులు. అంతలో పరిస్థితి ప్రశాంతమయినది. దేవతలవైపు ఆదర దృక్కులు బరపుతూ :

'పరిణామం మాయాజన్యమైన సృష్టి లక్షణం. మాయాబద్ధమయిన ఈ సృష్టి చిత్రాతిచిత్రగతులతో పయనిస్తూంటుంది. సృష్టి స్థితి లయకారులమయిన మాకుకూడా మాయా విమోహితత్వం ఉన్నది. సృజన, పాలన, విలయశక్తులు మాలో ఉండాలంటే వాణీ రమా ఉమలు ప్రక్కనుండాలి. ఉమా, వాణీ యథాపూర్వం శంకర బ్రహ్మల కాలంబనంగా ఉండటం వల్ల, లయ సృష్టులలో వైపరీత్యంలేదు... స్థితికారకుణ్ణి — శ్రీరహితుణ్ణి కావటంవల్ల ఈమార్పు కలిగింది. లక్ష్మీచిహ్నాలైన ఐరావత కల్పవృక్షాలూ ఓషధీశుడయిన చంద్రుడూ క్షీరసాగర గర్భంలోకి ప్రస్థానించటం వల్లనే దేవేంద్రుడూ, దేవసేనానులూ నిర్వీర్యులయారు. ఈఐశ్వర్యాలను సాధించిననాడుకాని అమరావతిని స్వాధీన

పరచుకోలేం. అందుకు తగిన యత్నం సాగించిన అనంతరం అమర పరాజయం'.

అని ఆగి అందరివైపూ దృష్టి మరల్చి,

అందుకు ఒకే ఒక్కమార్గం ఉన్నది. వస్తుసర్వస్వ నిక్షేపమైన క్షీరసాగరాన్ని మథించాలి, అన్నారు.

మహాసాగరాన్ని భాండంగా భావించిన దేవతల హృదయాలు గతుక్కుమన్నవి. వారికన్నులు ఒండొంటిని ప్రశ్నించుకున్నవి.

అమరేంద్రుడు బృహస్పతిని చూచినారు; ఆచార్య బృహస్పతి నేత్రాలలోని ఆశారేఖలు అమరేశ్వరునికి ఆనందాన్ని కలిగించినవి. చతురాననుడు నిశ్చలదృక్కులతో మహావిష్ణువి ముఖపద్మాన్నే చూస్తున్నాడు. అమరుల ఆంతర్యాన్ని అవగతం చేసికొన్న మహావిష్ణువు అన్నాడు :

"భయం లేదు; ఊహకు ఉపాయా లందకపో... అపాయం లేని ఉపాయాన్వేషణ సాగించాలి. దానికి సాహసం అవుసరం. సురాసుర సమ్మేళనం కార్యసాధనకు సహకరిస్తుంది" శ్రీపతి ప్రసంగం అమరుల నాశ్చర్య చకితులను చేసింది. ఒకరినొకరు చూచుకొని అలబ్ధ సమాధానులై తిరిగి విష్ణువువైపే చూశారు.

"మందర పర్వతం కవ్వంగా వాసుకి రజ్జువుగా అమరాసురులు క్షీరసాగరాన్ని మథించాలి"

అపాయ రహితమయిన ఉపాయాన్ని ఈ విధంగా చెప్పేసరికి అమరుల ఆలోచన సన్నగిల్లినది; అమరేంద్రునకు అవగాహనయే కాలేదు.

ఆచార్య బృహస్పతి మోములో మందస్మితం కొంత అమనయాన్ని కలిగించినా అది అమరుల అసంతృప్తిని వారించలేక పోయింది.

కర్తవ్యనిర్దేశం చేసి సుఖోపశయనుడయినా అడుగు కదల్చని అమరులను చూచి :

"అర్థమయింది మీ అంతర్వ్యథ. కాలగతికి ఎదురీది ప్రయోజనం లేదు. అవకాశప్రాప్తి పర్యంతం ప్రతికక్షికి 'దాసోహం' అనాల్సిందే. క్షీరసాగర మథనంలో ఒక దివ్యౌషధం జనిస్తుంది; అది అమృతం; అమృతాస్వాదనం చేసినవారు జరామరణ శూన్యులవుతారు. అమృతపాయులై, వజ్రహస్తుడై విక్రమించిన అమరేంద్రుని కెదురుండరు. అమరులకు అమృత పానప్రలోభం కలిగించి మథనోన్ముఖుల్ని చేయండి."

అని విశ్రాంతి తీసికొన్నాడు.

3

ఆశ్చర్యపోయారు అసురులు; ముక్కుమీద వేలేసుకున్నారు అసుర కాంతలు; బుగ్గలే నొక్కుకున్నది అసురీ వృద్ధనారీ జనం.

అమరావతిపై కిషోరాగారుణచ్ఛాయలు లాస్యం చేసిన సుముహూర్తంలో అసురీబృందంతో దేవవందులు కూడా బలికి వైతాళికగానం చేయడం అసుర జాతికే కాదు, అమరేతరులందరికీ ఆశ్చర్యజనకమే అయినది.

వింధ్యావళి అంతఃపురంలో శచీదేవి 'సౌలభ్యాయవికురా' లయినది. సురర్మాస్థానోపవిష్టుడయిన బలిచక్రవర్తి ఆంతరంగిక సచివుల ప్రక్కనే దేవేంద్రుడు దాసీమడయినాడు. సింహద్వారాలలో అసురనగర పాలకులు దండధరులై నమ్రశీర్షాలతో అసుర సేనాపతులకు స్వాగతం యిస్తున్నారు. కింపురుష, కిన్నర, గంధర్వులు అమరావతిని సకలకళాసమన్వితం చేస్తున్నారు. అసురులు ఆత్మౌన్నత్యాన్ని ఉగ్గడించుకుంటూ దేవపరిచారకులపై దురహంకారం చూపుతున్నారు.

* * *

త్రిలోకసంచారి మహతీ స్పందనం విని వినగానే బలి ఆసనందిగి ప్రత్యుత్థానంచేసి వార్తా విశేషాలడిగాడు. నారదుని మోములో నవ్వు అవనతవదనుడయిన దేవేంద్రుని అపహసించి నట్లనిపించినా భావ్యర్థాపేక్షతో తలయెత్తలేదు. దైత్యసేనా... పురోగాములుగా నారదుడు అమరావతీ పునర్నిర్మాణ పర్యాలోకనం చేశాడు. తిరిగి తిరిగి అంతఃపుర పార్శ్వస్థసౌధం సమీపించగానే ఒక్కొక్కరే వెనుదిరిగినారు. నారదుడు ముందడుగువేసి అంతఃపురం ప్రవేశించినాడు.

బలిచక్రవర్తి ధర్మపత్ని వింధ్యావళితో వినోదార్థం కందుక క్రీడ సాగించే త్రిలోకైక పూర్వసమ్రాజ్ఞి శచీదేవి నతమస్తకయై అంజలించి దేవర్షిని ఆహ్వానించినది. వింధ్యావళి వినయ వినమితోత్తమాంగియై దేవర్షికి అర్ఘ్యపాద్య సమర్పణంచేసి, సుఖాసీనుడయిన ఋషిని స్వర్లోకవిశేషాలపై వ్యాఖ్యానం చేయుమన్నది.

శచీదేవి నవారవిందనదృశహృదయంపై కర్కశకంటకంలా

గుచ్చుకొన్న వింధ్యావళి ప్రశ్నకు నారదుడు నవ్వే మౌనమే వ్యాఖ్యానంగా ఇచ్చినాడు. వింధ్యావళి సిగ్గుపడి, భువన భవనంలోని రహస్యాలు కోరింది. సతతసంభాషణ ప్రియుడయిన నారదుడు ప్రయత్నసంజనిత స్మితశ్రీరోచులతో, వి(భ్ర)మాశ్చర్యచకిత దృక్కులతో కొన్ని క్షణాలు గడిపి "వింధ్యావళీ అంతఃపుర పరివారానికి శచీదేవి ప్రతినిధికావటం...

నారదుడు ప్రారంభించిన ప్రథమ వాక్యం సమాప్తం కాకుండానే శచీదేవి పాణికిసలయాన్ని వింధ్యావళి తన పద్మహస్తంలో సంధిస్తూ,

"దేవర్షీ! స్వర్లోక విశేషాలపై వ్యాఖ్యానించ నిరాకరించి న్నవచోవ్యాఘాతం...".

అంటుండగా నారదునిముఖంనుండి వెలువడిన మహాహాసం మిగిలిన వాక్యాన్ని పలుక నివ్వలేదు.

వింధ్యావళి మోము చిన్నబోయినది ; అంతలో చిరునవ్వు తెచ్చికొని :

'ఊరకిరారు మహాత్ములు'

అన్నది.

"వింధ్యావళీ! చతుర్దశభువనసంచారోద్యోగ నియుక్తుడయిన నారదుడు ఊరక ఉండలేడు."

నవ్వుతూ శచీదేవివైపు ఆదరదృక్కులు బరపి నిష్క్రమించినాడు.

అంతిపురినుండి ఆస్థాన సభాస్థలికి విచ్చేసే దేవఋషిని అమర కాంతలూ, అప్సరోభామినులూ దరహాస ధవళితకపోల

కాంత్యుద్దీపితవదనారవిందవికసిత లోచనద్వయాలతో అవలోకించినారు. మిల మిల లాడే వారి కన్నుల నుండి నారదుడు దాటిపోయినాడు.

అగాధదృశ్యంతో అటే చూస్తున్న అమర కాంతలు సంతోషసమయసంజనిత పులకాంకురోద్వేగ మనస్కలై, ప్రస్తోత్తరీయాంచలాలను సవరించనేలేదు.

మదూరాన వల్లరీవనంలో విలాసవిహారం చేసే అసుర వీరులు సౌందర్యావలోకనం చేస్తూ ఫకాలున నవ్వినారు. పరాధీన చింతాయత్త చిత్తులయిన అమరుల గుండెలలో శకిల కిలలు చురుక్కున పొడిచినవి; అంతలో వారి పిడికిళ్ళు బిగిసి, బిత్తాళైగపినవి; అయినా దేవేంద్రుని ఆజ్ఞ:

'అంతరాలలో అగ్నిశిఖలు ప్రజ్వరిల్లుతున్నా ఆననాలతో హాసరోచులే ప్రసరించాలి.'

దేవేంద్ర శాసనం దేవపరిషత్తుని లాలించి, జోలపాడి జోకొట్టింది.

దేవర్షి నారదునికి వీడ్కోలీయటానికి సర్వసచివసమేతం బలి నగర ద్వారాన్ని సమీపించినారు. నారదుడు మహానందంతో బలిని అభినందించి ముందడుగు వేసినారు. వచ్చిన నారదుడు వచ్చినట్లే వెళ్ళిపోవటంలో ఏదో ఆంతర్యం ఉండకపోదని అసుర సచివులందరూ ఆలోచించ సాగినారు.

అంతలో వెనుదిరిగి:

'దాన పురుషా! చతుర్దశభువనాలూ నీ దానాన్ని అభివర్ణిస్తూంటే నా హృదయం చంద్రోదయసమయసంతోషోత్తుంగ తరంగిణియైన క్షీరసాగరంవలె ఉప్పొంగి పోయింది కా...ని...

అన్నారు.

క్షీరసాగరం :

ఈ పంచాక్షరి దేవేంద్రుని శరీరంలో పులకరింపచేసింది. అతని కన్నులలో ఆశారేఖలు లాస్యము చేసినవి; భుజము లదికినవి.

నారదుని ప్రసంగం అకస్మాత్తుగా ఆగిపోవటం, రక్షో నాథుణ్ణి అభినందిస్తూ దీరనంగా నిట్టూర్పుటం అసుర సచివులను కలవరపరచినవి. అందరూ ఒక కంట బలినీ, వేరొకకంట నారదునీ చూస్తున్నారు.

నారదుని ఇంగితాన్ని యోచించలేని బలి:

'దేవఋషికి దానం ఈయదగ్గదీ;...'

చేతులు జోడించినాడు.

'దానశీలుడికి అందరూ భిక్షుకులుగా కనిపించటంలో ఆశ్చర్యం లేదు. అయితే నేను దేవ-దానవ మిత్రభేద భిక్షార్థినై రాలేదు. అమరాసురైక్యము ప్రపంచశాంతి సంధాయకమని మేము కన్నకలలు ఫలించినవి. భువనభవనంపై శాంతి దేవత సురుచిరస్మితం తాండవిస్తున్నది...'

అని సర్వసభ్య సమాలోకనం చేసి -

'ఐరావతం, ఉచ్చైశ్శ్రవం, కల్పవృక్షం, కామధేనువు లేని అమరావతిని చూడటం కొంత బాధగానే ఉంటుంది. శశాంకరహితభువనసంచారంలో ఇంత బాధలేదు. అయినా భ్రాతృవర్గం పూర్వవైరుధ్యాలను విస్మరించి ప్రశాంతజీవనం సాగించటం ఎంతో సంతోషకరంగా ఉన్నది.'

మహతి స్పందనం కైలాసమార్గాన ప్రస్థానించినది.

*　　*　　*

ఐరావతంలేని అమరావతిలో అంత భోగంలేదు. ఉచ్చై శ్శ్రవం అధిరోహించని అమరాధిపతిత్వంలో ఔన్నత్యం లేదు. కల్పవృక్షచ్ఛాయలలో తీరని కోరికలను తలచుకుంటూ అను భవించే అవకాశంలేని అమరావతి ప్రత్యేకతలేదు. తరుణ శశాంకకిరణరహితమైన యామినులలో అప్సరస్త్రీలతో భోగమా?

నారదుడు పలికి పోయిన వాక్యాలు రాక్షసజాతి నంతనూ కలతపెట్టినవి. నలుగురు కూడినచోట కల్పవృక్షం, ఐరావతం, ఉచ్చైశ్శ్రవం లేని ప్రసంగాలు లేవు.

రంభ కదులుతుంటే,

ఊర్వశి కన్నులు మిలమిలలాడిస్తుంటే,

వరూథిని దూరదూరంగా తొలగుతూంటే,

మేనక మేలమాడుతుంటే-శశాంకుడు స్మృతికి వస్తున్నాడు.

అంతఃపురాలలోంచి అసంతృప్తి చక్రవర్తి పార్శ్వానికి చేరుతున్నది. బలి విచారించలేదు; వివిపించినట్లే లేదు బలికి.

రోజులు గడిచేకొద్దీ అంగరాంతరాలలోని అసంతృప్తి నెమ్మది నెమ్మదిగా చక్రవర్తి కర్ణాలలోనికి నేరుగా ప్రవేశిస్తున్నది. ఎటుచూచినా యిదే ప్రసంగం అయేసరికి బలి మనస్సు చీకాకు పడసాగింది; అయినా బలి వాటివిగూర్చి ప్రస్తావించటంలేదు.

'ప్రభూ!'

చకితుడై నాడు బలి.

అసురసచివులు అశనిపాతమయినట్లు తిరిగిచూశారు. అమరాధిపతిగా నైకశతతలాల సచివసహితుడై సాయంవాహ్యాళి సాగించే బలిచక్రవర్తిని ఇంతకాలానికి దేవేంద్రుడు 'ప్రభూ' అని సంబోధించటం విచిత్రంగా కాదు, విపరీతంగా కనబడ్డది.

'అందరికీ ఐరావతాన్ని ఆలోకించాలని, ఉచ్చైశ్శ్రవంపై అధిరోహించాలని, కల్పవృక్షాన్ని ఆశ్రయించాలని, జ్యోత్స్నానిశలలో కేళీవిలాసాలు సాగించాలని...

ఆగి, అందరివైపూ చూస్తూ బలికి ప్రక్కనే ఆసీనుడయినాడు.

'అనంతరం'

మదగంభీర స్వరంతో పలికినాడు బలి.

'వాటిని సాధించటం కష్టమే. మార్గమూ క్లిష్టమే. అయినా ధీరులూ, ధీశాలులూ అయిన మనసోదరులందరూ పూనుకుంటే అది సాధించలేకపోము, శ్రమ అవసరం. శ్రమరహిత ఫలానుభవానందం వీరుడికి ఉండదు. శ్రమసమయ సంజనిత దుఃఖనివృత్తి ఫలప్రాప్తిలో ఉంటుంది. అప్పుడు కలిగే ఆనందం...'

'అసలు సాధనోపాయం ?'

అసుర సచివుడు బొమముడి బిగించి అన్నాడు.

'ఉపాయాలు ఉన్నవి. అయితే ఐరావతాదులన్నీ క్షీరసాగర గర్భంలో ఉన్నట్లు మీకు తెలిసే ఉంటుంది. ఆ సాగర మథనం చేస్తే కాని అవి లభ్యపడవు. క్షీరసాగర మథనం వల్ల 'అమృతం' అనే దివ్యౌషధి లభిస్తుందని ఒక వదంతి.

జరామరణ రాహిత్యం అమృతాస్వాదన ఫలం. ఆలోచించండి. అన్నదమ్ములం. కలిసిమెలిసి ఉంటున్నాం. ఐరావతాదులతోపాటు అమృతంకూడా లభిస్తుంది.'

అని నదీ ప్రవాహంలోకి దృష్టి మరల్చారు.

'క్షీరసాగరం దధిభాండం అనుకున్నట్టున్నారు దేవేంద్రులు.'

బలి అంతరంగిక సచివుడు కుదికన్నొమ నెగురవేసి, ఎడమకన్నరమూసి, హేళనగా అన్నాడు.

'క్షీరసాగరం దధిభాండం ఎలా అవుతుంది ? క్షీరకలశమే అవుతుంది. దధిభాండ మధనానికి దేవ-దానవుల . శ్రమ అనవసరం. క్షీరసాగరకలశంలో మందర నగాన్ని వేసి వాసుకి రజ్జువుగా...'

దేవేంద్రుని వివరణ పూర్తి కాకుండానే అమరసేనానులు వికటాట్టహాసం చేశారు.

బలిమౌనముద్రలో నేఉన్నాడు. దేవేంద్రుని హృదయం కుతకుతలాడింది. లలాటంలో ముడివడ్డ భృకుటి మూడవకన్నులా భాసించినది. సాహసిస్తే జరిగేదీ, జరిగేదీ లేదు; ఓరిమి వహించాలి.

''ఐరావతాదులు, అమృతం అవుసరమని మీరు భావిస్తే మందరగిరిని కదల్చటం వాసుకిని రజ్జువుగా చేయటం మావంతు. ఈ రెండూ అసాధ్యం అని మీరు అపహసిస్తున్నారు. అంతవరకూ నేను సాధిస్తాను. మధనసమయంలో దేవ-దానవులు సహకార భావంతో సంచరిస్తే చాలు.''

లేచి నిలబడ్డారు, దేవేంద్రుడు.

సచివ ముఖావలోకనం చేసి దానవజనహితం దేవేంద్రుని మాటలలో ఉన్నదని బలి గమనించి :

" అంగీకరించాం. అనంతరకర్తవ్యం నిర్వర్తించి క్షీరసాగరం దగ్గరకు అమరులను నడిపించు. మేము మా సేనా నివహంతో అక్కడే కలుస్తాం."

బలిమాటలు దేవేంద్రుని హృదయంలో ఉత్సాహ తరంగాలను రేకెత్తిస్తే, అమరాసురులను ఉవ్విళ్ళూరించినవి.

జంభ, శంబర, కుంభ, నికుంభ, మయ, మాలి, సుమాలి, పౌలోమ, కాలకేయ, నముచి, తారక, బాణ, అరిష్టనేమి, నివాతకవచాది రాక్షస సత్రవర్తులందరిపీ అనుదినం అమృతాస్వాదనాయత్తచిత్తుల్ని చేయటంలో, నిమగ్నులైన అసుర సేనాను లందరూ తమ తమ మిత్రులతో దేవేంద్రుని అహ్వానా లందుకున్నారు.

ఒకరి భుజాలపై ఒకరు చరుచుకొని మహోత్సాహంతో దేవేంద్రుని అనుసరించారు. సురాసుర సేనానివహంతో దేవేంద్రుడు వస్తున్న వార్త నారదుడు మహావిష్ణువుకందజేశాడు.

రమాపతి మనసులో ఆనందవల్లరు లంకురించి, పల్లవించి, కోరకించి, కుసుమించినవి. ఆబాలగోపాలం నారదునికి నమస్కరించి, శేషశాయికి అభివాదాలర్పించారు. పరిశీలించి చూచి మహావిష్ణువు నారదునివైపు సాభిప్రాయంగా తిరిగాడు. విష్ణువు కనులలోనే ఇంగితాన్ని గుర్తించి నారదుడు కదలినాడు. నారదుని మహతీ స్పందనంలో పలికిన గీతార్థం విష్ణువుకి ఆశ్వాసన నిచ్చింది.

బలిని సైన్యసమేతంగా మందరగిరివద్దకు తీసికొని వస్తానని చతుర్ముఖునితో చెప్పి నారదు డమరావతి వైపు ప్రస్థానించినాడు. మహావిష్ణువు శేషతల్పందిగి శేషుని వెంట రమ్మన్నాడు.

అప్పుడే అమృతం లభించినట్లూ, ప్రతివారి పానపాత్ర లోనూ పూరింపబడి పెదవుల కందింపబడుతున్నట్లూ భావించు కొంటూ అసురులు చప్పరింతలతో నడిచారు.

అమృతపానం చేసి మహాబలులైన రాక్షసులను సంహరించ డానికి ఉద్యుక్తులయినట్లు భుజాలు చరుచుకుంటూ దేవతలు సాగుతున్నారు.

* * *

సర్వౌషధీ రసవిశేష సంపన్నమయి, ఏకాదశ సహస్ర యోజన విస్తీర్ణమయిన మందరగిరి మ్రోల నేల ఈనినట్లు దేవ, దానవ, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుషులు మస్తకన్యస్త హస్తులయి నిలబడి ఏకకంఠంతో పర్వతాధిష్ఠాన దేవతను స్వరయుక్తంగా ప్రార్థించారు.

నగాధీశుని శిలాహృదయం ద్రవించింది.

దివ్యమోహనాకారంతో గిరిశిఖరంమీద చిరునవ్వులు జల్లుతూ నిలబడ్డాడు. అదే సమయానికి ససైన్యంగా విచ్చేసిన బలిని చూచి నగాధీశుడు కన్నులు మిలమిల లాడించాడు.

భువనభవనంలోని భిక్షుకజనానికి తృప్తికలిగించిన దాన పురుషుడు తన యెదుట అంజలిబద్ధుడై నిలబడి ఉండటం, సర్వపర్వత పక్షవిచ్ఛేదకుడయిన వజ్రపాణి ఆ వెనుక నత శీర్షుడై ఉండటం నగాధీశుని అనందాన్ని అవధుల నతిక్రమింప జేసింది.

"సమాగత సర్వలోక సభ్యజనతాభీష్టం పర్వత శేఖరునికి నివేదించే పునరుక్తిదోషం......"

అంతవరకూ పలికి ఆచార్య బృహస్పతి చతురాననునివైపు తిరిగారు; చతురాననుడు ఉమాపతి నవలోకించినాడు; ఉమాపతి లోచనము లాలోచనా పూర్ణములై రమాపతి నాలోకించినవి; రమానాథుడు సాదర పూర్ణస్మిత వదనంతో నగాధిష్ఠాన దేవతవైపు దృష్టి మరల్చినాడు.

చతుర్భుజుని కనుబొమ్మలలో ప్రతిఫలించే ఆవేదన, అమరాసురుల మోములందు ప్రజ్వలించుచున్న ఆకాంక్ష అవగత మయిన నగాధీశుడు అంగీకారసూచకంగా తలవాల్చినాడు. ఒక్కపెట్టున మహోత్సాహంతో త్రిమూర్తుల ఆజ్ఞానుసారం దేవ, దానవులు మందరగిరిని కదలించి భుజాలమీది కెత్తుకున్నారు. త్రిమూర్తుల వెనుక చెట్టపట్టాలు కట్టుకొని, మందరగిరి వాహకులకు ఉత్సాహోద్దీపనంచేస్తూ నడిచే దేవేంద్రునీ, బలినీ చూపింది వింధ్యావళికి శచీదేవి. వింధ్యావళి శచీదేవి చిటికినవ్రేలికి ఇంద్రమణిస్థగిత స్వర్ణాంగుళీయకాన్ని కై సేసినది.

* * *

ప్రమాదం...ప్రమాదం'

ఆనంద నౌకపై సంతోషసాగరంలో విహరించే వింధ్యావళి శచీదేవి మాటలువిని క్రిందికి చూచింది. ఏముంది! మందరగిరి మహాభారాన్ని భరించలేక అందరూ ఒక్కసారిగా వదిలేశారు. మందరపాతంతో భూగోళమే పరిభ్రమించటంఆగింది. వింధ్యావళి వణికిపోయింది.

"అక్కా భయపడకు. అదిగో; అదే మహావిష్ణువు ఆదిశేషుని ఆజ్ఞాపిస్తున్నారు. అప్పుడే ఆదిశేషువు మందరాన్ని మహావిష్ణువు భుజాలమీద ఉంచినాడు. చూడు, మెలికలు తిరుగుతూ ఎంతవేగంగా పోతున్నాడో। ఆ వేగాన్ని అందుకోలేక అందరూ వాహనారోహణం చేస్తున్నారు."

శచీదేవి చెప్పిన మాటలన్నీ వింధ్యావళికి వినిపించలేదు. కన్నులు తెరచి చూచేసరికి మహాప్రళయ ధ్వానంతో మందరగిరి సముద్రంలోకి పోతున్నది. తాలోత్తాలంగా తరంగాలు లేస్తున్నవి. క్షీరసాగర శీకరాలు అమరాసురులను ముంచెత్తుతున్నాయి.

అప్రతిహతమయిన మహాముని శాపవాక్యంవలె సద్యః కాలంలో సముద్రతలాన్ని చేరిన మందరగిరి అమరాసురులలో విరాళమే రేకెత్తించినది. పెదవులు విరిచి ఒకరిపై ఒకరు దీనంగా చూచుకున్నారు. వ్యర్థశ్రమ రేకెత్తించిన కుపిత హృదయంతో జంభ, శంబర, కుంభ, నికుంభాదులు దేవేంద్రునిపై అరుణదృక్కులు ప్రసరించారు. ఇంద్రుడు మ్లానవదనంతో ఆచార్యబృహస్పతివైపు తిరిగారు. అమాత్య బృహస్పతి ఆలోచనాముద్రలో ఉన్న మహావిష్ణువును క్రీగంట చూచినాడు.

దేవతల ధైర్య, స్థైర్యాలు చ్యుతమవు తున్నవి.

లక్షయోజన విస్తీర్ణ మహాకచ్ఛపం సముద్రగర్భంలోకి చొచ్చుకుపోయింది. మరుక్షణంలో మందరగిరి శిఖరం దృగ్గోచరమయినది; మరికొన్ని లిప్తలలో గిరి అర్థభాగం పైకి తేలింది. పూర్వాజ్ఞానుసారం వాసుకి శరీరాన్ని పెంచి మందరగిరిచుట్టూ మడి తిరిగినాడు.

మహాగిరి శిఖరం దృశ్యమానం కావటంతో కొనలుదేరిన ధైర్యోత్సాహాలు. వాసుకి రజ్జువుకావటంతో ఊహలే తన్నుకున్నవి. దేవ, దానవులు రెండు పక్షాలుగా విడిపోయారు. విడుతూనే దేవతలు వాసుకి శిరోభాగాన్ని చేరారు.

మయుడు కనుబొమ ఎగరేశాడు.

తుంబురుడు కోరమీసం మెలిద్రిప్పాడు.

బాణాసురుడు జబ్బచరిచాడు.

కాలకేయుల కన్నులలో చింతనిప్పు లెగసినవి.

ఒక్కరూ అడుగు కదల్చలేదు.

'అధికారవర్గంలో ఉన్న దానవ వీరులు పుచ్ఛభాగాన్ని హేయంగా పరిగణిస్తున్నారు। శిరోభాగాన్ని వారికి వదలండి.

అని హెచ్చరించాడు నారదుడు.

తమ రహస్య యత్నం సక్రమంగా ఫలించినందుకు మహానందభరితహృదయులై దేవతలు పుచ్ఛాన్ని అందుకున్నారు. దానవులు దేవతలను అవహసిస్తూ శిరోభాగాన్ని హస్తాలతో బిగబట్టి మధన ప్రారంభించారు.

క్షీరసాగరం

పరిభ్రమిస్తున్నది మందరగిరి
నలిగిపోతున్నాడు వాసుకి
ఆదికూర్మం చలించటంలేదు

"ఎడమ తుది మునుపు దిరుగుచు
తుది వెరమమ వెనుకదిరుగుచు కులగిరి కదలిన్
గతశెరల మరల నెనురుల
శౌరితారి ఫణిఫణము మొదలు తుదియునుదిరుగన్.

పడిగొని కులగిరి దిరుగగ
జలవిధి ఖగ మకర కమఠ ఝషఫణిగణముల్
ఘురిపడ దడబడు కెలకుల
బడు భయపడి ఎగసి బయలిపడు సురలిపడున్.''

తిమి, తిమింగిల, తిమింగిలగిల, క్రకచ, కచ్ఛప, కాకోదర, చక్రవాక, బక, బలాక, మరాళ, భేక, సారసాది సర్వ జలచర సమూహాలు మహాసంఘర్షణోపహతములై నశిస్తున్నవి.

మహాఘోష ఆరంభమయినది. ప్రావృట్కాలాంబరవీధీ విహరణమాన పుష్కలావర్తకాంభోధర వినిర్గతపర్జన్య విస్ఫోటావద్భుత ధ్వనులు చతుర్ద భువనవ్యాప్త జడచేతన జీవకోటిని బధిరీభూతం చేస్తున్నవి. కల్లోలాల తరంగపంక్తులు వజ్రచ్ఛేదిత హిమగిరులవలె పతనమవుతున్నవి.

అంతలో భుగభుగ పొగలు రేగినవి; చిటపట విస్ఫులింగము లెగసినవి; ధగధగల అగ్నిశిఖలు ప్రజ్వరిల్లినవి.

మందరం పరిభ్రమిస్తూనే ఉన్నది
వాసుకి నలుగుతూనే ఉన్నాడు
ఆదికూర్మం చలించటంలేదు

నిర్లక్ష్యంగా దేవ, దానవులు ముందువెనుకల కూగుతూనే ఉన్నారు. పెటపెట ధ్వనులు ఆకాశాన్ని అంటుతున్నాయి. విశ్వప్రళయవేళ ఫాలలోచనుని లోచనత్రయంలోంచి వెలువడే విలయాగ్ని కీలాసదృశానలాన్ని సహించలేని దేవదానవులు ఎక్కడి వారక్కడే వాలిపోయారు.

శచీదేవి గుండె గతుక్కుమన్నది.

వింధ్యావళి స్మృతిరహిత అయినది.

వాణి విచలితనేత్రాలతో చతురాననుని ఆలోకించినది. కమలాననుడు కపర్ది వైపు కనులు త్రిప్పినాడు. శశాంకశేఖరుడు హైమవతి నాలోకించినాడు. ఉమ మందహాసం వాణి చతురాననుల కనులలో ప్రతిఫలించినది. వాణీశుడు ఉమాపతి నర్థించినాడు. హైమవతి మంగళసూత్రములు కనుల కద్దుకొని భర్తవైపు చిరునవ్వుతో చూచినది.

అనవరత దరహాసభాసుర కపోలపాళికలను శశాంకశేఖరుడు ఒత్తిముద్దాడి అడుగు కదిపి మహాశక్తిసంపన్నముగ ఉచ్ఛ్వసించినాడు. విలయదృశ్య ప్రదర్శన సమర్థమైన హాలాహలం శశాంకశేఖరుని గరళగ్రీవుని చేసినది. పార్వతి సగర్వముగ కనుబొమ లెగురవేసినది. సర్వ దేవదానవులు స్మితవదనాలతో వాసుకిని సమీపించినారు.

శ్రీ

మందరం పరిభ్రమిస్తున్నది
వాసుకి నలుగుతున్నాడు
ఆదికూర్మం చలించటంలేదు

ఉచ్చారణ దక్షులయిన మహర్షులు చతురాననుని ఆజ్ఞానువర్తులై ఉదాత్తానుదాత్త స్వరిత సర్వసమ్మేళనంగా మంగళ దేవతలను ఆహ్వానిస్తున్నారు.

దేవర్షినారదుని మహతి కీర్తనదేవతా స్వాగతగీతాలాపం చేస్తున్నది.

వాగ్దేవి, హైమవతులు సుదూరాన గగనవీధిలో, నిలిచి ఒకానొక మహాశక్తి శుభోదయాన్ని నిరీక్షిస్తున్నారు.

వారి పార్శ్వభాగాన నిలిచిన శచీ - వింధ్యావళి విస్మయకరదృశ్యదర్శన చకిత లోచనాలతో ఉచ్ఛ్వాస-నిశ్వాసలను మందగతిని సాగిస్తున్నారు. దేవదానవుల కనులలో ఆకాంక్ష అధికతరమవుతున్నది; వారి హృదయాలలో అమృతపానేచ్ఛ ప్రబలుతున్నది; దేవేంద్రుని మనస్సీమలో సుధర్మాస్థానం చిందులు త్రొక్కుతున్నది.

కాల మహాపురుషుని రథచక్రాల తాకిడికి తట్టుకోలేక కొన్ని దివారాత్రములు నలిగిపోయినవి. అహోరాత్రదీక్షతో అహీనబల సంపన్నులు మహాకృషి సాగిస్తున్నారు. ప్రతి ఉదయం వారిలో ఒక నూతనోత్తేజాన్ని రేకెత్తిస్తున్నది.

ఉదయాచలాన ఉషోరాగిణి రంగవల్లులుదిద్ది, ఒయ్యారపు నడకలతో, జిలిబిలి చూపులతో, బాలభానుని ఆహ్వానిస్తున్నది.

బాలభగవానుడు సునులేతకిరణాలతో ఉషోదేవి వదనశ్రీని ధవళితంచేసి లాలించి అంతఃపురానికి దారిచూపినాడు.

ఉదయ సూర్యుని జవనాశ్వసప్తకం మనోవేగంతో పయనిస్తున్నది.

వాణీ, పార్వతులు కైదండ ఇచ్చి ఆమె వదనారవిందం మీద శీకరాలను పైటచెంగులతో ఒత్తినారు.

కన్నెత్తి కమలనేత్రుని చూడటానికి సిగ్గుపడింది ఆకర్ణాయతలోచన.

పద్మనయనుడు పద్మాక్షిని క్రీగంట చూడకుండా ఉండలేకపోతున్నాడు.

బ్రహ్మర్షి సమేతుడైన చతురాననుడు మంగళసూక్తం పఠించాడు. నారదుని మహతి శ్రీరాగాన్ని పలుకుతున్నది. దేవవనితలు శ్రీదేవిని మంగళస్నానం చేయించారు. సముద్రుడు దివి చీనాంబరాలిచ్చాడు. క్వణదణుకింకిణీ కలిత కాంచన కాంచీ, కంకణ, కటక, కేయూర, తారహారాదులూ విశ్వకర్మ సమర్పించాడు. తుషారశీతం మధురసభరిత పుష్పవినిర్మిత వైజయంతీమాలను వరుణు డొసంగినాడు. వాణి ముత్యాలహారం ఇచ్చినది. హైమవతి కొప్పుముడిచి విరులుంచి, కస్తూరీతిలకం దిద్దినది. శచీదేవి బుగ్గచుక్క తీర్చినది.

సర్వాంగాలంకృత శోభనాంగి అయిన శ్రీదేవి సౌందర్య సుషమ నిఖిల దేవ, దానవసమాజాన్ని అచేతనగాత్రుల్ని చేసింది.

పరివేష్టించి ఉన్న సిద్ధ, సాధ్య, గరుడ, గంధర్వ, యక్ష, రాక్షస, దేవ, దానవులందరనూ ఒక కనుత్రిప్పుతో పర్యాలోకించి పెదవి విరిచినది. ఆ విరుపులో మేరునగోన్నతుడైన మహావిష్ణువు మనోజ్ఞమందస్మితం పరమేశ్వర, ప్రజాపతులకే గోచరించింది.

ఇంద్రనమర్పిత నవరత్న ఖచిత కాంచన కళ్యాణవేదిపై చతురాననుని ఆజ్ఞానుసారం మహావిష్ణువు ఆసీనుడయాడు.

నవోదిత లజ్జారరహిస నమ్మిళిత వదనశ్రీ విరాజిత అయిన శ్రీదేవిని వామభాగాన కూర్చుండబెట్టినది హైమవతి. చతురాననుడు బ్రహ్మపీఠం అధివసించి కళ్యాణమంత్రాలు కలస్వనంతో పలికాడు. బ్రహ్మర్షులు ఆశీర్వాదాలతో నవ వధూవరుల మూర్ధములపై అక్షతలుంచారు.

వింధ్యావళీ శచీదేవీ హారతులిచ్చారు.

దివ్యప్రభా రోచిఃపుంజ ప్రసార సమర్థమైన కౌస్తుభాన్ని జామాతకు సాగరుడు కానుకగా ఇచ్చారు.

శ్రీవత్స, కౌస్తుభ వైజయంతీ, వనమాలికా, తారాహారాలం కృతమైన మహావిష్ణువు వక్షస్థలంపై శ్రీదేవి అధివసించే సుముహూర్తాన నందనమందారాలు వర్షించినవి. శంఖ, వల్లకీ, వేణు, వీణా నిస్వనానుకూలనృత్యం సాగించారు గంధర్వభామలు. భువన భవనంలో శ్రీదేవి స్మితశ్రీ రోచులు విద్యుల్లేఖలను విహరింపజేసినవి.

పరిభ్రమిస్తున్నది మందరగిరి

నలిగిపోతున్నాడు వాసుకి

ఆదికూర్మం చలించటం లేదు

పరస్పర ప్రోత్సాహ వాక్యాలతో ముందు వెనుకలు ఊగుతున్నారు దేవదానవులు.

మందరగిరి చుట్టూ మహావర్తాలేర్పడుతున్నవి. తరంగాలు గగనవీధిని చుంబిస్తున్నవి. జలచర విధ్వంసం జరుగుతున్నది.

అంతలో...

అలౌకిక కాంతిపుంజంతో వారుణి వెలువడింది. దైత్య, దానవులు ఒక్క పెట్టున చతురాననుని చేత వారుణి తమకు కావాలన్నారు; కన్ను కదలికతో కమలాసను డంగీకరించాడు. మహానందభరిత హృదయంతో పునః మథనం ప్రారంభించారు.

సర్వఋషిమండలం ఉద్గాత్రంతో శోభనదేవతాసూక్తం పఠిస్తున్నది. అసిత, గాలవ, నారదాది దేవర్షులు స్వస్తివాక్యాలు పలుకుతున్నారు. మూర్తిత్రయం హిరణ్మూర్తిని ఉపాసిస్తున్నారు. నవవసంతవేళాంకురిత బాలసహకారారుణ పల్లవాస్వాద సంభరిత సంభూతకషాయకలకంఠాలతో కిన్నరకామినులు గానంచేస్తున్నారు. కరకంకణన్వగితమణిమయకింకిణీనిస్వనతాళగతిబద్ధలాస్యం సాగిస్తున్నారు గంధర్వ భామినులు.

శ్రీదేవి మోములో సిగ్గు దొంతరులూ, చిరునవ్వులూ శ్రీపతి హృదయానికి గిలిగింతలు పెడ్తున్నవి.

హైమవతి కనులలో గర్వరేఖలు శశాంకశేఖరుని గరళ గ్రీవాన్ని ధవళితం చేస్తున్నవి.

వాణి పెదవులపై రాగరక్తిమ వాగధీశుని కపోలాలను రాగరంజిత మొనరిస్తున్నది.

శచీదేవి భ్రుకుటిక్షేపంతో వింధ్యావళికి దూరమైనది.

బలి చేతిని వదలి ఇంద్రుడు దేవతలవైపు నడిచాడు.

అధీశుని అక్షిసంచలనాన్ని అనుసరిస్తూ దేవతలు ఒక్కొక్కరే ఒడ్డుకు చేరుతున్నారు. శంకాసంకుచిత నేత్రాలతో రాక్షసులు చూస్తున్నారు. అంతలో రాక్షసామాత్యులు

తరంగాలలోనుండి వెలువడే దివ్యజ్యోతిని అతిప్రయత్నంమీద చూశారు; చూపులలోనే అనుచరులకు కనుసైగలు చేశారు.

వనమూలికలతో

అమృత పూర్ణకలశంతో

దివ్య మనోహరాకారుడయిన పురుషపుంగవుడు భూమి మీద అడుగు మోపుతుండగా పారిజాత, కల్పకాలు, నవకుసుమ వర్షం కురిపినవి.

ఉదాత్తరమణీయభావపై భవవిలసితమహాకావ్యంవలె ఉన్న ధన్వంతరిని చూస్తూనే అంజలిఘటించి మౌనముద్రాలంకృతు లయారు మునులు. అబాలగోపాలం ఆనంద విస్మయాశ్చర్య దృక్కులతో నిలబడి పోయారు.

సురుచిరస్మితద్యుతిపూరిత వదనారవిందుడైన ధన్వంతరి, పరివేష్టిత ప్రాణికోటిపై ఆదరకటాక్షవీక్షణాలు ప్రసరించాడు.

అంతలో ఒకానొక రాక్షసుడు ధన్వంతరి హస్తంలోని అమృతకలశాన్ని సంగ్రహించి పరుగుతీశాడు. మరొక బలీయుడు అతని చేతులనుండి తస్కరించినాడు. ఇంకొక ధీరుడు చేయి మార్చాడు.

మత్సరగ్రస్త రాక్షసహస్తాలలో సుధాపూర్ణ స్వర్ణకలశం కాంచనకందుకంలా కదులుతూన్నది. పరమశివ, ప్రజాపతు లీవిచిత్రాన్ని వీక్షిస్తున్నారు. కొత్త పెళ్లికూతురుతో వాణీ - హైమవతులు ఛలోక్తులాడుతున్నారు.

ఎవరెవరి చేతులంలోనికి కలశం మారి జారుతున్నదీ పరీక్షగా చూస్తున్నారు విశ్వవార్తాహరుడు నారదుడు. వింధ్యావళి

కొరకొర చూచింది శచీదేవి. దేవతాలోకమంత కలకాన్ని పేరాక కంట మహావిష్ణువునూ చూస్తున్నారు.

విస్తుపోయి చూస్తున్నారు చతుర్ముఖుడు.

భుజకీర్తులు సరిదిద్దుకొంటున్నారు దేవతలు.

ఆచార్య బృహస్పతి ఆజ్ఞానుసారం మహావిష్ణువు పద పద్మాలాశ్రయించిన దేవేంద్రుని దీనవదనంలో అనిర్వచనీయానందరేఖ తళుక్కున మెరసి దిగ్భ్రాంతుని చేసినది.

నవవికసిత సుమసౌరభంలా వ్యాపించిన వార్తలోని సత్యాన్వేషణకు పూనుకొన్న రాక్షసులలో ఏ ఒక్కరికీ అమృతం స్పృహలో లేదు. కలశహస్తునితో అందరూ దృష్టి మరల్చకుండా ఒకే లక్ష్యంవైపు నడుస్తున్నారు.

'జగన్మోహిని' For Favour of Review.

అన్నది దేవర్షి వాణి.

ఈర్ష్యాపూరిత కషాయలోచనాంతో జగన్మోహినిని తదేకంగా చూచే శ్రీదేవి చటుక్కున దక్షిణభాగం చూచుకొన్నది., తన దృష్టి నైర్మల్యాన్ని విశ్వసించకుండా చేతులతో తడివింది: లేదు; మహావిష్ణువు తన ప్రక్కనలేదు. చరాలున మణిమయాసనం దిగి నాలుగడుగులు వేసింది. జగన్మోహినీ పార్శ్వవర్తులను పరిశీలించింది. ఊహూం। అక్కడా లేదు.

ఏమైనట్లు మనోహరుడు।

పాణిగ్రహణం చేయించిన పెద్ద ముత్తైదువ పార్వతిని అడుగుదామనుకున్నది. ఆవిడా కనిపించలేదు. ఒకవేళ

ఈ జగన్మోహిని పార్వతి కాదుగదా! శర్వాణీపతి తలత్రిప్పి తిరిగిచూసింది. పరమశివుడులేడు. తెల్లబోయి వాణిని సమీపించినది. జగన్మోహినీసౌందర్యావలోకనాయత్తచిత్తులైన వాణీశుడు హృదయాన్ని చిక్కబట్టుకొనేందుకు వాణివైపు తిరిగాడు. వాణి కుటిలాలకాలు సరిచేసికుంటూ చిరునవ్వు నవ్వింది. భారతి అరవిందాననంలోని దరహాసం చతురాననుని కనులలో చురుక్కున పొడిచింది.

అంతలో దేవర్షి శ్రీదేవిని సమీపించి :

మహావిష్ణువు జగన్మోహినీ రూపం ధరించాడు. ఏమైనా దేవతా పక్షపాతి.

అంటూనే జగన్మోహినివైపు అడుగులు వేసాడు. మహతి స్పందించింది.

శ్రీదేవి చకితదృక్కులు జగన్మోహినిని చూచి ఒక్కసారి స్వీయాంగావలోకనం చేసికొన్నవి. సిగ్గుపడ్డది శ్రీదేవి.

అంతలో జగన్మోహినీ పాదమంజీరవిస్వనాలు దేవదానవుల శిరస్సుల నూగిస లాడించినవి,

మహతీ స్వరయుక్తంగా జగన్మోహిని పదములు పరిభ్రమించినవి.

కరకంకణస్థగిత మణికింకిణీధ్వనులు...పదపద్మాలంకృత శింజినీ ఝణంఝణ విస్వనమ్ములు...దేవదానవుల ఉచ్ఛ్వాస నిశ్వాసలనే బంధించినవి.

హస్తముద్రలో
పాదన్యాసములో

భ్రూభంగములో
నేత్ర సంచలనములో
భ్రుకుటిక్షేపములో
లోచనవిభ్రమణములో
జఘనదోలనలో
స్తనోత్తరీయ స్తనప్రకంపనలో, సమాగత సర్వసభ్యా కాస్యమ్ముల విస్మృతి
ఒకరి ఉత్తరీయాన్ని
ఒకరి నాసాగ్రాన్ని
ఒకరి చిబుకాన్ని
ఒకరి కపోలాన్ని స్పృశిస్తూ జగన్మోహిని పారిషదులను కామమోహితులను చేస్తున్నది.

అమృతకలశహస్తు రయిన నికుంభుని ఒకకంట కనిపెడుతూ అన్యదైత్య సేనాపతులతో సరాగాలాడుతున్నది. నికుంభుడు సుధాపూర్ణ కలశాన్ని జారవిడువకుండా జగన్మోహినివైపు అడుగులు వేశాడు. చూచీ చూడనట్లు జగన్మోహిని ముందుకు నడిచి శుంభ - నిశుంభులతో వరసలు కలుపుతూ జంభ - శంబరులతో భాషిస్తూన్నది.

రాక్షసస్త్రీలు కొరకొరచూస్తూ, జగన్మోహిని అభినయాన్ని అప్రయత్నంగా అనుకరిస్తున్నారు. శచీదేవిని విస్మరించి జగన్మోహినీ విలాసవిహార విలోకనంచేసే దేవేంద్రుడు శచీహృదయంలో తాపాన్ని రేకెత్తిస్తున్నాడు. భారతి ఏకాగ్ర దృష్టితో జగన్మోహిని అంగవిన్యాసాలను అనుశీలిస్తున్నది.

ఒక్క మహిళా క్షణకాలంలో నికుంభుడు జగన్మోహిని ఎట్టయెదుట నిలబడి అమృతకలశం చూపుతూ కళ్ళుత్రిప్పాడు. జగన్మోహిని కలశం అందుకొని, సుడి తిరిగి, తిరిగి అతనికే కలశం అందించి పులుకు పులుకున చూస్తూ నిలబడ్డది.

అమృతకలశం జగన్మోహిని చేతులలోనికి ప్రవేశించినపుడు ప్రహర్షపరిప్లుతమయిన దేవేంద్రుని హృదయం తిరిగి నికుంభుని కర్కశకరాలలోనికి పోయినప్పుడు ముడుచుకుపోయింది.

అశనిపాతంలో విద్యుల్లత !
విద్యుల్లతలో అశనిపాతం.
తాదృశస్థితిలో ఉన్నది దేవేంద్రుని హృదయం.
అభినయం పరిసమాప్తి నందింది.

ఆదరానుగ్రహరాగపరిపూర్ణ నేత్రాలతో తనపై చూపులు విసుడ్చిన జగన్మోహినిని చూస్తూనే పరవశుడయి అమృతకలశం ఆమెకే అందించేశాడు నికుంభుడు. కన్నులలో ఆశను కనబరుస్తూ, చీనిచీనాంశుకోత్తరీయం సవరిస్తూ, చూచుక ప్రదర్శనతో గికురిస్తూ, చేతితో వారించి తిరిగి ఇచ్చేసింది.

దేవర్షి హృదయమే ఉప్పమనగా చతురాననుని సమీపించి మాతృశ్రీ పదసన్నిధానంలో సుఖాసీనుడయాడు.

'ఓ ! జగన్మోహినీ ! ఈ అమృతకలశాన్ని నువ్వు తీసికొని మాకు సమంగా విభాగించు. మేమంతా అన్నదమ్ములం. ఉభయులం ఈ మహాసాగరాన్ని దధిభాండంగాచేసి, ఏకాదశ యోజన విస్తీర్ణమయిన మందరగిరిని కవ్వంచేసి వాసుకి రజ్జువుగా మథించి ఈ అమృతాన్ని సాధించాం

అని నికుంభుడు తన ఉక్తి చాతుర్యాన్ని చమత్కారభరితంచేసి చెప్తూంటే ఔదాసీన్యం ప్రదర్శించింది; పెదవివిప్పితే చె పోతుందేమోనని దైత్యులు మౌనులయారు.

'ఈ రభసంతా నీ కెందుకు. ఈ అమృతం ఉభయులకూ సమంగా అందజెయ్యి.'

అని తిరిగి అందియబోయారు.

తన వదనారవిందాన్నే తదేకంగాచూసే రాక్షసపరివృందం వైపుచూస్తూ నిరాకరించింది జగన్మోహిని.

జంభ, శంబరులు ముందుకు వచ్చి నికుంభుని అభ్యర్ధనను బలపరచారు. జగన్మోహిని తిరస్కార సూచకంగా చిరునవ్వు నవ్వింది.

మయ, మాలి, సుమాలులు ప్రార్థించారు. జగన్మోహిని ఛీత్కరిస్తూ తల త్రిప్పింది. బాణాసురుడు మీసం సవరిస్తూ అంగహారాలు మెరిపిస్తూ వచ్చారు.

జగన్మోహిని పరాఙ్ముఖి అయింది.

బాతూనే దేవేంద్రునికి సన్న జేసింది. జగన్మోహిని సంకేతానికి భాష్యం తెలిసిన ఇంద్రుడు ఆమెను సమీపిస్తూండగా బలి అనుసరించాడు. ఇరువురూ ఒకేసారి జగన్మోహిని ఎదుటకు వచ్చి నిలబడ్డారు.

వింధ్యావళి వైపు తిరిగింది శచి.

స్థితిగతుల పర్యవసానాన్ని ఊహించలేని వింధ్యావళి దేవర్షి కోసం నిరీక్షిస్తున్నది.

బలీ, ఇంద్రుడూ మౌనముద్రాముద్రితులయి ఉండటం చూచిన నారదుడు జగన్మోహినిని పమీపించి—

'మోహినీ, న్యాయవాహినీ!

అహోరాత్ర మహాదీక్షతో సహోదరులు సాధించిన అమృతాన్ని పంచి పెట్టమని నిన్ను అర్థిస్తున్నారు. దానవాధిపుడు బలీ, దేవేశుడు ఇంద్రుడూ ఉభయపక్షాలకూ అధికారిక ప్రాతినిధ్యం వహించి నిన్ను కోరుతున్నారు. కాదనకు!'

అని బలీంద్రులను చూశారు.

జగన్మోహిని దేవర్షివైపు చిలిపిగా చూచి నవ్వింది. దేవర్షి అపహసిస్తూ నిష్క్రమించారు.

జగన్మోహిని పెదవివిరిచి నికుంభుని చేతులలోంచి కలశాన్ని అందుకున్నది.

శచీహృదయారవిందం ప్రఫుల్లమయింది. దేవేంద్రుని వదనసీమలో మనోజ్ఞహాసం పరువులు తీసింది.

చపలాక్షినీ, చంచల మనస్కనూ, విచలిత బుద్ధినీ అయిన నన్ను మహా శ్రమోపలబ్ధ మయిన అమృతం పంచమంటున్నారు.

అని పరివృత జనాన్ని పర్యాలోకించింది. జనుపకచ్ఛదాలు కట్టుకున్నవారు సైతం ఆ అపాంగవీక్షణమాత్రంలో కన్నులప్పగించి అచేతను లవుతున్నారు. ఒక్కరిలోనూ నైతిక శక్తి నిలబడటంలేదు. భారతినే మోహింపజేసే సౌందర్యసుషమామరంద మధురదృక్కులతో జగన్మోహిని సొంపులు కురిపిస్తున్నది. వంపులు చూపుతున్నది. అమృతకలశాన్ని బాహుమూలంలో ఇరికిస్తున్నది.

అభ్యంతరంలేదు. అపరిచితులకు పక్షపాతం ఉండదు. సమదృష్టితో విభాగించు'

అన్నారు కాలకేయుడు.

'కాలకేయుని అభిప్రాయాన్నే మేమూ బలపరుస్తున్నాం' అన్నారు దేవేంద్రుడు.

* * *

అంగీకారాన్ని అభినందనంతో తెలిపింది జగన్మోహిని. దేవదానవులు బ్రహ్మానందామృతచేతస్కులై, హృదయాలలో జగన్మోహిని సౌందర్యరేఖలను చిత్రించుకుంటూ కదిలారు.

భారతీసహితుడై చతురాననుడు విమానారూఢుడయ్యాడు. అసిత, గాలవ, నారదాది దేవర్షులు భవిష్యత్తునుగూర్చి యిదమిత్థమయిన నిశ్చయం చేయలేక బుద్ధియుద్ధం సాగిస్తున్నారు.

అద్యతనకాలిలో అమరాసుర సంగ్రామం తథ్యం అనే భావాన్ని యుక్తిప్రయుక్తులతో చిత్రాతిచిత్రంగా ప్రతిపాదించారు. వారి ప్రకటనపై పరమశివ చతురాననులు అధికారికముద్రను వేయాలని నారదుడు భావించి అసిత గాలవుల తీర్మానాన్ని అభిజ్ఞవర్గాలవారి ఊహాగానంగా స్వీకరించాడు.

ఏకాంతంలో ఉన్న జగన్మోహిని దేవర్షులను కన్నెత్తి చూడటానికి సిగ్గుపడింది. కన్నుగీటి గిలిగించాలనే మధుర ా జనించింది కానీ, దాని పరిణామం వ్యక్తం కావటంతో తల్లిగా నిలబడి బొటన వ్రేలితో శ్రీకారాలు చుట్టసాగింది.

స్త్రీ రూపంలో ఉన్న మహావిష్ణువును హేళనచేయాలనే ఆకాంక్ష శ్రీదేవికి కలిగింది.

కలిగిన క్షణంలో అడుగు కదిపింది.

కదుపుతుండగానే అల్లంత దూరంలో దేవదానవసమూహ కోలాహలం వినబడి నిలబడి పోయింది.

నిలబడుతూండగా తాను మహావిష్ణురూపం ధరించాలనే కోరిక మనసులో మసలినది.

మసలుతూండగానే గుండెలు తుప్పుమన్నవి. ఆమె శరీరమే వణికి పోయింది. యథాపూర్వం కూర్చున్నది.

పరిశుభ్రస్నాతులై, ధౌతవస్త్రధారులై, నిజాలంకార భూషితులై అఖిల లోకాశ్చర్యకర సౌందర్య లీలావిలాస సుషమాన్విత గాత్రబద్ధ దృష్టులై, మత్సరగ్రస్త హృదయాలతో ఒకరికన్న ఒకరు ముందుకు తోసుకుని వస్తున్నారు. అందరూ జగన్మోహినిని చుట్టుముట్టారు. దేవదానవ పరీవృత అయిన జగన్మోహిని ప్రావృషేణ్య పయోధరసమూహాన్ని చీల్చుకొనివచ్చే సౌదామనివలె ఉన్నది.

'ఇటు మీరు - అటు మీరు'

అని విలాసంగా కుడిచేతి తర్జనితో దేవ దానవులను రెండు భాగాలుగా చేసింది. కుడివైపు దానవులు ఎడమవైపు దేవతలూ ఆసీను లవుతున్నారు. జగన్మోహిని దృష్టిలోనే ఉండేందుకు ఒకరికన్నా ఒకరు ముందు ముందుకు వ్రాలి కూర్చున్నారు. దూరంనుంచి చూచినప్పటి సహస్ర స్తంభ మంటపాకృతిలో ఉన్నారు వారు.

జగన్మోహినీ పదన్యస్తగీతమంజీరఝుణఝుణ నిస్వనములు ఇరుపార్శ్వాలవారి కర్ణమూలాలనూ కదలించాయి. ఒకానొక

వాల్యభంగిమలో నిలబడ్డ జగన్మోహిని దరహసితవదనం దానవవీరాళికి పులకలెత్తించింది.

పొంగిపోయారు; ఉప్పొంగిపోయారు; ఎగిరి గంతులే వేశాయి దానవుల హృదయాలు.

జగన్మోహినీ హస్తన్యస్తమైన అమృతకలశం ఏ ఒక్క దానవుని దృష్టికీ గోచరించటంలేదు. ఆ అరవిందానన లోచనామృతం వారికి మత్తెక్కిస్తూంటగా వారు శ్రమసర్వస్వాన్ని విస్మరించారు.

ఒక దైత్యుడు చిరునవ్వు జల్లుతున్నాడు.

వేరొకడు కన్నుగీటుతున్నాడు.

ఇంకొకడు చేతివ్రేళ్ళూపుతూ స్వాగతం వలుకుతున్నాడు.

మరొకడు స్థలసంకేతమే చేస్తున్నాడు :

అందరికీ అన్నివిధాలా అనురాగ సుధావర్ష శీకరాలు అర్పిస్తూ అమృత విభాగం ఆరంభించింది.

"అదిగో ఆరంభమయింది అమృత విభాగం. అమరులవుతున్నారు దేవతలు దైత్యులకు లోచనామృతమే"

అని గాలవుడు వ్యాఖ్యానించాడు.

'వక్షోత్తరీయాంచల ప్రసారిత పవనామృతమో!'

చలోక్తి వినరాదు నారదుడు.

కాలకేయాదులకు మరదలవరస కలిపిస్తున్నది.

అజావార్త తెచ్చాడు అసితర్షి.

కుంభ నికుంభుల కపోలాలను స్పృశించింది.

శంబరుని చిబుకం పైకెత్తింది. జంభుని తారహారం తీసికొన్నది. జగన్మోహిని దేవతలకు అమృతం ఇస్తూ దానవులను సరససల్లాపసంస్పర్శామృతపానమత్తులను చేస్తూన్నది.

ఇరుపక్షాలకూ సమంగా అమృతం విభాగిస్తుందని ఆశించిన రాహువు ఆశ ఆశ మాత్రమే కాగా జగన్మోహిని మాయా తంత్రాన్ని కనిపెడుతూ ఎవ్వరూ చూడకుండా దేవతారూపం ధరించి సూర్య-చంద్రులమధ్య చేరాడు. జగన్మోహిని దైత్య సమూహానికి గిలిగింతలు పెడ్తూ దేవపంక్తికి అమృతం అందిస్తూ రాహువుకి కూడా అందించింది.

నిమేషమాత్రంలో రాహువు గొంతుకలోనికి పోనిచ్చారు. శంకించిన సూర్య చంద్రులు జగన్మోహిని పాదాలను స్పృశించి కన్ను కదిపారు.

గమనించిన జగన్మోహిని చలించకుండా సుదర్శనాన్ని రాహువు గళసీమపైకి వదలింది

అమృత ప్రభావితమైన రాహువు శిరస్సు లిప్తలలో గగన వీధికి పోయింది:

మాయా మోహితులూ కామబద్ధులూ అయిన దైత్యులలో యే ఒక్కరికీ జరిగిన సన్నివేశం కనిపించనేలేదు. రాక్షసామాత్యుల హృదయాలు శంకా తరంగితాలు కాబోతున్నప్పుడే జగన్మోహిని పుల్లలోచనాలు వానిని వారించినవి.

* * *

'మనం కదలవచ్చు: దేవాసురసంగ్రామం తథ్యం.'

అని లేచారు, గాలవుడు.

అభిజ్ఞాలం వా ర్తపై అధికారిక వ్యాఖ్య స్వీకరించే ఊహతో నారదుడు కైలాసానికి దారితీశాడు.

దేవేంద్రునికి అమృతం అందిన క్షణంలో అప్సరఃకామినీ పరివృతయైన శచీదేవి అమరావతివైపు పయనించింది. వింధ్యావళిని చెలికత్తెలు విమానంలోకి నడిపించారు.

దేవతలను అమరులను చేసి జగన్మోహిని అదృశ్య అయింది.

* * *

మందమలయానిలాలు మెల్లమెల్లగా ప్రవేశిస్తున్నవి. కైలాసగిరి గుహాముఖద్వారాలనుండి సంగీతం ప్రవహిస్తున్నది. ప్రమథులు నందీశ్వరుని పర్యవేక్షణలో వైతాళిక గానం చేస్తున్నారు. ప్రస్తపీపీఠంధం సరిజేసికొంటూ పార్వతి అభ్యంతర మందిరం నుండి వెలుపలకి వస్తున్నది. పరమశివుని దరహాసవదనం పారిషదులకు ఆనందాన్ని కలిగిస్తున్నది.

అకస్మికంగా అంతరాళంనుండి చలచల్లగా పుష్పసౌరభంలా వచ్చే స్వరతరంగిణి నంది దృష్టిని కూడా ఆకర్షించింది. అంతకంతకు సమీపించే ధ్వనిని అభిజ్ఞుడైన నంది మహతీ స్పందనంగా గుర్తించి :

'స్వామీ ! దేవర్షి ఉదయమే వస్తున్నారు'-

అని పరమశివుని వైపు చూచాడు.

ఆలోచనలో ఉన్న పరమశివునికి నందివాక్యాలు విని పించలేదు. ఆయన కనులయెదుట అమృతమథన దృశ్యమే సాక్షాత్కరిస్తున్నది. క్షీరసాగరతటాన దేవదానవులు అనంతా

కాశంలోని అగణిత తారాగణంలా గోచరిస్తున్నారు. వారి కన్నులలో ఆశారేఖ చిరుతారకలా మెరుస్తున్నది.

'నిఖిలభువన వార్తాహరులు దేవర్షి నారదులు'

అని నందీశ్వరుడు మధురగంభీర స్వరంతో పలికాడు.

శశాంక శేఖరుడు విభ్రమచకితదృక్కులతో నందీశ్వరుని స్వాగతం స్వీకరించే దేవర్షిని ఆలోకించారు.

అమృతావిర్భావానంతర గాథావిశేషాలను అడుగకుండానే నారదుని వలన వినాలని కన్నులతో అభినయిస్తూ మౌనముద్ర స్వీకరించాడు.

పరేంగితావగాహి అయిన పరమశివుడు దేవాసురసంగ్రామ వార్తపై నిశ్చిత ప్రకటన చేస్తాడని భావించిన నారదుడు మౌనవ్రతమే పరిగ్రహించాడు.

మౌనలక్ష్మి స్వయంవరోత్సవానికి విచ్చేసిన నవయౌవనులవలె ఉన్న పరమశివ నారదులు అప్పుడే ప్రవేశించిన హైమవతికి ఆశ్చర్యం కలిగించారు.

నందీశ్వర, భృంగీశ్వర, చండీశ్వర, వీరభద్రులు వర్తమానస్థితికి హేతువులను చూస్తున్నారు. భావాంబుదాలన్నీ శరన్మేఘ శకలాలే అవుతున్నవి. ఏ ఒక్కటీ పరిష్కారాన్ని వర్షించటంలేదు. హైమవతి ముహూర్తకాలం ఉభయులనూ ఆలోకించి సాభిప్రాయలోచనాలతో నందివైపు తిరిగింది.

నంది పెదవి కదలలేదు.

నారద పరమశివులు మూగనోముపట్టి ఉన్నప్పటికీ తన భర్తకు ప్రతిభంగం కారాదనే తలంపుతో హైమవతి:

"త్రిలోకసంచారి దేవర్షినారదులు విశేషాలు లేకుండా రారు" అన్నది.

హైమవతి ప్రశ్న నారద శివులను ఒక్కసారిగా మె వైపు త్రిప్పుకొన్నది.

"నతీ! నారదమునీంద్రులు మౌనంతో ప్రవేశించటం నీకూ ఆశ్చర్యాన్ని కలిగించిందా?"

అంటూనే పరమశివుడు అర్ధాననం ఇచ్చారు.

హైమవతి ఆసీనయై దేవర్షివైపు చూస్తూ—

'క్షీరసాగరం నుండి ఇటే వస్తున్నట్లున్నారు!'

అని ప్రశ్నించింది. దేవర్షి తలత్రిప్పలోనే బోసన్న జవాబు వచ్చింది.

'అనంతర విశేషాలు!'

హైమవతి ఆసక్తితో అడిగింది.

'అదికాదు కావలసింది, దేవాసుర సంగ్రామం...'

నారదుని పెదవులు కదులుతూండగానే 'పునః' అంటూ ఆశ్చర్యంగా చూశాడు పరమశివుడు.

'ఆ విషయం తెలిపేందుకే వచ్చాను. సంగ్రామం ఆరంభమయితే కుమారు చిరకాలం సాగవచ్చు. పరమద్రోహం జరిగింది దానవులకు. దేవతలకు అమృతత్వం సిద్ధించింది. బహుశా తత్పర్యాయం జరిగే అమరాసుర సంగ్రామం న భూతో న భవిష్యతి.'

అగారు దేవర్షి

'మానవునిలో జీవితాశ వంటిది దేవాసురవైరం. విషమ విపరీతవిపత్కరస్థితులలో వైతం మానవుని జీవితాశ వీడనట్లే వీరిమధ్య వైరమూ నశించదు: దేవాసుర సంగ్రామాలు - ఈ సృష్టిలో తప్పవు. జాతి నాశనం కావాలి. అందుకు చతురాననులు అంగీకరించరు.'

అంటూ లేచి నిలబడ్డారు పరమశివుడు.

'సంగ్రామం ఆరంభమయిందా ?'

ప్రశ్నించారు నంది.

అదేప్రశ్న చండీశ్వర భృంగీశ్వర వీరభద్రుల ముఖంలో గోచరించింది.

'ఆరంభమయాకే వచ్చి ఉంటారు నారదులు'

హైమవతి అడుగులు వేస్తూఅన్నది.

'నేనూ ఇటు తిరగగానే అటు ఆరంభమై ఉంటుంది. జగన్మోహిని పక్షపాతం...

నారదుడు చెప్తూండగానే శశాంకశేఖరుడు సమీపించి

'ఎవరా జగన్మోహిని ?'

అడిగారు.

'అది వేరేకథ.'

నారదుడు కదిలారు. నందీశ్వర భృంగీశ్వర చండీశ్వరులు ముందు నడిచారు.

పరమశివుడు హైమవతి వైపుచూస్తూ నారదుని అనుసరిస్తున్నారు.

'సృష్ట్యాది దేవాసుర సంగ్రామాలు . చూస్తూనే ఉన్నా ఇంకా కుతూహలం తగ్గలేదు...'

అన్నది హైమవతి హేళనగా.

• 'రోజూ చూసే ఉదయ సాయంసంధ్యలలో నిత్యనూతనత్వం లేదూ! అంతేకాదు, ఈ దేవాసుర సంగ్రామం ఇతఃపూర్వంవలె అంతఃపు ... దేవదానవ సమూహం క్షీరసాగర సికతాతలాంపై...'

నారదుని వాక్యం పూర్తికాకుండానే ఉమ అభ్యంతర మందిరానికి నడిచింది.

పరమశివుడు దేవర్షి హస్తాన్ని తన పాణి కమలంలో సంధించి గగనపథాన క్షీరసాగరంపైపు ప్రస్థానించాడు.

* * *

'సహజ చంచల స్వభావ అయిన శ్రీ హస్తాలలో అహో రాత్ర పరిశ్రమజన్య ఫలాన్ని పెట్టి...

విష్ణువుని వైపు చూస్తూ నముచి తీవ్ర స్వరంతో పలికాడు.

'అపరిచిత...అదది...అనే జ్ఞానంలేకుండా ఆమె వెంట బడ్డారు. అనుభవించార్సిందే.'

శంబరుడు సింహగర్జన చేశాడు.

'కన్నుచూపులో, పెదవి విరుపులో, అమృతాన్నే మరిచి పోయారు.'

వీరవంగా పలికాడు కాలకేయుడు.

'గరళం న శోచామి. భవిష్యత్తేమిటి?'

ప్రశ్నించాడు బాణాసురుడు.

'సామ్రాట్ ముఖంలో అగ్ని జ్వలిస్తున్నది! రండి అయనేమంటారో?'

అన్నాడు శంబరుడు.

నిఖిల దైత్య దానవులూ బలిచక్రవర్తి వైపు నడిచారు. అంతలో అసురాధీశుని ఆననం ఆవేదనాద్యోతితమయినది. కోటానుకోటి పరిజనుల పరిశ్రమ వ్యర్థమయింది. వ్యర్థమే అయినా అంతబాధలేకపోను. ప్రతిపక్షానికి దక్కిపోయింది ఫలం. ఒక వర్గానికి అన్యాయం జరిగింది. దేవదానవ వర్గాలశ్రమ దేవతలకే భోగ్యమయింది.

* * *

అమృతాస్వాదనానంతరం దేవతలందరూ అపరిమితోత్సాహంతో అమరావతి చేరుకున్నారు.

అప్పటికే శచీదేవి అమరావతిలో నూతనరాజ్యాంగాన్ని గురించి ఆలోచిస్తున్నది.

అమాత్య బృహస్పతి పురస్సరులై అమరులందరూ సుధర్మాస్థానంలో ప్రవేశించారు.

బృహస్పతి శోభన దేవతాపూజ జరిపించి అమరేంద్రుని సింహాసనాసీనుణ్ణి చేశాడు. శచీదేవి వదన కమలంలోంచి దరహాసమకరందం ప్రవహిస్తున్నది.

రంభా-ఊర్వశుల పర్యవేక్షణలో వరూథినీ మేనకలు నవరాగమాలికాయుక్త నృత్యం సాగిస్తున్నారు.

ఆచార్య బృహస్పతి ఆలోచన పూర్తిగావించి అమరేంద్రునిపై సాభిప్రాయలోచనాలను ప్రసరించారు. అమరేంద్రుని అతిచలనం అప్సరసలను అంతిపురివైపు నడిపింది.

"ఈ సమయానికి దానవానీకం మంత్రాలోచనం పూర్తి చేసికొని యుద్ధ సన్నద్ధం అవుతూ ఉంటుంది. రానున్న సంగ్రామానికి సన్నాహం కానీయండి."

అంటూనే నిజమందిరం వైపు నడిచారు ఆచార్య బృహస్పతి.

అమరేంద్రుడు సచివ సామంత సేనాధికులను అధికారిక దర్పంతో అవలోకించి అభ్యంతర మందిరానికి దారితీశారు.

హృదయాలలో కదలుతూ మనసులో మసలుతూన్న జగన్మోహిని రూపం దాటిపోకుండా ఉండేందుకూ సన్నిహిత సంగ్రామంలో రక్షణకూ కవచాలు బిగిస్తున్నారు.

"ఆలోచించండి. అమరావతి ఆక్రమణ అవశ్యకర్తవ్యం. అమృతపానం చేసిన దేవతలు అమరులేకాని అజేయులుకారు. జరిగింది అన్యాయం. ఇది దుర్భరం.

నిశ్చింతగా అమరావతిలో కాలంగడిపే సురల్ని ఆశ్రయించి పాదదాసులై సేవలు చేస్తూ అమృతప్రలోభం కల్పించారు; కల్పించి కవ్వించారు; కవ్వించి కదలించారు; కదలించి కష్టపెట్టారు; కష్టఫలాన్ని తామే అనుభవించారు; అనుభవించింది చాలక అమరావతిని ఆక్రమించుకున్నారు।

జరుగుతూన్న మోసాన్ని ఒక్కరం గుర్తించలేకపోయాం. అన్యాయంగా సైంహికేయుని శిరచ్ఛేదం జరిగిపోయింది. అదీ

గమనించలేదు. మన దురదృష్టంలా జగన్మోహిని అవతరించింది. అమృతం అలభ్యమయినా హస్తగతమయిన అమరావతి కూడా జారిపోయింది.

సుధర్మాస్థానాధిష్ఠాత త్రిలోకాధిపతిగా కీర్తింపబడుతాడు. త్రిలోకాధిపత్యం ముందు అమృతపానం తృణప్రాయం. నిఖిల దైత్య దానవులూ బాణ, కృపాణ పాణులై యుద్ధానికి సిద్ధంకండి.'

బలి గంభీరోపన్యాసం సదస్యులను పొంగించి ప్రోత్సహించి సమరసన్నాహ సముద్యుక్తులను చేసింది.

అంతలో ప్రవేశించిన దేవర్షిని బలి చూచి :

'మహాముని! దైత్య జనతాపరిషత్తు సంగ్రామాన్ని అనివార్యంగా భావించింది. సౌందర్యశోభాసంపన్నమయిన అమరావతిని ధ్వంసంచేయటం మా అభిమతం కాదు. ఈ క్షీరసాగర సికతాతలాల మీదనే సంగ్రామం ప్రారంభించి అమరావతిని స్వాధీనం చేసికొందలిదాం. ఈ వార్త...'

బలి వాక్యాలు శ్రద్ధగా ఆకర్ణించిన నారదుడు అదృశ్యుడై ఉన్న పరమశివునివైపు చూచి అమరావతికి నడిచాడు. రాబోయే విపత్తును భావించి భారహృదయంతో పరమశివుడు కైలాసానికి కదిలాడు.

* * *

సన్నిహిత సంగ్రామ సూచికగా క్షీరసాగరం ఘోషిస్తున్నది।

భావయిత్రిలో ఉన్న మహాకవి భావసంచలనంలా క్షీరసాగరతరంగాలు చలిస్తున్నవి.

సాగరఘోష శ్రుతిగా దానవానీకం ఢంకా, కాహళ, పణవ, గోముఖ, భేరీవాద్యాలతో యుద్ధనృత్యం సాగిస్తున్నది.

అంతలో అల్లంతదూరాన వినబడిన శంఖధ్వానం అసురులను స్తబ్ధులను చేసింది. దైత్యులందరూ కన్నెత్తి చూచారు. చూచేనంతలో వారి కర్ణమూలాలలో ఘోరాశనిపాత గర్జనసదృశంగా దేవదుందుభిధ్వానం దూసుకుపోయింది.

బలి శంఖంపూరించాడు.

దైత్యులు సేనాపతుల ఆజ్ఞలను ఆకర్ణించడానికి కుతూహల పడుతున్నారు. వియద్గంగా ప్రవాహాన్ని శిరస్సుపై ధరించడానికి నడికట్టు బిగించి చేతులూని నిలబడ్డ పరమశివునివలె ఉన్న జంభుడు కనుసన్నలతో తన సేనను ముందుకు దూకించాడు.

జంభుని సైన్యానికి ఇరుపైపులా నివాత కవచ కాలకేయాదులు కలిశారు. అనుసరించింది శేష దైత్యసైన్యం.

అసురేంద్రుని శంఖధ్వానం దేవతాకోటిని ముందుకు దూకించింది. ప్రాక్పశ్చిమ మహాసముద్రాల రంగత్తుంగతరంగాలతో సంఘర్షణకు తలపడ్డట్లు ఘోష ఆరంభమైంది.

బహుయోజన విస్తీర్ణమైన క్షీరసాగరనీరతీరతలాలపై మోహరించిన దేవ దానవ సైన్యాలు విశ్వంభర భవితవ్యం నిర్ణయించే సంకల్పంతో నిలిచినవి. తిలతండుల న్యాయంగా ఉన్న అమరాసురులను ఆలోకిస్తూ ఆకాశమార్గాన విహరిస్తున్నాడు నారదుడు.

రణభేరీ ఢాంకారాలలో, మత్తేభయూథ ఘీంకారాలలో సేనానీకహుంకారాలలో, శింజినీ టంకారాలలో మునిగిన దేవ

దానవులమధ్య ధ్వని ప్రపంచం విజయధ్వజమెత్తింది. విశ్వద్ధం నిలువునా నీరయి జారిపోయింది.

చంద్ర కిరణద్యుతి ప్రసారావకాశరహితంగా తారాలు అల్లుకుపోతున్నవి. పునః క్షీరసాగరమథనం సాగింపబడుతున్నట్లు ఊగిసలాడుతున్నవి సేనలు. ఈ మథనం అమృతోత్పాదనకు కాదు. అమరావతి ఆక్రమణకు.

మయవినిర్మిత వైహాయస వాయుయానంపై నముచి, శంబర, విప్రచిత్త్యాదులగు అంతరంగిక సచివులతో బలి గగనతలానికి పరిక్రమించాడు. ఐరావతారూఢుడై అమరేంద్రుడు రాక్షసవీరులను చించి చెండాడుతున్నారు. దేవసేనానులు అంబరవీధినుండి వెలువడే శరపరంపరను మర్త్యమార్గంలో ఛిన్నాభిన్నం చేస్తున్నారు.

దేవతల శంఖనాదాలతో దానవుల సింహనాదాలు పోటీ పడుతున్నవి. ద్వంద్వయుద్ధంలో దానవ పదాతి బలం నిరసిస్తున్నది. యుద్ధభూమిలో గజాశ్వ సింహబలాలు మన్నుగిల్లటం చూచిన బలి క్రిందికి దిగి ఇంద్రునితో ప్రత్యక్ష పోరాటం ఆరంభించాడు.

మిత్ర త్వష్ట యమ వరుణ విభావస విశ్వకర్మ అనిల శని సూర్య సోమ భద్రకాళులు దేవ సమూహంలో వ్యక్తులుగా నిలబడి రాక్షస సేనానులతో ప్రత్యక్ష యుద్ధం సాగిస్తున్నారు. అశ్వని దేవతలూ విశ్వేదేవగణం రుద్రగణం వసువులూ సమూహాలుగా తలపడ్డారు.

ప్రతిపక్షంలో హేతి ప్రహేతి కాలనాభ జంభ శంబర నరక నముచి మయ మహిష కుంభ నికుంభ బాణ రాహువులు

నానావిధాయుధధరులై దేవజాతిని చ్యుతధైర్యులనుచేసే తలంపుతో సమరం సాగిస్తున్నారు. నివాతకవచ కాలకేయాదులూ క్రోధవశగణాలూ ప్రచండగదా దండధరులై విక్రమిస్తున్నారు.

అమృతపానంవల్ల లభించిన శక్తితో దేవతలు విజృంభించారు. అమృతోత్పాదనవేళాప్రాప్త పరిశ్రమకు ఈ వీరవిహారం తోడుకాగా దానవులు వెనకడుగు వేసినా సేనాపతి ఆజ్ఞావర్తులై ప్రాణభీతి లేకుండా ముందుకు దూకుతున్నారు.

ప్రత్యక్షయుద్ధంలో బలి ప్రయోగించే శస్త్రజాలాన్ని దేవేంద్రుడు తుత్తునకలు చేస్తున్నాడు. దానవాధీశుడు ప్రత్యక్ష మార్గం ప్రయోజనకారి కాదని నిశ్చయించుకొని అంతలో అంతరిక్షానికి నడచి శాంబరీవిద్యా ప్రదర్శనం ప్రారంభించాడు.

దేవేంద్రునికి బలి కనిపించకపోగా పైనుంచి కురిసే శరవర్షాన్ని తట్టుకోవలసి వచ్చింది.

క్షీరసాగరమథనవేళ వాసుకి నోటినుండి వెలువడే హాలాహలాగ్ని శిఖలవలె జ్వాలాప్రదీప్తశూలాలు దేవకోటిని ప్రహరిస్తున్నవి.

'అసురీమాయ ఆరంభమయింది.'

అంతవరకూ శుక్రునితో పోరుసాగించే బృహస్పతి దేవేంద్రుని సమీపించి అన్నాడు. దేవేంద్రుడు నిర్విణ్ణుడయినాడు.

"దివ్యాస్త్రాలతో దేవతాజనాన్ని సంరక్షించు"

అని తాత్కాలిక నివారణోపాయాన్ని అందించి, అలోచనలో పడ్డాడు.

పోరు ఘోరంగా సాగుతున్నది. పుష్కలావర్తక

మేఘాలనుండి పడే వర్షం ధారలా అంబర వీధి నుండి శస్త్రాస్త్రాలు కురుస్తున్నవి.

'మాయాప్రేరిత మహేంద్రజాలంముందు సత్యబద్ధమయిన యుద్ధం ప్రయోగించదగింది కాదు. బలిని వాక్శూలాలతో రెచ్చగొట్టి ఎదుటికి రప్పించు.'

అని ముహూర్తమాత్రాలోచనతో బృహస్పతి పరిష్కారం సూచించాడు.

* * *

సత్యలోకంలో పద్మసింహాసనంపై సుఖాసీనుడై రాజ మరాళాన్ని లాలిస్తూ యిష్టాలాపాలు సాగించే చతురాననుడు ఆకస్మికంగా ఆగమించిన నారదునివైపు ఆశ్చర్యదృక్కులు ప్రసరించాడు.

'పూజ్యపదపద్మములకు అభివాదాలు - మాతృదేవికి నమస్సులు'

అని చేతులు జోడించి నిలబడ్డాడు.

భారతి సకౌతుక లోచనాలతో అవలోకిస్తూ 'దేవాసుర సంగ్రామ వార్తావిశేషాలు ?' అని ప్రశ్నించింది.

'అమృతపానం చేసిన దేవతలు అమరులై రాక్షసానీకంతో ప్రత్యక్ష సమరం ప్రారంభించారు. పరస్పర శక్తిప్రదర్శనం కాలహరణానికే కాని కార్యసాధనకు కాదని శుక్రాచార్యులు సూచించటంతో బలి శాంబరీవిద్యాప్రదర్శనం చేస్తున్నాడు. రాక్షస మాయను ఎదుర్కోలేని దేవేంద్రుడు మానధనుడయిన బలిని రెచ్చగొట్టాడు. దానశీలుడూ ధైర్యసంపన్నుడూ సాహసుడూ

అయినా బలి దేవేంద్రునితో తిరిగి యుద్ధం ప్రారంభించారు. త్రిమూర్తుల అండచూచుకొని దేవేంద్రుడు సమరం సాగిస్తున్నాడు.'

నారదుడు చతురాననుని వైపు తిరిగి ఆగాడు.

'పర్యవసానం ?'

భారతి ప్రశ్నించింది.

దేవర్షి మౌనముద్ర వహించాడు.

'ఇంకా సాగుతూనే ఉన్నదన్నమాట ?'

భారతి నారదుని మౌనాన్ని వ్యాఖ్యానించింది.

'ఇంతకూ జగన్మోహిని కారణం ?'

నారదుడు పలికాడు

'నిఖిల జలధివేలావలయిత విశ్వంభరను స్త్రీశక్తి క్షణంలో పరిభ్రమింప జేస్తుంది.'

అని పలికిన భారతి దరహాసవదనారవిందం భాసుర మయినది.

'అంతా మహావిష్ణువు పక్షపాతం'

నారదుడు తీవ్రంగానే అన్నాడు.

మహావిష్ణువు బాధ్యుడు కాడు. దానవుల దౌర్జన్యమే వారి పతనహేతువు'

అన్నది భారతి.

నారదుడు గగనచారియై యుద్ధభూమి ప్రవేశించేసరికి మహావిష్ణువు పాంచజన్యం పూరించి సుదర్శనాన్ని ఆహ్వానిస్తున్నాడు.

కాలాగ్నిసదృశవిస్ఫోటకశకలాలతో క్రిందికి పోయే శస్త్రాలు గోచరిస్తున్నాయి.

'బలి శాంబరీవిద్య పునఃప్రారంభించాడు.'

అనుకుంటూ క్రిందికి చూచేసరికి పరమ బీభత్సంగా ఉంది రణరంగం.

సుదర్శనం కాలనేమి శిరస్సును ఛిన్నాభిన్నం చేసింది. కాలనేమి పార్శ్వభాగాన ఉన్న మాలి, సుమాలుల వైపు మహా విష్ణువు కనులు తిరగడంతో సుదర్శనం వారిరువురి శిరస్సులనూ ఏకంగా అదృశ్యం చేసింది. అంతలో కౌమోదకి మాల్యవంతుని శరీరాన్ని అస్థిశేషం చేసింది.

నిరవద్యమూ అప్రతిహతమూ అయిన మహారుద్రుని విటలేక్షణోగ్రజ్వాలామాలలతో సుదర్శనం విహరిస్తున్నది. క్షీరసాగర మధ్యంలోని మహావర్తాలవలె తిరుగుతూ వచ్చే చండతీక్ష్ణద్యుతిశిఖాస్పర్శతో దానవానీకం మాడిపోతున్నది.

విజయశ్రీ విరాజిత గర్వోద్ధతుడై దేవేంద్రుడు భుజా స్ఫాలనంచేసి బలి నుద్దేశించి పలికిన అహంకారోక్తులు మహా విష్ణువుకే జుగుప్సను కలిగించాయి.

బలి దేవేంద్రునితో తలపడుతూ,

'అమృతపానంచేసి ఐరావతం అధిరోహించి వజ్ర హస్తుడవై మాతో సంగ్రామం చేయలేక మహావిష్ణువును ప్రార్థించి సాధించిన విజయానికి అహంకారమా ,'

అంతలో నారదుని దృష్టి ప్రక్కకు తిరిగింది.

అహంకారమమకార విరహితుడైన నారదునిగుండె రణరంగ బీభత్స దర్శనంతో ద్రవించింది.

ఆకర్ణాంతం ఎక్కుపెట్టిన ధనుస్సునుండి వెలువడే సహస్రాధిక శస్త్రాలు ఇంద్రుని శరీరాన్ని రక్తసిక్తం చేస్తున్నవి. అంతవరకూ ఆగిన దేవేంద్రుని దక్షిణ హస్తం వజ్రాయుధాన్ని ఆహ్వానించింది. వజ్రాయుధోద్భూత స్ఫులింగప్రచండవేగం బలిని మూర్ఛితుణ్ణి చేసింది.

జంభుడు ముహూర్తకాలంలో దేవేంద్రుని ఎదుట సాక్షాత్కరించాడు. మూర్ఛితుడై పడిఉన్న బలిని చూస్తూనే కాలదండాన్ని ఐరావతంమీద ప్రయోగించాడు. గదాదండ ప్రహారంతో ఐరావతం మోకరిల్లింది.

సమయానికే దివ్యరథంతో సిద్ధంగా ఉన్నాడు మాతలి.

రథంపైకి నడిచాడు ఇంద్రుడు.

మాతలిని అభినందిస్తూనే జంభుడు శూలప్రయోగం చేశాడు. ఉంచలా దూసుకుంటూ వచ్చిన శూలం మాతలి ఫాల భాగాన్ని గాయపర్చింది; చలించలేదు మాతలి.

తిరిగి వజ్రప్రయోగం చేశాడు; శతధారోజ్వలమయిన వజ్రం జంభుణ్ణి నిశ్శేషం చేసింది.

'జయ జయా! జంభారీ!'

నాదాలు మిన్నుముట్టటంతో బలి, నముచి, పాకాసురులు ఒక్కుమ్మడి దేవేంద్రుని చుట్టుముట్టారు.

పాకాసురుని సమరక్రీడలో మాతలి మీదు ప్రందయినాడు; రథం ఛిన్నాభిన్నమయింది. రాక్షసత్రయ హస్తన్యస్త

ధనుర్విముక్త శరజాలం ప్రావృషేణ్యపయోధరాచ్ఛాదిత ప్రభాకర మండలంవలె దేవేంద్రుని కప్పివేసింది. అమరుల హాహాకారాలు మిన్నుముట్టినవి.

దేవేంద్రుడు అసురీ శక్తులను ఛేదించి రథారోహణంచేసి విక్రమించాడు. దేవేంద్రుని పరాక్రమప్రకర్ష దేవతలకు ఉత్సాహజనకమూ ఉత్తేజకరమూ అయింది. బీభత్స దృశ్యావలోకనమాత్ర భీతమై రోదిస్తున్నట్లు క్షీరసాగరం ఘోషిస్తున్నది.

ఒకవైపు హుంకారాలు
వేరొకవైపు హాహాకారాలు!!
'పాకశాసనా జయ జయ!'
వినాదాలు ముల్లోకాలను తాకినవి.

అమర సేనాధిపులలో అగ్రశ్రేణికిచెందిన పాకాసురుని మరణం శుక్రాచార్యులను విచలితుణ్ణి చేసింది.

ఆయన మోములో అంతవరకూ ఉన్న ఆశారేఖలు సన్నగిల్లినవి. అంతలో ఒక ఆలోచన ఆయన మనస్సులో తటిల్లతలా ప్రవేశించింది. చరాలున సంగరరంగ మధ్యానికి ప్రవేశించి:

'మహాసేనాని శిరస్సు'
అని గర్జించాడు.
సమాధానం లేదు.

శిరస్సు కానరాలేదు; మృత సంజీవని ప్రయోగించినా ప్రయోజనంలేదు.

సంగ్రామ పర్యవసానాన్ని శుక్రాచార్యుల ఆననసీమలో సందర్శించిన దేవర్షి కైలాసానికి సాగిపోయాడు.

"నముచిసూదనా జయ! జయ!" నాదాలు నారదునికి మార్గమధ్యంలో వినబడినాయి.

* * *

సాయంసంధ్యారుణ కిరణ రోచిశ్శ్రీమంత మయిన రజతాద్రిలయనై ఆలోచనలో ఉన్న పరమశివుని లోచనములు నారదుని ఆగమనంతో ఆనందసముల్లసితములై స్వాగతం పలికినవి.

"ప్రయోజనంలేదు. విజయం దేవకోటిదే! బహుశా దేవాసురులకు ఇది అంతిమ సంగ్రామం కావచ్చు."

విన్నూర్చాడు నారదుడు.

'భవితవ్యం అంతే!'

పరమశివుడు శ్రుతి కలిపాడు.

'దేవర్షీ' ఈ భీభత్సానికి కారణం నువ్వు. తెలుసా?'

అన్న హైమవతి వాక్యం నారదుని చలింపజేసింది. పెదవి కదపలేక పోయాడు.

'నైమిశారణ్యంలో శతవత్సర సత్రయాగం జరుగుతుండగా ఋషి పరిషత్తులో నిలబడి త్రిమూర్తులలో అగ్రేసరుణ్ణి నిర్ణయించమన్నావు; భృగువు వచ్చారు. లక్ష్మినిజపరివారముతో క్షీరసాగరంలోకి ప్రస్థానించింది.'

హైమవతి మధురగంభీర కంఠం ఆగింది. తాను పలికిన ఒక్క వాక్యం యింత యితిహాసాన్ని సృష్టించినందుకు

ఆనందించినా, కన్నులయెదుట వర్తించే బీభత్సం నారదుని మనస్సును వ్యాకులం చెయ్యకపోలేదు.

లోకహితార్థం ప్రశ్నించినందుకు యింత హింసాకాండ జరిగింది. హైమవతి పలుకులలోని యథార్థం నారదుని హృదయాన్ని విలవిల లాడించింది. ఇన్ని పరీక్షలు చేసినా భృగువు యిదమిత్థమని నిర్ణయించ లేకపోయాడు. సమస్య పరిష్కారంకాక పోగా ప్రళయసమమయిన సంగరానికి నాందీవాక్య మయినది.

వ్యధాభరితహృదయంతో ఉన్న దేవర్షిని ఆశ్వాసిస్తూ :

'దీనికంతకూ నువ్వు నిమిత్తమాత్రుడవు - చింతించకు' అన్నాడు శశాంకమౌళి.

దేవర్షి హృదయం కొంత తేరుకున్నది; నిట్టూర్పు విడిచి :

"ఔను. నా సమస్య అమృతోత్పాదనం వరకే నడిపిస్తుంది. శ్రీదేవి ఆవిర్భావంతోనే విపత్తు దాటిపోయింది. జగన్మోహిని మహేంద్రజాలం ఈ విలయానికి కారణం."

అన్నాడు.

'జగన్మోహిని !'

ప్రఫుల్లనయనాలతో పలికింది పరమశివుని కల కంఠం.

'ఔను, ఎంతమాయ ! తన సౌందర్యంతో దేవ, దైత్య సమూహాలను ముగ్ధుల్ని చేసి పారేసింది. అమృతోత్పాదనానంతరం మీరు లేరు. నికుంభుని చేతులలోని అమృత కలశాన్ని స్వీకరించటానికి ఎన్ని టక్కులు పోయింది !

కన్ను చూపులో...

పెదవి విరుపులో...

చేతి కదుపులో...

వక్షోజ చాలనలో...

దేవ దానవులు శరీరాలనే విస్మరించారు.

అది చూరదుడు రణరంగంలో ఉన్న మనస్సును పూర్వ రంగానికి ప్రవర్తించారు.

'అంత సౌందర్యమా?

ఉత్కంఠితుడయాడు పరమశివుడు

'శ్రీదేవి హృదయమే చిపుక్కుమన్నది'

నారదుడు ఉత్ప్రేక్షించారు.

'జగన్మోహినికి పక్షపాతం ఎందుకు కలిగింది?

పరమశివుని ఆరాటహృదయం ప్రశ్నించింది.

'మహావిష్ణువు దేవతా పక్షపాతి!'

నారదుడు సందిగ్ధంగా వదిలాడు.

'మహావిష్ణువు-జగన్మోహిని! ఓహ్'

పరమశివుని చిరునవ్వు మలయానిలాలతో గగన వీధిని చుంబించింది.

'ఈ సృష్టిలో అంత సౌందర్యంలేదు'

నారదుడు పరమశివుని మనస్సుపై విసిరాడు.

ఆః!

ఆ ధ్వనిలో ఆశ్చర్యమూ, అవహేళనా సమంగా ఉన్నవి.

'మహావిష్ణువు తన అంశతో జగన్మోహినిని సృష్టిస్తే తానే మోహించేవాడు. అమృత కలశంలో ప్రతిబింబించే సౌందర్య సుషమ గర్వింపజేసి ఉండకపోతే సైంహికేయుడికి అమృతం అందేదికాదు.'

మందస్మితం చేశాడు దేవర్షి.

అనేకానేకాకృతివిశేషాలతో జగన్మోహిని పరమశివుని కన్నుల ఎదుట లాస్యం చేస్తున్నది.

* * *

సువిశాలశ్వేతచ్ఛత్రంలా సహస్రశీర్షుడు తన పడగను విప్పారాడు. మహాసంగ్రామంలో దేవతలకు విజయాన్ని ప్రసాదించి విశ్రాంతి తీసికొంటున్నాడు మహావిష్ణువు. శ్రీపతి వక్షఃస్థలంపై కోటిందుప్రభలీనే కౌస్తుభాన్ని చూస్తున్నది శ్రీదేవి. కళ్యాణ వేదికపై కన్నతండ్రి కానుకగా ఇచ్చిన కౌస్తుభం అంతరంగంలో ఆహ్లాదం కలిగిస్తున్నది. కౌస్తుభస్పర్శలో ఆమె దివ్యానుభూతి పొందుతున్నది. మధ్య మధ్య మహావిష్ణువు శ్రీదేవి పల్లవాంగుళులను స్పృశిస్తున్నాడు. ఆయన స్పర్శ ఆమె లేహృదయంలో కల్పప్రసూనాలను ప్రసవిస్తున్నది. మధుర మధుర స్మృతులు ఆమె మనోనేత్రంముందు మసలుతున్నవి. వియోగ భారాన్ని ఒకే ఒక్క వేడినిట్టూర్పుతో విడిచినాడు మహావిష్ణువు.

అదే మహాతిస్పందనం. ఏం వార్తలు తెస్తున్నాదో, వార్తలపై వ్యాఖ్యానాలే కోరతాడో,'

అన్నది శ్రీదేవి నవ్వుతూ.

మహావిష్ణువు మనోజ్ఞహాసం నారదుని అంజలిని స్వీక రించింది.

పరమశివులు వస్తున్నారు.'

అని ప్రక్కకు నడిచాడు నారదుడు.

జగన్నాటక సూత్రధారీ, అభినందనలు!

ప్రవేశించాడు పరమశివుడు.

''విశాలవిశ్వంభర నీ కనుసన్నలో అవతరించి అంత రిస్తుంది.''

పరమశివుడు స్తుతిస్తున్నాడు.

మహావిష్ణువు ఆలకిస్తున్నాడు.

యవనికాంతారంలో ఉన్న శ్రీదేవి నారదుని సమీపించి

'ఏమిటి విశేషం?'

అన్నది.

నారదుని మోములోని చిరునవ్వు ఏ పరిణామము పొందలేదు.

అలబ్ధప్రతివచనయై శ్రీదేవి నారదుని చూస్తూ పెదవి విరిచి మహావిష్ణువు వెనుక నిలబడ్డది.

'విన్నాను. నారదునివంటి ఆజన్మ వేదాంతిని సమ్మోహ పరచిన మోహనరూపం...'

పరమశివుని వాక్యాలు శ్రీదేవి సందేహాన్ని నివారించాయి.

'పాలరోదసుని ఉత్కంఠలో లోక కళ్యాణం ఉంది తీరుతుంది.'

మహావిష్ణువు నగుమోములో ఉమాపతికి అనుకూల్యమే లభించినది.

శశాంకశేఖరుడు సృప్తచేతస్కుడై కైలాసగిరి వైపు తిరిగాడు.

నగట్యంగా నారదుని వైపు చూచే శ్రీదేవి తెల్లబోయి వెనుదిరిగే సరికి మహావిష్ణువు లేడు. ఆమె కనులలో కమ్మని బాధలు రేఖలుగా జారినవి. దేవర్షి సత్యలోకంవైపు నడిచాడు.

పరమశివుని లోచనద్వయం విప్పారింది.

ఆకర్ణాయత నేత్రాలు అనిమేషములయాయి.

ఆయన హృదయములో నవపారిజాతప్రసూనాలు గిలిగింతలు పెట్టాయి. ఆ సుముహూర్తంలో ఆయన నయనద్వయమే జ్ఞానస్థితిలో ఉన్నది.

నవవికసితశిరీషకుసుమమరందమృదు గాత్రంతో సందన వనమందారమధురనిష్యంద కపోలాలతో స్థిరసౌదామనీ సదృశంగా ఉన్న దివ్యమంగళ విగ్రహం ఆయన కనులముందున్నది. ఆ కన్నులలో నిమీలనం ఆయన మనసులో మర్మరధ్వనులమ పుట్టిస్తున్నది.

ముహూర్త మాత్రంలో పరమశివుని మనస్సు ఆలోచనా శక్తిని బహిష్కరించినది. ఎక్కుపెట్టిన నారితో వసంతసఖుడు ఆయన హృదయంలో గిలగిల పుట్టిస్తున్నాడు క్షణకాలం పరమశివుడు మెదలలేదు.

పద్మహస్తాలంకృత స్వర్ణకంకణ కింకిణులు నిస్వనించినవి; పదశింజినులు ధ్వనించినవి।

నాకర్షిస్తున్నవి.

హేమనూపురబద్ధ కింకిణులు ఘలయపవనచలితమై ఝణంఝణ ధ్వని చేశాయి ప్రచలిత రత్నదీప శిఖవలె ఆ దివ్య సౌందర్యం పరమశివుని కనులకు వలలు బిగించి నడిపిస్తున్నది.

క్రీగంట చూస్తూ, జారిపోతూఉన్న స్తనవల్కలం సవరించే నెపంతో ఆగి వెనక్కు చూస్తూ క్రీడాకందుక ఖేలన సాగిస్తూ విద్యుల్లతలా పరిక్రమిస్తున్నది.

పరమశివుడు మందాకినీప్రవాహవేగంతో ఆమెను అనుసరిస్తున్నాడు. అంతలో చేజిక్కినటు చిక్కి జారిపోయినది.

పరమశివుని హృదయాన్ని కదిపి కదలించి ఊపి ఊగిసలాడించి బాలసహకారం వెనుకప్రక్క నిలబడి దాగుడుమూతలాడుతున్నది.

ఎగిరిపోయిన చీనిచీనాంశుకో త్తరీయం అందుకోబోయింది.

ఆ సమయములో పరమశివుని చేతులలో చిక్కినది.

గజగజ వణికినది.

పులుకు పులుకున చూచినది.

హృదయము చెదరినట్లు కదలినది.

ఆమె నాసాగ్రమున చిరుచెమట అణిముత్యమై మెరసినది.

చూచుకాగ్రమున కస్తూరికా మకరరేఖలు కరశీకరములు ఆకర్షించినది.

ఘనకుచములు గాఢపరిష్వంగంలోంచి అరుహావురంతా ఎగిరిపోయినది.

తెల్లబోయి వెంబడించినాడు.

గుట్టలు ... మెట్టలు ... కొండలు ... లోయలు ... కుల్యలు ... సరస్సులు... నదులు... అరణ్యాలు... వనాంతర గుహాలు-సర్వవిశ్వం గిరగిర తిరిగి గిర్రున త్రిప్పినది.

పట్టు వీడలేదు పరమశివుడు.
కవ్వించి కవ్వించి అలసినాడు మదనుడు.
అలసిన మదనుడు విశ్రమించినాడు.
విశ్రమణవేళ పరమశివుని జ్ఞాననాడి పనిచేసినది.
తటాలున నిలచినాడు ఈశ్వరుడు.
ఆలోచించినాడు...అవమానభారముతో సిగ్గుపడినాడు
స్తంభించి స్థాణువయినాడు.
చకచకసాగు శౌరి వెనుదిరిగినాడు;

స్థాణ్వాకృతిలో నిలిచిన కమండలేశ్వరుని కెదురుతిరిగి మహావిష్ణువు శిలారూపం ధరించాడు. ఆ విగ్రహమే జగన్మోహినీ కేశవస్వామి.

మేనక

శ్రీదేవి చరణాలమీద లాక్షారుణిమను రై నేసికొన్న జీరిమామిడి తోటలలో మధ్యమధ్య ఏపుగా పెరిగిన గున్నమామిడి గుబురులోంచి కూజించింది పుంస్కోకిల.

కోకిల కూతకు మేలుకాంచిన రాజర్షి నాసారంధ్రాలలో మామిడి పూలవాసనలు ముసిరిపోయినవి.

ముసిరిపోయే ముక్కుపుటాలకు త్రాళ్ళుపోసి దండకమండలు ధారియై అడుగు కదల్చిన రాజర్షి కనులలో దొంతర మలెల పాలనవ్వు కాంతులు హేమంత కృష్ణపక్ష శర్వరిలో తళ తళ లీన తారకలవలె ప్రతిబింబించినవి.

ప్రతిబింబాలను పరిశీలించకుండా పదం కదల్చిన రాజర్షి కర్ణమూలాలలోనుండి హృదంతరాన్ని స్పృశిస్తూ పుంస్కోకిల చూతాంకురాస్వాదకషాయకంఠంతో మరొక్కసారి కూజించింది.

కూజితం రాజర్షిని నిమేషకాలం విచలితుణ్ణి చేసి నిల బెట్టింది. నిలబడిన రాజర్షి ఉలిక్కిపడి కన్నులరమూశారు.

అరమూసిన రాజర్షి గుండెలోని గుసగుసలు మనసును కలవర పెట్టినవి. అంతలో పుంస్కోకిల కలరవం...

కలరవాల కలవరాలమధ్య వీధి—

చకచకసాగె రాజయువ చంద్రుడు.

సాగే రాజర్షిమార్గంలో ఏటికి ఎడంగా విశాలకాననంలో పెరిగిన రసాలం—

రసాలాన్ని పెనవై చుకొని మాధవి—

మాధవి గాఢాశ్లేషంలో మామిడి మైమరపు—

మైమరచిన మామిడి భుజాలంబనలో మాధవి—

పక్కున నవ్వినవి.

నవ్విన ట్లనిపించినది. ఒంటిగాపోయే రాజర్షికి ఆ జంటను చూడగానే—

నవ్వనే నవ్వినవి మాధవీ రసాలములు.

నవ్వే అరుణాధరాలే ఆ పల్లవాలు। వెలవి వొరనవ్వటమే ఆ తెల్లని మొగ్గలు।

నవ్విన అలసటలో ఉదయించిన స్వేదాంకురాలే ఆ మామిడిపూలు.

రాజర్షి చలించారు.

ఒక్కసారి ఆపాద కంఠ పర్యంతం చూచుకొన్నారు.

చలించినవారు రాజర్షి కారు.

కాక?

ఈ ప్రశ్నతో ఆయన బుద్ధి మనస్సును మందలించినది.

కాని-

పదములు కదలలేదు.

ఏమిటి ?—

అంతర్ముఖుడై ప్రశ్నించుకొన్నాడు.

హృదయాంతరాంతరాలలో ఏదో వాంఛ.

గుండెపై చెయ్యివేశాడు.

స్వీయ హస్తస్పర్శకే గిలగిల లాడింది హృదయం—బెదరదా మరి ?

సత్త్వగుణం మూర్తీభవించిన బ్రహ్మర్షి నూరుగురు బిడ్డల్లనూ బలిగొన్న హస్తం—

హృదయపర్యంతం సాగిన గడ్డం దువ్వి వంగి వంకరలు తిరిగిన కోరమీసం పై కెగద్రోశాడు తర్జనితో

* * *

అడుగులు పడుతున్నవి.

అడుగులు పడుతున్నా—

ఆయన కనుదోయి కెదురుగా—అల్లిబిల్లిగా మామిడిని అల్లుకొని పోతున్న మాధవి, గోచరిస్తూనే ఉంది.

ఆయన శ్రవణ కుహరాలు మాధవి నవ్వులతో గగోలయి పోతున్నవి.

ఆ మామిడి గుబురులలోని శ్వేతపారావతాల కువకువలు రాజర్షి కంఠంతో వినదిస్తున్నవి.

* * *

వివిర్మల ప్రవాహోదక స్నానపవిత్రులైన రాజర్షి ప్రవర వలికి అభివాదంచేసి, అర్ఘ్యాంజలు లర్పించారు.

ప్రాతర్మందమలయానిలుని పై తాళిక గానంతో ఉదయాద్రిపై ఉషోరాగిణి పదన్యాసం చేసింది.

ఎర్రవారిన దవళనేత్రద్వయంపై రెప్పలు మిలమిల లాడిస్తూ లజ్జాదరహాసరోచులతో ఉజ్వలతనూశోభతో ఉదయాచలాన వదములు కదిలించే ఉషాదేవిని ఆనందాశ్చర్యాలతో అవలోకించే రాజర్షి వెన్నుమీద తడిపొడిగా తగిలిన చేలాంచల స్పర్శ బ్రహ్మరంధ్ర పర్యంతం పులకరెత్తించింది.

పులకరింపులు పలకమారకుండానే తలత్రిప్పి చూశారు.

చూచు యత్నములో రాజర్షి—

చూచెదు వేళ రాజర్షి యేనేమో—

చూచినవారు రాజర్షియా—

ఊహాకందని తలపు వీధులలో విహరించు రాజర్షి విశ్వామిత్రుడు.

పక్కన నవ్వినాడు ప్రాగ్దిశలో బాలభానుడు.

* * *

మిలమిల మెరిసే రోహిణీ శుక్రతారలవలె వెలిగే కనుపాపల మీదికి అపార వార్షుకాభ్ర శకలాలవలె మసలవస్తున్న కేశపాశం...

తడిసిన చీర చీనాంబరంలోనుండి ప్రత్యంగ దర్శనం.

మెలమెల్లగా నవ్వుతూన్న పెదవుల సందులనుండి ఏదో ఆహ్వానసూక్తం వినవస్తూన్నది.

సమున్నత వక్షోజ మధ్యమున సుందరతరంబైన పీతార్ద్రవసనం మకరికాది పత్రాలను కరగించి వాసన లీనుతూన్నది...

కమలెప్పలనుండి జారే జలకణాలను ఎడమచేతి చిటికెన వ్రేలి కొనగోటితో చిలికిస్తూ...

దక్షిణ పాదాంగుళితో శ్రీకారాలు తీరుస్తూ,

త్రిభంగిగా నిలచి, పిగ్గు చీర విడిచి చుడుతూన్న స్మితశ్రీ శోభావదనమైన మేనక ఎఱ్ఱని కాటితో జుట్టు తుడిచి, వీక్షప చుడుతూన్న విశ్వామిత్రుని కౌగిలించి, హసించి, కన్నుల మూయబోయి అరమోడ్పు భుజసీమపై బుగ్గవాల్చింది.

రాజర్షి కనుల ఎదుట మామిడిని అల్లుకున్న మాధవి గుండె ఝల్లు మనగా ఘుమ్మన వాసన లీనుతూ ఝుమ్మన గాలి రేగినది.

రేగిన గాలి తరగల గిలిగింతలకు కిలకిల నవ్వి జలజల పూలు రాల్చినది మాధవి.

ఊగిపోయినది మామిడి.

ఊగిసలాడినది మాధవి.

పూలబాటపై అడుగులుంచుతూ నవ్వని నవ్వు మోముతో మేనక-నవ్వినా నవ్వనట్లుండని గంభీరవదనంతో విశ్వామిత్రుడు ఆరోహణలోని కళ్యాణిలా లతానికుంజంవైపు సాగుతున్నారు.

కళ్యాణి సేవకు వచ్చిన మలయానిలుడు పూలబాటంపై అలసి సొలసిన అడుగుల బాధలు కరిగించాడు.

ఒకే ఒక్క కూత విసిరి పుంస్కోకిల పరిసరవనాలలోనికి వాహ్యాళి పోయింది.

విహరించింది విశ్వామిత్రునిచూచి మేనక.

*　*　*

మాలతీలతా నికుంజంలో ప్రవేశించే విశ్వామిత్రుని తిర్యక్చుంబనానికి తృప్తిపొందని మేనక ఘట్టితకం ప్రసాదించింది.

*　*　*

విశ్వామిత్ర రాజర్షి మాధ్యాహ్నిక సంధ్యావార్చకుండానే చండకిరణుడు పశ్చిమ దిక్కామినీ పయోధరాచ్ఛాదిత చీనాంశుకంలోకి జారినాడు.

అనూరుని హస్తాలు వప్రాశ్వాలను విడిచినవి.

ప్రాగ్దిశావీధిని వెల్లివిరిసే శశాంకుని శీతల తుషార కిరణాలులోకి ఏడు గుర్రాల రథం చల్లబడింది.

సాయంసంధ్యోపాసనాధ్యానలేని విశ్వామిత్రుని తొంగి తొంగిచూసే తారకలు మేనక కనుపాపలతో మేలమాడుతున్నవి.

ఉషశ్శీలూ, సాంధ్యరాగాలూ లేవు రాజర్షికి.

అకుంఠిత శృంగార తపస్సమాధిబద్ధుడైన విశ్వామిత్రుని, అవహసిత వదనంతో ఉన్న మేనక అపహాసంచేసింది.

*　*　*

రాజర్షి మోములో సన్నగిల్లినది ఋషిత్వము.

సన్నగిల్లుతున్నది రాజసము మెల్లమెల్లగా.

*　*　*

క్రిందుమీదైనది మేనక.

మీదై క్రిందైనారు విశ్వామిత్రుడు.

అతిహసితయైనది మేనక.

*　*　*

కోకిల పంచమస్వరంలో త్రిస్థాయి ఉన్నది.

మాధవి పల్లవాలలో అరుణిమ తగ్గలేదు.

మామిడి చిగుళ్ళలో హరితారుణకాంతులు పసివాడలేదు.

హేమంత కృష్ణపక్ష శర్వరిలో ప్రకాశించే తారాతోరణం వలె దొంతర మల్లెలు హసిస్తూనే ఉన్నవి.

శ్రీదేవి చరణాలమీది లాక్షారుణిమను దై చేసికొన్న తీరిమామిడితోటలలో సువర్ణరేఖ ఆగస్త్యోహినిని తిలకించే లక్ష్మీదేవి కపోలంవలె ఉన్నది.

వనంలో వసంతం విడిది చేసింది. ప్రత్యగ్రమైన మహాకవి ప్రతిభను పరిహసిస్తున్నది వాసంతీలాస్యవిన్యాసం.

* * *

కామశాస్త్రానికి నూతన ప్రకరణాలను అలంకరించి ఋషిరాజ పదవీచిహ్న రేఖాచ్యుత వదనుడైనాడు, విశ్వామిత్రుడు.

* * *

అలసటతో ఊర్పులు విగుడిస్తూ సంపెంగ పూపొదరింట కూర్చున్న మేనకను చూచిన ఆయన కన్నులు ఆ ప్రక్కనే ఉన్న నారికేళాన్ని తలపైకెత్తినగాని చూడలేకపోయాయి.

నవనవలాడే పూతతో గెలలుదిగిన నారికేళ తరు వలయాలను లెక్కిస్తూ ఆయన దృష్టి దిగుతూఉన్నది. గిరగిర తిరిగినవి వ్రేళ్లతో పది వసంతాలు :

నిమిటికాకాలం కన్నులు మూశాడు.

అలసట ఎరుగని మేనక—

విజృంభితకంనుండి ఇంద్రాణి బంధనానికి అనాయాసంగా జారే అప్సరః కన్య—

నేడో

మేనక రూపుదాల్చినది అలసట -

తెలతెల బోయినాడు విశ్వామిత్రుడు.

వెలవెల బోతున్నది మేనకా సుందరవదనం.

వెలతెంబోయే విశ్వామిత్రుని హృదయం మేనకా హృదంతరాన్ని చూచినది.

చూచుటలో తృప్తి -

తృప్తిలో ఆశ్వాసన -

ఆశ్వాసనలో ఆహ్లాదతరంగితుడై నాడు.

అప్సరోభామతో అహోరాత్ర దీక్షగా సాగించిన అనురాగ తపః ఫలంగా ఒకానొక......

*　　　*　　　*

ఆలోచనలను ఆపి మేనకను సమీపించి ప్రక్కగా కూర్చుని ఒడిలో పొదువుకున్నాడు.

రేగను చూచిన అరుపావురమైంది మేనక.

మేనక కనుబొమల కుదుళ్ళలో చిరుచెమట బిందువు లంకురించి నాసాగ్రానికి సాగి ఆణిముత్యంలా భాసిస్తున్నవి.

సంక్షుభిత సాగర తరంగోద్భూత మహానిలవేగ తాడిత బాలరసాలంలా ఊగిసలాడిపోయింది ఆమె.

విశ్వామిత్రుడు ఉలిక్కిపడి పులకరింపుల పలకరింపులతో ఆమె వాలు కపోలంపై పవిత్రాంగుళులతో నవ్వుతూ, తనవైపు త్రిప్పుకొని తిర్యక్చుంబనం చేశాడు. క్షణం ఆలస్యంగా మేనక ప్రత్యుత్తరం అనుగ్రహించింది.

చిరునవ్వు నవ్వాడు రాజర్షి.

రాజర్షి దరస్మితం మేనక మోముపై శుచిస్మితానికి ఆలంబనమైంది.

పొంగిపోయాడు విశ్వామిత్రుడు.

ఉప్పొంగి వ్రాలినదాయన ఒడిలో ఆమె.

సోలిపోయినాడామె చూచుక స్పర్శతో- ఆ మహనీయుడు.

* * *

అప్సరోజన దుర్లభమైన మాతృత్వం ఆ లేత హృదయంలో గర్వరేఖలను కొనసాగించి కనుబొమలపై కదలాడించింది.

టపటప రెక్కలార్చినది మామిడి గుబురులోని పావురం.

రెపరెపలాడి ఎగిరినది వేరొక పావురం.

గుసగుస లాడినాడు విశ్వామిత్రుడు.

మేనక రుసరుస లాడినది.

నవ్వినవి శకుంత సంతతులు, కిలకిల.

రివ్వున నందనవన వీధుల కెగిసే మేనక నొక కంట-

విచిత్రంగా రోదించే పసిపాపనొక కంట చూచే విశ్వామిత్రుని కక్షంలోని దండం బిగిసింది.

ఆ రాజర్షి కమండలువులోని పవిత్రోదక బిందువులు రెండు పడి ఆ శృంగార యజ్ఞఫలం పరిపూతమైంది.

అదే బ్రహ్మర్షిత్వాన్ని కోరి సాగుతూన్న రాజర్షి.

ఇదే ఇటు వస్తూన్న వన్యబ్రహ్మర్షి.

(రామాయణ కల్పవృక్షానికి కృతజ్ఞతలతో)



తీరుతుంది.

దేవయాని

చైత్రశుద్ధ నవమి

వసంతం వసంతశ్రీ సుషమాంగియై ప్రవేశిస్తున్నది. చూత, కేతకీ, కుంద, మందార, చందన, సింధువార, మల్లికా, మాలతీ, మాధవీ, తాల, హింతాలాలు కోరకించి, అంకురించి, పల్లవించి, సుమించి, ఫలిస్తున్నవి.

చూతాంకురాస్వాద కషాయకంఠ కోకిలస్వామి పంచమ స్వరము మధుపౌరభాలతో సర్వేంద్రియాహ్లాదం కలిగిస్తున్నది.

యౌవనం మొగ్గ తొడుగుతూన్న దేవయాని, మాధవీ నికుంజ ప్రాంతమందున్న వసంత సరోవర తటాన గుమ్మటంలా పెరుగుతున్న బాలసహకార తరుశాఖపై వ్రాలిన శుకపికసంతతుల సరససల్లాపసంగత సంగీతాన్ని, ఆకర్షిస్తున్నది.

ఉదయారుణ రోచులలో సిగ్గు తెరదాటుకు విస్ఫురిమించే ఉషశ్శ్రీ శోభలు దేవయానిస్మితవదనంలో ఆకాశకార్ఘ రేఖలు చిత్రించినవి. దేవయాని కనులు నెరవిచ్చినవి. నునుసిగ్గు దొంతరల కిలకిలలు నెరవిచ్చిన కనులలో మిలమిల లాడినవి. నెరగంట

చూచినది. అరకంట చూచినది. క్రీగన్ను బరపినది. అరచేయి కనుల కాతపత్రముజేసి చూచినది. దేవయాని గుండె సిగ్గుతో నిండి పోయినది.

అంతలో ఆమెగుండె కలత వడ్డది.

ఆమె శరీరమే గజగజ లాడినది.

అనిర్వచనీయ వేదన ఆమె సుమహృదయాన్ని మెలిద్రిప్పినది.

క్షణాలలో ఆమెను స్వస్థత చేరినది.

జారిన పైట సరిజేసికుంది.

రేగిన ముంగురులు దిద్దుకోవాలని ఎత్తిన వామహస్తం బాలసహకార తరుశాఖపై వ్రాలింది.

ఆమె అరుణాధరాలు ప్రకంపిస్తున్నవి.

అవ్యక్తవాంఛా సమాకృష్ట మవుతున్నది మనస్సు.

దీర్ఘనిశ్వాసం వగలి అప్రతిహత దివ్యాస్త్రంలా వస్తున్న వ్యక్తిని పరిశీలనగా చూడసాగింది.

బాలార్కబింబంలా ఉన్న శతోవదనంమీద బ్రహ్మవర్చస్సు మూర్తీభవిస్తున్నది. కొనసాగిన ముక్కుచివర వంపు ఉజ్జ్వల భవిష్యత్తును సూచిస్తున్నది. ఉంగరాలు తిరిగిన శిరోజాలు భుజాలమీద విశ్రాంతి తీసికుంటూ మలయానిలానికి నాట్యం చేస్తున్నవి విశాల వక్షస్థలంమీద చీనాంబరం చిందులు త్రొక్కుతున్నది. గోచిపోసి కట్టిన శీరాద్ది ధోవతి పాదాలపై నవశోభ లీనుతున్నది. వామ భుజంమీదనుండి దక్షిణ పార్శ్వానికి వ్రేలాడుతూన్న యజ్ఞోపవీతం...

బలబద —

దేవయాని మనో మానస సరోవరంలోని భావరాజ హంసలు రెక్కలువిచ్చి రివ్వున ఎగిరినవి.

"క...చు...డు...ఆచార్య బృహస్పతి సూనుడు."

ఆమె గుండెలో మనసు గుసగుసలాడింది. విన్న పొంద్య వేళ దేవర్షి నారదులు పలికిన వాక్యాల స్మృతితో. బారసాచి అడుగులు వేసికుంటూ మహాదీక్షతోవచ్చే కచుడు సమీపిస్తున్న కొద్దీ దేవయాని శీర్షం నమ్రం కాసాగినది.

అవనత వదనమైన దేవయానికి బొబ్బరెక్కి ఎఱ్ఱవారిన కచుని మృదుపాద పద్మములు కంటనీరు త్రిప్పినవి. ఆ క్షణములో ఆమెదృష్టి ఓషధులవైపు మరలినది; ఆమె హృదయ మాతని పదసేవకు కుతూహల పడినది; కాని అభిజాత్య మామెను కదల నీయలేదు.

ఆషాఢప్రథమదివసాంతవేళావ్యాప్త పుష్కలావర్తకాంభో ధరోద్భూతసౌదామనీమాలాసదృశదీప్తభమణమహావేగంతో కదలే కచుని పదములు తక్కున ఆగినవి.

ఆగిన కచునివైపు దేవయాని క్రీగన్నుదరహసితవదన కాంతితో కదలింది.

కదలిన దేవయాని కేల్దోయి అంజలి ఘటించింది. అంజలి ఘటించిన దేవయాని ఆశించినట్లు ఆశీర్వదించలేదు ఆచార్య సూనుడు.

ఆచార్యసూనుని నిర్లిప్తత దేవయాని గుండెలో చురుక్కున గ్రుచ్చుకొన్నది.

"ఆచార్య శుక్రుల ఆశ్రమానికి అంతేవాసిగా వస్తున్న అమరగురు పుత్రుణ్ణి. బార్హస్పతిని"

అన్నాడు, దేవయానివైపు అచంచల దృష్టి ప్రసరిస్తూ.

"ఆచార్య శుక్రుల అనుంగుపుత్రి అభివందనం చేస్తున్నది. ఆశీర్వదించండి, దేవయానిని"

అని చిరునవ్వు నవ్వింది.

"అధ్యయన దీక్షితుడికి ఆశీర్వాదాధికారం లేదు"

అని అడుగు కదల్చబోయిన కచుని ఉరఃస్థలంమీద దేవయాని దక్షిణపాణి నిరోధ సూచకంగా నిలబడింది.

"అధ్యయన దీక్షలో అవరోధాలు అనేకాలు"

దేవయాని కలకంఠం పలికింది.

కచుడు చలించినాడు; కచుని మనస్సు విచలిత మయినది; హృదయ మాందోళికారోహణ మొనర్చినది.

"అవరోధాలు దీక్షాపరీక్షలు"

అని దేవయాని పాణిపద్మాన్ని కరాంగుళులతో తప్పింప జూచినాడు.

కచుని యత్నము వ్యర్థమయినది.

దేవయాని ముకుళిత పాణిపద్మంలో కచుని హస్తాగ్రాలు బిగిసిపోయినవి.

ఆమె ఆర్ద్రనేత్రములు లాలాపూర్ణ దృక్కులను ప్రసరిస్తున్నవి. ఆమె విచలితారుణాధరాలు కచుని కెంపెదవుల నాకర్షిస్తున్నవి.

పరాక్కుగా చూస్తున్నాడు కచుడు.

ఎదురు వచ్చినది దేవయాని.

బ్రహ్మచర్య దీక్షాదీక్షితుడయిన కచుడు దేవయానిని ప్రక్కకు నెట్టి ముందుగా అడుగు కదిపాడు.

"ఆచార్యపుత్రి అగ్రహాన్ని అర్థయునానికి అశక్యంగరంగా భావించరాదు మహాత్మా!"

అని పకాలున నవ్వినది.

ఆమె నవ్వు కచుని పదములను బంధించినది.

"ఆచార్య పుత్రీ!"

అని వెనుదిరిగి నిలబడినాడు కచుడు.

"కాను. ఆచార్యుని ఏకైక కన్యపుత్రివి. ఆలోచించి అడుగు కదుపు."

అని కనుకొలుకుల చాటరాని కచుని చేరినది దేవయాని.

దేవయాని లోకాన విలాసాలు, పదునారవ విద్యాధిపాలు, నవ వసంతాల వికాసం, ఆమె సర్వస్వం కచుని ఉచ్ఛ్వాస - నిశ్వాసలను నడుపుతున్నాయి.

"దేవయానీ!"

ఆనంద, తపోతేజోశౌర్యాలు కచుని కంఠంలో ధ్వనించాయి.

"దేవలోకంనుండి పంపేటప్పుడే చెప్పి ఉంటారు. ఆచార్య శుక్రుని అనుంగుపుత్రి దేవయానిని..." సిగ్గుతో, అరకంట చూపుతో, పైటచెంగు మెలిద్రిప్పుతూ ఆగినది దేవయాని.

కచుని మనస్సీమలో స్మృతితరంగాలు పరుగులెత్తినవి. కన్నుల ఎదుటనున్న దేవయాని అతని మనోఫలకమీద లాస్యమాడుతున్నది.

"కామ...కా...వి"

మరి మాట్లాడలేదు, కచుడు.

"అపరిచిత వ్యవహారాలపట్ల గం తత్త్వం అవి ఆపన్న మయినప్పుడు ఎంతటి బుద్ధికుశలతనూ పనిచెయ్యనీదు"

అని అతని దక్షిణ కరాన్ని తన వామహస్తంతో నందించి అడుగు కదిపింది.

దేవయాని తన వామభాగాన్ని కౌ భాగాన్ని స్వీకరించటం కచునికి ఆనందదాయకమైనది.

"ఆఁ, మనం ఆశ్రమానికే వెళుతున్నాం కాదూ?"

కొంతదూరం నడిచాక అడిగాడు కచుడు.

అనుభూతము కాని అనుభూతులను ఆస్వాదిస్తూ ఉంటూ అడుగు కదిపే దేవయానికి కచుని ప్రశ్న వినబడలేదు.

ఆమె సర్వాంగములు కచుని హస్తస్పర్శతో పులకించి పలకరిస్తున్నవి.

"దేవయానీ! మనం ఆశ్రమానికే వెళుతున్నామా?"

అని ఆమెచేతిని విడిపించుకుని అడిగాడు.

ఉలిక్కిపడ్డది దేవయాని.

దేవయానిగుండె గతుక్కుమన్నది.

"ఏమంటున్నారు స్వామీ!"

అని కిక్కుకిక్కుమంటూ చూచింది, విచిత్రమయిన కోపాన్ని అభినయిస్తూ.

అంతలో ఎదురువస్తున్న దేవయాని చెలికత్తెలు ఆమె హృదయంలో తూట్లు పొడిచారు.

"వచ్చేవాళ్ళ నడగండి."

అంటూనే దేవయాని అదృశ్య అయింది.

౨

"ఆచార్యులకు పార్శ్వస్పృశి అభివాదాలు"

అని సాష్టాంగపడ్డాడు కచుడు, ఉత్తరీయాన్ని నడుము చుట్టూ చుట్టి.

ప్రాతస్సంధ్యాదీక్షనుండి కనులువిచ్చి లేస్తున్న శుక్రాచార్యుడు :

"మనోఽభీష్ట సిద్ధిరస్తు"

అని ఆశీర్వదించాడు.

"ధన్యోఽహం। ఆచార్యుల ఆశీర్వాదం అమోఘం."

అని పులకిత హృదయుడయాడు కచుడు. ఆచార్యశుక్రుడు కనులు నెరవిచ్చి చూచాడు; ఆయన మనోనేత్రం కచుని రూపురేఖలను చిత్రించుకొన్నది. కుశాసనంపై సుఖాసీనుడై ఉన్న ఆచార్యుల పార్శ్వభాగాన పద్మాసనాసీను డయినాడు కచుడు.

"జ్ఞానభిక్షార్థులకు ఆచార్య శుక్రుల ఆశ్రమ ప్రవేశవేళ "మనోఽభీష్ట సిద్ధిరస్తు" అన్న ఆశీర్వచనంకంటె ఆశ్వాసన నిచ్చేదేమిటి గురుపూజ్యా। ఈ అంతేవాసి మీపదసేవకు అంకితుడు"

అని తలవంచినాడు.

"ఆచార్య కంఠం అసత్యాలతో ఆశీర్వచనం పలుకదు. అయినా అంతేవాసికి పరీక్షలే అఘాతాలు. అభ్యసించే విద్యకూ, ఆగమించే అవరోధాలకూ సంబంధం ఉండదు. ఇది రాక్షసాచార్యుని ఆశ్రమానికి పంపేవేళ అమరగురువులు విస్మరించరే"

అని అరచేతి వెనుక భాగంతో కోరమీసం పైకెత్తినాడు ఆచార్య శుక్రుడు.

"సమస్కంధుల ఆలోచనలు !"

అని నవ్వక నవ్వినాడు కచుడు.

"అనుకుంటూనే ఉన్నాను, ఇటువంటి విషమస్థితికి కూడా అమరాచార్యుని మేధ సాహసిస్తుందని. కానియ్యి, పిపాసువుకు శీతలోదకా లీయటం గృహస్థధర్మం. విద్యాతృష్ణతో వచ్చేసినవారికి విజ్ఞానదానం చేయటం ఆచార్యపీఠానికి విధి. ఆశ్రమాలలో అమరాసుర భేదంలేదు. అమరగురు పుత్రుడు అసురాచార్యుని అంతేవాసిగా వచ్చి శుష్కహస్తాలతో పోవటం ఆచార్య శుక్రులకే అవమానకరం"

అని అట్టహాసం చేశారు శుక్రాచార్యుడు.

"ఆచార్యుల అభిమానానికి అనవరత విధేయుణ్ణి"

అని పొంగిపోయాడు కచుడు.

శుక్రాచార్యుని మహాహాసంలో కచుని సంతృప్తిపూర్వకమయిన నిశ్వాసలు హరించిపోయాయి.

త్రిమూర్తులలో ఎవరి నారాధింపవలయును ;"

3

ఆచార్యశుక్రుని ఆశ్రమంలోకి అమరగురుసూనుడు ప్రవేశించిన వార్త మెలమెల్లగా రాక్షస వీరుల కర్ణమూలాలలో శూలంలా గ్రుచ్చుకొన్నది. బార్హస్పతికి భార్గవుడు విద్యాదానం చేయటానికి సమ్మతించిన విషయం మరికొంత ఆలస్యంగా గ్రహించారు రక్షోవీరులు. అమరాచార్య సూనుడికి శుక్రుడు తన ఆశ్రమంలోనే స్థానం యీయటం, బృహస్పతినే అతిధిగా సత్కరిస్తున్నట్లు శుక్రుడు తృప్తిపడటం రాక్షసావళికాన్ని కలవర పరచింది. రాక్షసజాతి భూత, వర్తమాన, భవిష్యత్తులు ఆచార్యశుక్రుని అభిచరణంలో ఆధారపడి ఉన్నవి. వారి అభ్యుదయానికి అనవరతాంతరాయాలు కలుగజేసే అమరజా ప్రధాన సచివుడయిన బృహస్పతి ఏదో ప్రయోజనాన్ని తలపెట్ట కుండా తన కుమారుణ్ణి బలవద్విరోధివద్ద విద్యాభ్యాసానికి పంపడు- అనే తీర్మానాన్ని రాక్షస సచివులు ప్రకటించటానికి ఎక్కువకాలం పట్టలేదు. రాక్షస సచివుల ప్రకటనలో ఆచార్య శుక్రులపై అనుమానం లవలేశమూలేదు; కాని కచునియత్నమే శంకించ బడ్డది. సచివమండలి అద్యతన కర్తవ్యాన్ని నిర్ణయించకుండానే సమావేశాన్ని ముగించింది. జరిగిన విషయాన్ని పరిశీలించటం వినా 'ఇదమిత్థ' మనే నిర్ణయాలేమీ జరుపకపోవటం రాక్షస యువకులకు అసంతృప్తిని కలిగించింది. సచివమంటపంనుండి నిష్క్రమించే పెద్దలవైపు కొరకొర చూశారు బాలవీరులు. త్వరపడి ఒక నిశ్చయానికి రావడం ఎదిరికంటె తమకే అనర్థం కావచ్చుననుకున్నారు సచివులు.

ఆచార్య బృహస్పతి యే సంకల్పంతో తన కొడుకుని పంపాడో ఒక్కరికీ అర్థంకాలేదు. బ్రహ్మవిద్యోపదేశంకోసం కచుడు శుక్రాచార్యుల నాశ్రయించవలసిన పనిలేదు. ఇతర శాస్త్రాలను అధ్యయనం చేయటానికి ఆశ్రమాలు లేకపోలేదు. కులపతులు లేకకాదు.

మరి ?

ప్రశ్నకు జవాబు దొరుకలేదు.

ఒకరిపై పొకరు కన్నులవిప్పి చూశారు. ఒకరి ముఖంలోని అసంతృప్తి అందరి కనులలోనూ ప్రతిఫలిస్తున్నది. రాక్షస యువకుల ఆలోచనకంటె ఆచరణకే అగ్రస్థానాన్ని అనుగ్రహించి అడుగు కదిపారు ఆచార్యాశ్రమంపైపు. మధ్యేమార్గంలో అనేకులు అనేక మీమాంసలు సాగించారు. ఏఒక్కరి తర్కమూ అనుమానాన్ని అధఃకరించే ప్రమాణాలను ప్రతిపాదించ లేకపోతున్నది. ఆప్తవాక్యమయినా అందలేదు.

"ఒకవేళ కచుడు ఆచార్యపుత్రిని వలచి వచ్చాడేమో ?"

సందేహాన్ని ప్రకటించాడొక నవయావనుడు.

"అసంభవం. బృహస్పతి కొడుకు ప్రేమవ్యవహారాలకోసం రాక్షసాచార్యుని ఆశ్రమానికి రాడు"

అని కోరమీసం మెలిద్రిప్పారు, నడివయసువారు.

౪

శర్మిష్ఠ కబురంపినది.

దమయంతి స్వయముగావచ్చి పిలచినది.

[illegible] కలుషిత [illegible]
[illegible] వెక్కిరించినది.
సంధ్య వలుకరించినది.

దేవయాని మౌనముద్ర వాడలేదు; [illegible] వీడలేదు.

కచునిదూరచినదాది ఆమె మనసు మనసులోలేదు. స్వర్లోకపు వింతలు, విశేషాలు విన్న దేవయానికి కచుడే స్వర్లోకమయాడు. స్వర్లోక భోగమువలెనే కచుడుకూడ దేవయాని కన్నుల యెదుట మాత్రమే నర్తిస్తున్నాడు.

నిరంతరలక్ష్యసాధనాచిత్తు డయిన కచునికి దేవయాని దృష్టిలేదు. ఆచార్యకృపని ఆదేశాలను ఆచరించుటయే [illegible] గురుశుశ్రూషే [illegible] దీక్ష. అతని కన్యచింతలేదు. అమరజాతి భవిష్యత్తు తన చేతులలో ఉన్నదని కచుడు మరచిన క్షణములేదు. అతని కనుల యెదుట పితృపాదు లొకవంక, అమరేంద్రు డొకవంక ఆశానేత్రములతో నిలబడి పిలుస్తున్నారు.

దేవయానికి రాత్రి నిద్రలేదు.

ఆమెకు పగటిపూట విహారము లేదు.

అనుక్షణము ఆమెకనులు కచుని కొరకు నిరీక్షిస్తున్నవి. ఆమె సుమహృదయము కచుడు బంభరము కావలెనని కోరుచున్నది.

"బార్హస్పతీ"

దేవయాని పిలచింది.

ఆచార్యులు అనుష్ఠానంలో ఉన్నారు. ఆయన ఎదుట పద్మాసనం వేసికొని ఉన్న కచుడు ఉలిక్కిపడి చూశాడు.

దేవయాని విలోల లోచనాలతో ఆహ్వానించినది. ఆలోచించాడు కచుడు. రోజులు గడుస్తున్నవి; ఋతువులు మారుతున్నవి; ఆచార్యులు అధ్యయనదీక్ష విచ్చుటలేదు. అమరపురి నుండి వచ్చినాడు:

"శుక్రాచార్యుల అనుంగుపుత్రి దేవయాని. ఆమె తోడి సఖ్యమువలన మన కృషి ఫలవంతము కాగలదు"

అని పితృపాదులు పలికిన వాక్యములు కచుని మనోవీధిలో మసలినవి.

కచుని హృదయము ఉప్పొంగినది.

అతని కన్నులు ఉత్ఫుల్లములయినవి.

అతని శరీరమే చంద్రోదయోద్వేల సాగరమయినది.

'దేవయానీ'

సాదరపూర్వ కంఠముతో సమీపించాడు.

దేవయాని సంతోషతరంగితస్వాంత అయినది.

ఆమె మారు పల్కలేదు; తలవాల్చి, క్రీగంట చూడసాగినది. కచుడు చకితుడయినాడు.

బ్రహ్మచర్య దీక్ష!

దేవజాతి భవిష్యత్తు!

కచుడు స్వరమును హెచ్చించి;

"గురుపుత్రీ! ఏమి ఆజ్ఞ? వసంత సరోవరంలో వికసించే కల్హారాలతో క్రీడా కందుకం కట్టిపెట్టనా?"

అని అరుగు కథల్పినాడు.

దేవయాని విద్దూక్ప విడిచినది.

"నా కన్నుల్లో అంతకుమించిన ఆశలు కనిపించటంలేదా బృహస్పతి మనుమిడికి ?"

స్మితశ్రీ సుషమాసంయుత వదనం పైకెత్తి అడిగినది. దేవయాని.

"గురుపుత్రీ !"

వినయంగా దోయిలించాడు కచుడు.

"అనుక్షణం గురుస్మరణా, గురుశుశ్రూషలేనా? దేవయానీ! అనలేవూ"

అని సిగ్గుతో చూచినది దేవయాని.

"బ్రహ్మచారిని, విద్యాదీక్షితుడను, శుక్రాచార్యుల అంతే వాసిని; అంతకన్న..."

అని కచుడు నవ్వగా దేవయాని ముక్కుమీదకు తర్జనీ వదిపింది.

"పితృపాదుల అనుష్ఠానానికింకా వ్యవధిఉంది. ఇంతలో, వసంతసరోవరంలో జలక్రీడలాడి వద్దాం"

ముందడుగు వేసింది దేవయాని.

"బ్రహ్మచారికి నిషేధాలేవో తెలీని దానవుకాదు ఆచార్యపుత్రీ !"

"ఆచార్యపుత్రి ఆజ్ఞలను అవహేళన చేయటం అంతేవాసికి విధికాలోలు"

చిరుకోపంతో పెదవులు కదలించింది, దేవయాని.

"విధి, నిషేధాలను తెలిసికోవటానికి అభ్యంతరంలేదు కాని సామాన్యాంశాలు తెలివిపట్టిరాను"

"కనుకనే చెప్తున్నాను"

"తెలిసినవే తెలిసికోనా?"

"నీకు తెలిసినవి నువ్వు చెప్పినట్లు సామాన్యాలు మాత్రమే. నేను విశేషాపద్ధర్మాలు చెప్తున్నాను"

"ధర్మ నిర్ణయంలో అబలల చంచలహృదయం..."

"చంచల హృదయంతోనే అభ్యసిస్తున్నాను"

"గురుపుత్రీ"

అని విక్షిప్తంగా చూచి కచుడు శుక్రుని చేరాడు.

ॐ

శరత్సంధ్యారాగాలు వసంతసరోవరంలోని అరుణవర్ణాలకు అలంకారాలు దిద్దుతున్నవి. ఆశ్రమ పరిసరాలనుండి వెలువడే హోమధూమం సంధ్యాదేవి పైనేసికొనే మేలిముసుగులా సాగుతోంది. ప్రకృతి నిశ్శబ్దాన్ని వరించింది. పూరివిప్పిన నెమలి మాలతీనికుంజం మాటునున్న పుట్టలవైపు అంచలానడుస్తున్నది. గున్నమావి గుబురుల్లో కులికి కూర్చున్నవి శ్వేతపారావతాలు.

భార్గవుని పార్శ్వభాగాన ఉండే బార్హస్పత్యివైపు చూచే దేవయాని కనుపాపల్లా మెరుస్తున్నవి తారకలు.

ముకుళించిన అడవి మల్లెలు వికసిస్తున్న వాసనలు ఆశ్రమానికి అల్లంత దూరంలో నిలబడ్డ దేవయాని నాసాగ్రాన్ని పరిమళమిళితం చేస్తున్నవి. గారాముగా పెంచే హరిణకిశోరము

చెంగు చెంగునవచ్చి జారి వ్రేలాడుతూవున్న చీనాంశుకో త్తరీయాన్ని ముట్టిపెదవులతో పట్టి లాగి పరువులిసినది. దేవయానికి అస్పృహ లేదు. ఆశ్రమ సమీపంలో వెనుదిరిగి చూచిన "కిశోరము" ఒక్క చెంగులో దేవయానిని సమీపించి బిత్తరిచూపులతో పాదాలను ముట్టింది.

దేవయాని చకిత అయినది.

తన పాదములపై కచుని అంగుళిలు స్పృశిస్తున్నవనుకొని తలవంచి చూచినది.

హరిణకిశోరము!

దేవయాని సిగ్గుపడినది. విరాళి విలువెల్ల రోచినది.

వెట్టూర్పు విడిచి కిశోరిని ఎత్తుకుని గుండెలకు హత్తుకుని వెనుదిరిగి చూస్తూ, ఆగి యాగి నడుస్తూ ఆశ్రమద్వారమును సమీపించినది.

ద్వారసమీపాన తలవ్రేల వైచుకొని నిలబడిన కపిలగోవు దేవయాని హృదయమును విచలిత మొనర్చినది. దిక్కులు పరికించి చూచినది. కపిలతో వెళ్ళిన కచుడులేడు.

దేవయాని కంట నీరు తిరిగినది.

ఆమె పదములు గజగజ లాడినవి.

కపిల మూపురముపై చేయి వైచినది; కపిల తలయూచి సంతసించలేదు.

దేవయాని కన్నీరు కపిలమూపుపై ప్రవహించుచున్నది. కపిల కనుగొలకులలో బాష్పబిందువులు నిలిచినవి.

పాంధ్యకృత్యములు నిర్వర్తించి వచ్చిన శుక్రాచార్యుడు కపిలనూ, దేవయానినీ సాదరపూర్వ హస్తములతో సోకినాడు. దేవయాని తండ్రికి నమస్కరించలేదు; మనోజ్ఞహాసముతో మధురవాక్కులు పలుకలేదు; కపిలగ్రీవము నాదించలేదు. తల పైకెత్తలేదు.

చలించినది రాక్షస సచివుని మనసు.

ద్రవించినది రాక్షసాచార్యునిహృదయం.

ఆలోచించినాడు భార్గవుడు.

భార్గవుని బుద్ధి తైక్ష్ణ్యద్యుతులయెదుట దేవయాని లేహృదయ మందధివసించిన బార్హస్పతి ప్రతిఫలించినాడు. అమంగుపుత్రి అనురాగాన్ని ఎరుగనివాడు కాడు ఆచార్యశుక్రుడు.

దేవయాని చిబుకము పైకెత్తి చూచిన శుక్రాచార్యుని కనులు కించిదార్ద్రములయినవి; తల ప్రక్కకు త్రిప్పినాడు. కపిల తలయెత్తలేదు.

"నాన్నా, బార్హస్పతి సంధ్యావందనంచేసి రాలేదు; తలపి వెళ్ళిన కపిల ఒంటిగా..."

దేవయాని గొంతు విడలేదు.

ఆమె కనులలో అశ్రుధార ఆరంభమయినది.

ఆచార్య శుక్రుని క్రాంతనేత్రము కచుని స్థితిని చూచినది.

సురవైరి మండలికి సురేశ్వరాచార్య సూనునిపైగల ద్వేషభావం ఆచార్యులకు అవగతపూర్వం.

నిలచియున్న దేవయాని నిలచియున్నట్లే యున్నది.

తలవాల్చిన కపిల తల త్రిప్పనేలేదు.

అంతలో కదలివెళ్ళి తిరిగివచ్చిన ఆచార్యుని వెనుక నిలచియున్న కచుని ఏశ్వనము కపిల కన్నులలో కాంతిని. దేవయాని హృదయములో కాంతిని ప్రసరించినది. ఆచార్యుడు ఆలోచనా మగ్నమనస్కుడై ఆశ్రమప్రాంతస్థ వటతరుచ్ఛాయాచ్ఛాదిత వేదికవైపు నడచినాడు. అనుసరించబోయిన అంతేవాసి హస్తాంగుళులు దేవయాని పాణికిసలయాలలో బంధింపబడి పోయినవి.

వెనుదిరిగినాడు కచుడు.

ఆశ్రమంలోకి నడిపిస్తూ జరిగిన కథను కచునికి చమత్కారంగా వినిపించినది దేవయాని.

కచుడు నవ్వినాడు.

కచుడు నవ్వినట్లు దేవయానికి తోచినది.

దేవయాని నవ్వినది.

నవ్విన దేవయాని కచుని కలవరపరచినది.

కచుడు బ్రహ్మవిద్య నుపాసించినాడు.

బ్రాహ్మము కచుని హృదయమును ధవళిత మొనర్చినది. అతని బుద్ధిని నిశ్చల మొనర్చినది.

ఆరగించుచున్న కచునితో ఏమేమియో భాషించుచు, రాక్షస మాయలు, తన తండ్రి మహాశక్తి నివేదించుచు అతని ముంగురులు దిద్దసాగినది. కచుడు భోజనము ముగించుచునే ఆశ్రమమును వీడినాడు.

తిరిగి వసంతకాల మరుదెంచినది.

కచుని ప్రవేశవసంతబాలిక ద్విశత జన్మదినోత్సవము జరుపుకొన్నది.

ఈ జయంతికి శుకపిక సంతతులు కలకంఠము లెత్తినట్లు దేవయానికి తోచలేదు. లతానికుంజములు రంగురంగుల రంగవల్లులతో స్వాగత మిచ్చినట్లు దేవయాని గ్రహించలేదు. వసంతసంతస హంసలామె మానససరోవరమున విహరింపరాలేదు; అందలి పద్మములు వికసించలేదు; పద్మములమీది హిమాంశువులు జారనేలేదు. వానివలెనే ఆమె కనుదమ్ములందును కించి దుష్ణజలలవములు సాగియున్నవి. వసంతసరోవరతటమున నిలబడిన దేవయాని చూపులు సుదూరమునకు సాగియున్నవి. ఆ చూపులను దూసుకొని వచ్చుచున్నవి సంధ్యారుణకాంతులు.

దేవయాని ఆర్ద్రనయనములు సంధ్యాకాంతులలో ఇంద్రధనుశ్శోభల నీనుచున్నవి.

దేవయాని చూపులవేడికి సంధ్యాకాంత తప్తహృదయయైనది. ఆమె తనువల్లి తాపఘర్మ జలముగా నక్షత్రముల నలంకరించుకొన్నది.

దేవయాని నిట్టూర్చినది.

నిట్టూర్చిన దేవయాని కనుబొమల కుదుళ్ళలోని చిరుచెమట బిందువులు ఆమె కనులలో పడి మూయించినవి.

మూసిన కనులు మూయకుండ తెరచుకొన్నవి.

తెరచుకొన్నంతలో కొంగు కనుల నొత్తినది.

ఒత్తునంతలో ఆమె కన్నులార్ద్రమయ్యెను.
ఆర్ద్రనయనములతో అడుగు కదిపినది.

పచ్చెడి దేవయాని తనువల్లి విలయ వేళాసమద్భూతాని ప్రచండవేగ తీవ్రసంచలిత సంక్షుభిత సాగర తరంగోత్తుంగ శిఖరతాడిత సైకత తటస్థ బాలరసాలమువలె నున్నది.

అనుష్ఠానాదులు ముగించుకొని వచ్చిన ఆచార్యశుక్రుడు అనుగుణబద్ధుడు చూచినాడు. ఆయన మనము ఆమె మనసు నాకర్షించినది. ఆమె మనసు కచుని మనసు నలరింప జూచుచున్నదో

కాదనలేదు కన్నతండ్రి.

ఒకానొక జాతినే సమూలనాశన మొనరించుటకు సంకోచించని అసురాచార్యుని హృదయము ఆజన్మవైరి పుత్రుని ప్రేమించుచున్న చిట్టితల్లి మెడ మమకారమును పీకలేక పోయినది.

కన్నగుండె!

శుక్రుడు శంకించినాడు.

నారదుడు శంకాపల్లవిత బీజములను చల్లిపోయినాడు.

శంకించిన శుక్రాచార్యుని హృదయము సంకుచితము కాలేదు. సంతోష తరంగితమే అయినది.

దేవాసురాచార్య పుత్రపుత్రీ సంబంధ సాన్నిహిత్యమయినా పరస్పర వైర నాశనానికి దోహదం యిస్తుందనుకున్నాడు. కాకపోయినా అమరాచార్య సూనుడు 'ఆచార్యదేవోభవ' అని అంజలి ఘటించి అసురగురుని ప్రార్థించడం సామాన్య యోగమా!

పొంగిపోయినది ఆచార్యుని హృదయము.

ఆచార్యుని హృదయములో దేవయానిపై అనురాగము అవధుల నతిక్రమించినది.

యౌవన ప్రాదుర్భావ దేవయాని—

బ్రహ్మచర్య దీక్షితుడు కచుడు—

ఒకే అయస్కాంతమునందలి రెండు ధ్రువములు. విభిన్న ధ్రువములకు ఆకర్షణ నిసర్గమే కాని ఏకాయస్కాంత మందలి భిన్నధ్రువములకు కలయికయేమి? విడుటయేమి? అన్యోన్యతయు ఉన్నదనలేము.

ఇది జరుగుచున్నది.

జరుగుచున్నది ఆచార్యునికి అవగతమే—

సజల నయనాలతో ఎదురువచ్చుచున్న దేవయాని అసంతృప్త చేతముతో భీతహృదయముతో తండ్రి వక్షముపై తల వాల్చినది.

ఆచార్యుని గుండె గుసగుసలుపోయినది.

ఆయన దక్షిణహస్తము దేవయాని శీర్షముపై కదలుచున్నది.

ఆయన పెదవులు వణకుచున్నవి.

ఆయన శరీరమే చలించుచున్నది.

పెదవి కదల్చి పలుకలేకపోయినాడు ఆచార్యుడు.

దేవయాని హృదయము చిక్కబట్టుకొనుసరికి ఆచార్యుని మోముపై విషాదమేఘములు చెల్లాచెదరై పోయినవి.

"రామా, బృహస్పతీ తాలేయా."

అని కనులుమూసి, అంతర్దృష్టిని బాహిర మొనర్చినారు. అతల, వితల, రసాతలాది అధస్సప్త లోకాలలో? భూలోక తపోలోక సత్యలోకాది ఊర్ధ్వసప్తభువనాలలో కనిపించలేదు. చకితుడై ఆచార్యుడు అంతర్దృష్టిని అంతరంగంలోనికి పంపినాడు.

ఆచార్యశుక్రుని అంతరంగము ఆశ్చర్యానందోద్వేల మయినది. అంతలో ఆయన కన్నులలో విస్ఫులింగములు వెదలినవి.

నాటి అపరాహ్ణ వేళ అసుర సామంతమండలి జరిపిన విందులో ఆచార్యులకు ప్రత్యేక పాత్రలో సమర్పింపబడిన మద్యములో భస్మావశేషము సమ్మిళిత మొనర్చినారు.

ఆచార్యుని ఆగ్రహము ఆకాశము నంటినది.

అధ్యయన దీక్షతో వచ్చిన అమాయిక బాలకుణ్ణి హతమార్చి భస్మాన్ని మద్యంలో కలిపి ఇచ్చినా గుర్తించలేని ప్రమత్తతను కలిగించే సురాపానం శుక్రాచార్యుని శాసనంగా, నాటినుండి మేధావులకు నిషేధమయినది.

ఆచార్యశుక్రుడు తన గర్భంలో అణురూపంలో ఉన్న కచుణ్ణి ఆత్మతో ప్రబోధించాడు. కచుడు పలికినాడు.

ఆచార్యుడు అవసరకృత్య నిర్వర్తితుడై పద్మాసనాసీనుడై కూర్చున్నాడు; ఎదురుగా అశ్రుప్రపూర్ణలోచనాలతో దేవయాని నిరీక్షిస్తున్నది. ఆమె లేతగుండె వలపుల దావుల కేళ మొత్తినది.

ఉద్గారణ దశచేత అభిహితమయిన శబ్దంలా, ఆచార్య శుక్రుని గర్భంనుండి అవతరించిన కచుడు, గర్భంలోనే అభ్యసించిన మృతసంజీవనీ దివ్యమంత్రముతో ఆచార్యుని పునరుజ్జీవితుణ్ణి చేశాడు.

ఆచార్యశుక్రుడు నిద్రనుంచి మేల్కొన్న వానివలె లేస్తూ, కచ-దేవయానుల నిరువురివైపూ మందహాస ధవళిత లోలనయనాలు జరపాడు.

దేవయాని సిగ్గుతో కనులు మిలమిలలాడిస్తూ ఓరగంట చూచినది.

కచుడు దీక్షాపరిపూర్తి నందిన సంతృప్త హృదయంతో గురుపద పద్మాలకు నమస్కరించాడు.

ఆచార్యశుక్రుడు ఆశీర్వదించాడు.

* * *

తెల్లవారినది!

శుక్రాచార్యుడు అత్యవసర కార్యంమీద అధికుని ఆస్థానానికి నడిచాడు.

సెలవు తీసికొన్న కచుడు ఉత్కంఠంతో అమరావతి వైపు నడుస్తున్నాడు.

వసంతసరోవరతటాన మల్లికావితానం ప్రాంతాన గుమ్మటంలా పెరుగుతున్న బాలసహకార వృక్షంపై చేయూని

నిలచి ఆర్ద్రనయనాలతో ఉన్నది దేవయాని. చకితుడైనాడు కచుడు.

"సోదరీ! సెలవు."

అని వెనుదిరిగి చూడలేక బారసాచి అడుగులువేశాడు. దేవయాని అటే చూస్తున్నది.

విశ్వశాంతి

విహారం

ప్రజాపతి

ఈనాడు విరివిగా వెలువడుతూ, సామాన్యప్రజాహృదయాలను సైతం ఆకర్షించి, అలరించే కథలకు బీజాలు చల్లబడిన క్షేత్రం నైమిశారణ్యం. కథకులు కైమోడ్చి గౌరవించవలసిన మనీషి శ్రీసూతుడు. సూతుడు అద్భుత కథాకథన నిర్వహణ దక్షుడు. అతని నిలయం నైమిశం.

ఆ నైమిశారణ్యంలో ఒకనాడు కొన్ని శతాబ్దుల పూర్వం మహాజనతాపరిషత్తు సమావేశమయినది. జ్ఞానులు, విజ్ఞానులు, సామాన్యులు, సర్వశక్తి సంపన్నులు, మునులు, తపోధనులు సర్వులూ సదస్యులుగా వచ్చారు. మత, సంఘ, రాజ్యాంగాది విషయాలపై చర్చ జరుగుగున్నది. ఒకే అంశంమీద అనేకులు అనేకానేక విధాలుగా ప్రసంగిస్తున్నారు. భిన్నమనస్తత్వాలు, విభిన్నప్రకృతులు గల వక్తాధురంధరులు తమ తమ ప్రసంగాలను [illegible] ప్రచారం చేస్తున్నారు. విషయమీమాంసలో [illegible]

లాస్యవిన్యాసం చేస్తున్నది. సమాజాభ్యుదయ దృష్టితో ఎన్నో నూతన సూత్రాలు, మరెన్నో వినూతనవిధానాలు ప్రవేశపెట్ట బడినై. దర్శనంతరం సదస్యుల ఆమోదంతో అవి శాసనరూపం పొంది శాస్త్రగ్రంథాలలోనికి చేర్చబడినవి. కార్యక్రమం జయప్రదంగా ముగిసింది.

సదస్యులు యిష్టాగోష్ఠిలో వున్నారు. ఆ సమయానికి ప్రజాపతి దక్షులు అక్కడకు విచ్చేసారు. దక్షప్రజాపతి ఆగమనానికి స్వాగతం పలుకుతూ మహాజనతా పరిషత్తు ప్రాంజలిఘటించి, నతమస్తకయై నిలబడ్డది. ప్రజాపతి సగర్వంగా చిరునవ్వు లొలుకుస్తూ సింహావలోకన చేయసాగారు. ఆ ఆలోకనలో ప్రజాపతిదృష్టి, విశ్వంలంగా కూర్చుని వున్న పరమశివునిపై కేంద్రీకృతమయింది. పరమశివుడు కాలుకదుపలేదు, పెదవి మెదపలేదు. ముకుళిత ప్రాంజలి వారి హృదయాలలోని భక్తిని, నశేష ప్రశంసల పొగడ్తలు తోపించినై, శివుడికి. అందువల్లనే ఆయన అన్యులతో ఏకీభవించక అనన్యంగా వుండిపోయారు.

అహంకారం

ఒకక్షణం దక్షుని దృష్టి శివుని ఆపాదశిరః పర్యంతం పరిశీలించి ఎర్రజీరలతో మహాజనతా పరిషత్తువైపు మరలింది. ప్రజాపతి అల్లుడు పరమశివుడు. కనీసం ఆ గౌరవాన్నయినా ప్రదర్శించకపోవటం ఆయన ప్రకోపాగ్నిని ప్రజ్వలింప జేసింది. ఆత్మగౌరవాన్నే అవహేళన చేసినట్లు బాధపడిన ప్రజాపతి ఒకక్షణం ఆగారు. 'ప్రతీకారం అభిమాని లక్షణం' అని నిర్ణయించుకున్నారు. ప్రజాపతి ఆదేశాన్ననుసరించి మహాజనతా

పరిషత్తు మౌనముద్రలో కూర్చున్నది. సదస్యులలో ప్రతి ఒక్కరూ ఒకకంట ప్రజాపతినీ, మరొకకంట పరమశివునీ ప్రకంపిత హృదయాలతో చూస్తున్నారు. "నేటినుండి జరిగే యజ్ఞ యాగాదులకు శివుణ్ణి బహిష్కరించండి; ఇది ప్రజాపతి శాసనం."

ప్రతాప ప్రకంపితస్వరం ప్రస్ఫుటంగా పలికింది. శాసనం సదస్యులను చకితులను చేసి, కలవరపరచింది. మహాజనతా పరిషత్తు చర్చ జరుపకుండా శాసనం అమలుజరుపటం నియంతృత్వానికి ప్రథమసోపానం.

కాని —

ప్రజాపతి!

కాను.

ప్రజాపతిని కాదనగల ధీమా ఎవరికున్నది? సదస్యులు, పరమశివపారిషదులు వినా శిరస్సులు వాల్చారు. సాభిప్రాయంగా, సగర్వంగా శివుణ్ణి క్రీగంట చూస్తున్న ప్రజాపతిభుజాగ్రాలు పొంగినై; మీసం మెలిదిరిగింది. అతని గంభీరవదనంలో మరొక హాసం మసలింది.

రాజధానివైపు దారితీసాడు, విజయ ప్రజాపతి.

మహాసతి

కొండవాగులు జలజలధ్వనులతో పరవళ్ళుద్రొక్కుతూ ప్రవహిస్తున్నై. వాగులకిరువైపులా దృశ్యమనోహరంగా తాల, తమాల, సాల, రసాలవృక్షాలు పెరిగినై. ఆ తరుశాఖలమీద శుక, పిక సంతతులు కిలకిలారవాలు చేస్తున్నై. అల్లిబిల్లిగా

ఆలోచించకొమ్మ? అల్లకాదివిలోదాన అకాలం కుసుమాకరుడి వచ్చి సౌందర్యసుందర్యాలు శిరజాలు వెలయించి తరంగాలలో తెంది వెలుగులు, తేలిమి మెరుగులు ప్రసరిస్తున్నై. వృక్షాలపై ప్రాకిన లతికలు సుగంధ సౌరభాలు విరజిమ్ముతున్నై. అది గంధమాదనపర్వతం. ఆ గిరిశృంగాల మీద సఖిజనంతో విలాసాలాడుతూ సాయం వాహ్యాళి సాగిస్తున్నది సతీదేవి. సతీదేవి పరమశివుని అర్ధాంగి.

మకుటారం

ఆ విలాస విహారవేళ విహాయసవీధిలో వినవచ్చిన విమాన ధ్వనివిని వింతగా చూచింది, సతి. పరిశీలనగా పరికించింది. అది చంద్రుని వాయుయానం. కాదు! అదిగో, తారకారోచిర్నివహంతో విద్యుల్లేఖలా వున్న రోహిణి. ఆమె దక్షిణ పార్శ్వవ చంద్రుడు—

సతి చెలికత్తెవైపు తిరిగింది.

"సఖీ! రోహిణీసమేతుడై చంద్రుడు ఎక్కడికి వెడుతున్నాడో తెలిసికొనిరా"

అని పంపింది.

"ప్రియజనకులు దక్షప్రజాపతి చేయుచున్న యజ్ఞానికి ఆహూతులై వెడుతున్నారు."

అన్నది, తిరిగివచ్చిన చెలికత్తె.

సతీదేవి లోచనములు ఆలోచనాపూర్ణములై కించిదార్ద్రము లయినవి. కన్నతండ్రి పిలువకుండా, పరమశివుణ్ణి ఆహ్వానించకుండా తనతండ్రి యజ్ఞం చేస్తున్నాడా!

సమ్మోహితపోయింది. కాని, పరమశివుని సన్నిధిలో పరిహాసమాడే ప్రమత్తత చంద్రుడికెక్కడిది ? ఈ ప్రశ్న ఆమెను నమ్మించింది. అయినా పితృభక్తి కొంత ఉపశమనాన్ని కలిగించినది.

తనతండ్రి తనను పిలవటమేమిటి ?

తనే వెళ్ళాలి. అని నిర్ణయించుకొన్నది.

అయినా అల్లుణ్ణి ఆహ్వానించకుండా ఉంటాడా ?

ఆహ్వానించడు.

అందుకు కారణం ఉన్నది.

ఉండవచ్చు.

అది తనపట్ల వర్తిస్తుందా ? వర్తించదు' అని మమకారం ప్రబోధించింది.

వర్తిస్తుంది

అని అంతర్వాణి పలికింది.

కాని మమకారం విజయధ్వజ మెత్తింది.

విచారమగ్నమనస్కయైన సతి అభిమతాన్ని అవగాహన చేసికొన్న సఖీజనం విశ్వర్థాన్ని నిలబెట్టారు. మౌనంగా గృహోన్ముఖురాలయింది సతీదేవి.

సఖీజనం కన్నులతో మాట్లాడుకుంటూ ఆమెను అనుసరించారు. పరాకుగా ఉన్న పరమశివుడు సతీదేవి ఆగమనాన్ని గుర్తుపట్టలేదు. ఆమె విడచిన వేడినిట్టూర్పు ఆయనను ఆమెవైపు త్రిప్పినది. కొద్దిగా చలించాడు. దగ్గరకు తీసికొని ముంగురులు నిమిరాడు.

"మా నాన్నగారు చేసే యజ్ఞానికి వెళదాం." అన్నది సతీదేవి. క్రీగంటచూస్తూ.

పరమశివుని పాణితలం ఆమె నునుబుగ్గలను స్పృశించింది.

"ఆహ్వానంలేనిదే వెళ్ళటం అవమానాన్ని ఆహ్వానించు కోవటం. అది ఆత్మహత్యాసదృశం. అయినా నీకు వెళ్లాలని ఉంటే నా అభ్యంతరంలేదు. నంది సాహాయ్యంగా వస్తాడు. వెళ్ళు."

అన్నాడు ఆకాశంలోకి చూస్తూ.

పుట్టింటిమీద ఉండే సహజమయిన అభిమానం సతీదేవిని ప్రయాణోన్ముఖురాలిని చేసింది. మహానంది సముచిత పరివారంతో ఆమెను అనుసరించాడు.

యజ్ఞవాటి

అహో ! శ్రవణ సుభగమయిన ఆ స్వరం భృగు మహర్షులదే ! ఆయనే అధ్వర్యం వహించారు కాబోలు. హృదయాలలో ఏవేవో నూతనానుభూతులను రేకెత్తించే ఆ కంఠధ్వనులు !

ఏమి ఆ వేదగానం !

ఆ ఉచ్చారణ దక్షత !

శబ్దార్థ పరిజ్ఞానం !

ఆ ఉదాత్తానుదాత్తస్వరసమ్మేళనం. ఆ జనసందోహం ! ఆ ఉత్సాహం ! ఆ కలరవం ! ఆ కలకంఠాలు ! ప్రతిఒక్కరిలోనూ ఏదో నూతన చైతన్యం వెల్లివిరుస్తున్నది. ప్రతి మనిషిలోనూ

ఏదో ఆనందం అంకురిస్తున్నది. నిర్విరామంగా పనిచేసే బ్రహ్మాదుల ఓరిమికి ధన్యవాదాలు. ఆ ముత్తైదువల సహన శీలతకు నమోవాకాలు. వారి మాతృహృదయానికి అంజలులు। అదే యజ్ఞవాటి.

అనాహూతంగా ఆగమించిన సతీదేవిని అక్కచెల్లెండ్రు ఆదరించలేదు. అమ్మ అభిమానదృక్కులు ప్రసరించలేదు. జనకుడు చిరునవ్వు నవ్వలేదు.

అయినా రక్తస్పర్శ అనునయించింది.

అంతలో దక్షప్రజాపతి :

"భూత, ప్రేత, పిశాచగణాలకు నాయకుడు, వల్లకాటికి వల్లభుడు అయిన దరిద్రుడి భార్యవుగా నీకిక్కడ ప్రవేశార్హత లేదు. కనుకనే ఆహ్వానించలేదు" అన్నాడు.

ఆవేశం అంతటితో ఆగలేదు. ప్రతీకార వాంఛతో ప్రారంభించిన మహాధ్వరం ఫలప్రదం కావటానికి అనుకూలమయిన దూషణలన్నీ చేశాడు.

సతీదేవి మహాప్రళయ ప్రభంజనంలో గులాబీరేకులా చలించి పోయింది. ఆమె నిలబడ్డ భూమి నిలువునా దిగబడి పోయినట్లయింది. కన్నతండ్రి నోటినుండి వెలువడే ప్రతిఅక్షరం ఆమె మృదుల హృదయంలో మొగలిముల్లులా గ్రుచ్చుకొని కెలకసాగింది. అవమానం ఆపాదశిరఃపర్యంతం అలముకొని పోయింది. ఆవేదన అధికమయింది.

ఆ సమయంలో కైలాసంలోని జగత్పిత వామభాగం అదరింది.

ఆయన హృదయం చెదరింది.

పేనావళి

ప్రపంచవార్తా సంస్థాధిపతి, ప్రజ్ఞానిధి, జ్ఞానసంపన్నుడు అయిన దేవర్షి నారదుడు యజ్ఞశాలలోని తాజావార్తలను నివేదించటానికి కైలాసం చేరుకొన్నారు. పరమశివుడు అవ్యక్తవేదనతో నారదుణ్ణి ఆహ్వానించాడు. మహతీస్పందనశ్రుతితో గొంతు విప్పాడు నారదుడు. జరిగిన విషయాలన్నీ విపులంగా విశదీకరించి సతీదేవి ప్రాణత్యాగాన్ని సంక్షిప్తంగా నివేదించాడు. పరమశివుని శిరస్సు ప్రకంపించింది. భావిపరిణామాన్ని ఊహతో గానం చేసికొంటూ హిమాలయంపైపు పయనం సాగించాడు నారదుడు.

పరమశివుని అహంకృతి ఆకృతి దాల్చినది. ఆత్మశక్తి సాక్షాత్కరించినది. సర్వశక్తి సంపన్నుడయిన వీరభద్రుని ఆహ్వానించారు. ఛండతీక్ష్ణ నయనస్ఫూర్తితో వీరభద్రుడు శివునివైపు ఆజ్ఞకోసం వేచిఉన్నాడు.

ప్రతీకారము

"దక్షాధ్వరధ్వంసివి కమ్ము"

ఆదేశాన్ని ఆశీఃపూర్వకంగా అందించాడు. శివుడు. వీరభద్రుడు మహావీరరుద్రుడైనాడు. ఏదో మహాశక్తి అతనిని ఆవేశించి అడుగులు వేయించినది.

భూత, ప్రేత, పిశాచ సేనాసమూహంతో యజ్ఞశాలంపైపు నడిచాడు. వీరభద్రుడు. అంతవరకూ పిశాచభావిలో అణగి, మణగిఉన్న ప్రబల శక్తి ప్రకోపించి, ప్రతాపప్రభలతో పురోగమించినది. జరిగిన అవహేళనలూ, జరుగుతూఉన్న అవమానాలూ

భరించలేని పిశాచజాతి జరుగవలసిన కార్యక్రమాన్ని మార్గ మధ్యంలోనే నిర్ణయించుకొన్నది.

కదలిలా ముంచెత్తికొనివచ్చే పిశాచగణాన్ని కనుచూపు మేరలో చూసిన యజ్ఞశాలలోని సదస్యులు అదరిపోయారు.

"ప్రజాపతీ! అద్యతన భావిలో సంభవించే అనర్థానికి నీ అహంభావం కారణం. పరమశివుని మహాసేనాని వీరభద్రుడు భూర్వసైన్య సమూహంతో వస్తున్నాడు. ఇది నీ నైతిక పతనఫలం" అన్నాడు. పద్మాసనాసీనుడై ఉన్న మహావిష్ణువు.

సభాసదులు గజగజలాడారు. ప్రజాపతి ప్రతీకారవాంఛ. అహంభావం అంగారకపోగా అణిగం-కాసాగినై.

అంతలోనే వీరభద్రుని ప్రళయ శంఖధ్వానం యజ్ఞశాలలో ధ్వనించినది. అక్కడే సైనికశాసనం సేనాపతులకు జారీచేసాడు. వీరభద్రుడు. పిశాచగణం వికటాట్టహాసంతో విశృంఖల వీర విహారం చేయసాగినది. యజ్ఞశాలలో బీభత్సం మహాప్రవాహంగా సాగుతున్నది. హేమా హేమీలు, జగాజెట్టిలు పిక్కబలం చూపసాగారు. మహామహులు, అహంభావులు, ఆత్మగౌరవ శ్రీయుతులు, నిశాంపతులు, దిశానాధులు వణకిపోతూ, చేతులు జోడించి,

"పాహి పాహి ప్రభో
వీరభద్ర ప్రభో"
అని స్తుతించారు, నుతించారు, నతులొనర్చారు.

ఆ దీనవేదనా రవాలు పిశాచజాతి ప్రజాపశక్తిని చల్లార్చలేక పోయాయి. ప్రచారణ జ్వాలలు ప్రజ్వలించినై. తారతమ్యర

లేకుండా ఘోరహింసాకాండ జరిగిపోతున్నది. ఆక్రందనరవాలు వినా ప్రతిపక్షాలనుండి మరే ప్రతిఘటనా లేదు.

అంతలోనే దక్షప్రజాపతి శీర్షం పృథ్వీపతనం చెందినది. అహంభావాన్ని హతమార్చి, అపురు సవురు లేపి, ఆనంద విజయోత్సాహంతో పిశాచజాతి జై! జై! ధ్వానాలతో మహోత్సవం చేసికొంటూ తరలినది.

★

తుషారం

తమస్సు

జనతకు శాంతి లేదు.

ప్రజాజీవితంలో ప్రశాంతి లేదు.

ఏ క్షణానికి ఏ ఉపద్రవం ఉరుకులు వేసికొని వస్తుందో అది ఏ దిక్కునుండి ఏ దిశవైపు సాగుతుందో ఏ ఒక్కరికీ తెలీదు. మరుక్షణం మీద ఆశలేదు. భవిష్యత్తు అంధకారబంధురం. ప్రాణాలు పిడికిట బట్టుకొని ప్రమాదానికి ప్రాణహవిస్సులు అర్పిస్తూ బ్రతుకుతున్నట్టు బ్రతుకుతున్నారు.

ఏ పల్లె నల్లిలా నలిపివేయబడిందో, ఏ అగ్రహారం అగ్నిహోత్రుడికి ఆహుతి చేయబడ్డదో, ఏ గ్రామం మీద మహాగ్రహాలు విరుచుకు పడినవో, మరే నగరం మృత్యుదేవి అంతఃపురం అయిందో, ఇంకే పట్టణం నేలమట్టం అయినదో, ఏ ఉన్నత సౌధాలు శ్మశాన స్థలాలుగా మారినవో! అంతేనా! పవిత్ర బయళ్ళు వెచ్చని గాడ్పులను వీచుతూ బీటలు వారినవో: పంట

చేలు మంటలనే పండిస్తున్నవి! రాను రాను వార్తలు మరీ భయానకాలవుతున్నవి. ఆరోజు కారోజు గజ గజ లాడిపో తున్నది ప్రజ.

అనుక్షణం అపాయభీతి. చిత్రవధలు. లేదు, శాంతిలేదు ప్రజకు.

ప్రశాంతిలేదు జీవితానికి.

"యజ్ఞశాలలు వధ్యశిలలుగా మారినై"
"హోమగుండాలు రక్తగుండాలవుతున్నై"
"అధ్వర్యులే యజ్ఞపశువు లౌతున్నారు"
"ఋత్విజులు రూపులేకుండా పోతున్నారు"
"బాలురు పాయసాన్నంగా మారుతున్నారు"
"వృద్ధులు యోద్ధలమధ్య నలిగిపోతున్నారు"

భయానక బీభత్సం ప్రవహిస్తున్నది. మృత్యువు వికటాట్టహాసంతో విజృంభించి విశృంఖల విలయతాండవంతో విహరిస్తున్నది. తారకాసురుని శాసనం నారీజనంపైకూడా ప్రయోగింపబడుతున్నది.

హరిహరా! పతివ్రతలు పవిత్ర ప్రదేశాల్లో పరాభూతులు కాలేక ప్రాణత్యాగం చేసికొంటున్నారు. మాతృమూర్తుల ఆత్మహత్య! హా! పైశాచికశక్తి!

ఈదృశంగా తారకాసురుని ప్రభుత్వాన్ని గూర్చిన వార్తలు అనోటా ఈనోటా ప్రాకినై.

దేవజాతిమీద రాక్షసజాతి దాడిజరిపి అమరావతినే హస్తగతం చేసికొన్నది. రాక్షసవరం కదం త్రొక్కి కత్తులకు నెత్తుర

నైవేద్యం చేసింది. మహోత్సాహంతో రాక్షసజాతి విజయోత్సవం చేసుకొన్నది. అమరావతిమీద, రాక్షస పతాకం విహరించసాగింది. అలకాపురిలోని టంకశాలలో నూతన ముద్రలు ముద్రింపబడుతున్నై. దేవజాతి తలవంచింది.

రాక్షసశక్తికి దేవజాతి అంజలించక తప్పలేదు. అమరావతిలోని మహేంద్రాసనాన్ని తారకాసురుడు అధిష్ఠించాడు.

పశుశక్తి విజయధ్వజం అమరావతిమీద ఎగురవలసిందేనా? అలకాపురి తారకాసురుని ఏలుబడిలో ధ్వంసం కావలసిందేనా? ఇంద్రధ్వజం వెలవెల బోవలసినదేనా? అసురనేత సురాసుర మహానేత కావలసినదేనా?

బృహస్పతి

కావలసినదే కాబోలు!

అదిగో! వాల్చిన తలలతో జోడించిన చేతులతో, నిలబడ్డది దేవజాతి పద్మాసనంమీద పరిహాసాలాడుకొంటూన్న బ్రహ్మఎదుట. అబాలగోపాలం దీనవదనాలతో రావడంచూచి చకితుడైనాడు, బ్రహ్మంతవాడు. జరిగిన పరాభవాన్ని నివేదించటానికి ఆచార్య బృహస్పతికి అధికారం యిచ్చాడు ఇంద్రుడు. బ్రహ్మపీఠం కరిగించేటట్లు విన్నవించాడు ఆచార్య బృహస్పతి. జరిగిన చరిత్రను జరుగుతూ ఉన్నట్లు పలికిన ఆచార్య బృహస్పతి కంఠం బ్రహ్మను ఉలిక్కి పడజేసింది. బ్రహ్మముఖంలో ఒకచింతా రేఖ అలముకొన్నది.

"పరమశివుడు పార్వతి పాణిగ్రహణంచేయాలి. ఆ ఉమామహేశులకు ఉదయించిన సూనుడు, తారకాసురుని సంహ

రించగలరు. భయపడకండి. కాలంమారుతూ ఉంటుంది. కాను ! దేవతాభిమీద అసురశక్తి విజయం. అది మీకు ఆశ్చర్యం. కాని, ఇదే కాలం చేసే యింద్రజాలం. అయినా భవిష్యత్తు మీదే। "

అని చిరునవ్వు నవ్వాడు పితామహుడు.

తపస్సు

చిత్రాతిచిత్ర పరిణామాలను సంఘటింప జేస్తూ కాల మహాస్రవంతి పురోగమిస్తున్నది. అనేకానేక పరిణామాలలో పరమశివుడు విరాగియై హిమాలయమహామునికావటం విచిత్ర పరిణామం.

నందీశ్వర, భృంగీశ్వర, చండీశ్వరాది సేనాపతులు తపోవనంలో నిశ్శబ్దానికి పట్టంగట్టి ధ్వనిప్రపంచాన్ని ధ్వంసం చేస్తున్నారు. ప్రమథగణాలు పరమశివుని కనుసన్నలలో కార్య నిర్వహణ సాగిస్తున్నారు.

తపోభూమిలో పరమశివుని ఉపాసనాధ్వని, ప్రమథగణం ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినా మరే నిస్వనం వినపడటం లేదు. ప్రకృతి ప్రశాంత ముద్రాముద్రిత అయినది. పరమశివుని ఈచిరదీక్షకు హేతువు ఎవరికీ తెలియడంలేదు. ఏదో ఒక హృదయ విదారక సంఘటన సంభవించినప్పుడు పరిణమించే పరివర్తనగానే పరమ శివుని తపస్సునుకూడా పరిగ్రహించారు.

సౌందర్యశోభ

పరమశివుని తపోనిష్ఠను కర్ణాకర్ణిగ ఆకర్ణించిన ఆర్యహిమ వంతుడు పత్ని మేనను, పుత్రి పార్వతిని వెంటబెట్టుకొని పరమ శివపదసందర్శనా కుతూహలుడై వచ్చాడు.

పార్శ్వభాగాన ఉన్న నందీశ్వరుడు అతిథులను మహామునికి పరిచయం చేశాడు. అత్యహిమవంతుడు సాష్టాంగ వందనం చేసాడు. పరమశివుని గంభీరవదనంలో ఉదయించిన మందహాసోజ్జ్వలం హిమవంతుని వందనాన్ని అందికొన్నది.

మేన, పార్వతి ప్రాంజలి ఘటించారు. పరమశివుడు కన్నులు మోడ్చాడు.

'మహామునీ! మీవద్ద పరిచర్యకు మా పార్వతిని పరిగ్రహించ ప్రార్థన, హిమాన్యుని అభిలాష'

అంతే!

హిమవంతుని కోరికను కనుబొమల కదలికతో అంగీకరించాడు పరమశివుడు.

హిమవంతుడు ఆకాశమంత ఎత్తు పెరిగాడు, ఉత్సాహంతో.

ఆ నవ్య లావణ్యలహరిని చూచి ఆదిలో పరమశివుడు అభ్యంతరం చెబుదామనుకొన్నారు.

కాని, ఏదో అనిర్వచనీయశక్తి ప్రేరేపించి ఆమోదాన్ని ప్రసరింపజేసింది.

ఉదయ, సాయం సాంధ్యవేళలలో పార్వతి పరమశివునికి తపోపరికరాలు సమకూరుస్తూ, ఫల, పుష్పాదులు తీసికొనివచ్చి ఇస్తున్నది. ఆమె ఆగమనసమయంలో పరమశివుని అనిమేష లోచనయుగాలు అర్ధనిమీలితములయేవి. రాను రాను పార్వతిపై పరమేశ్వరుడు అవ్యాజాదరాభిమానాలు ప్రసరించసాగారు. అమృత మధురకంఠంతో :

'స్వామీ!'

అని సంబోధిస్తుంటే మహాముని హృదయం మీటుపడ మరిచేది. ఐనా తపోదీక్ష, వైరాగ్యం, నిష్కామదృష్టి!!

సుమకోమల సుందరసుషమా రాగిణి పార్వతి!

శరత్పూర్ణిమారజనీ వికసిత నీలోత్పలం పార్వతి!

నిత్య నవోదయ మహోజ్వల వదనశ్రీతో పరిచర్యకు వచ్చే పార్వతిలో మాతృదేవిని చిత్రించుకొన్నాడు, నంది.

ఆమెలో ఒక దివ్యమూర్తిని దర్శించాడు భృంగి.

తల్లీ! అని సంబోధించటానికి కుతూహలం చూపేవాడు చండీశ్వరుడు.

ఆమె అందరినీ అనురాగంతో చూచేది. పరమశివుని మహాదీక్షలో అక్షరమై నిలిచింది పార్వతి. ఆమె మనసులో నిర్మల ప్రేమ అంకురించసాగినది. పరమశివుని సన్నిధానంలో ఏదో అనిర్వచనీయానందం ఆమెకు లభించేది.

సదస్సు

అష్టకష్టాలుపడుతూ, అజ్ఞాతవాసంలో దేవజాతి జీవయాత్ర సాగిస్తున్నది. తపోదీక్షలో ఉన్న పరమశివుడు పార్వతి పాణిగ్రహణంచేసే విధానం ఎవరికీ తోచలేదు. నిష్కామయోగంలో, నిశ్చలధ్యానసమాధిలో ఉన్న పరమశివుని కేంద్రీకృత దృష్టిని పార్వతిపైపు మరల్చాలి. సాంసారిక బంధాలపైపు ఆయన జీవితాన్ని ఆకర్షించటంగూర్చి దేవజాతి జనతాపరిషత్తు జరిపినది. అందరూ అనేక విధాల ప్రతిపాదనలు చేసారు. చర్చలో అన్నీ వీగిపోయాయి.

పరిషదధ్యక్షుడు. దేవజాతి నేత అయిన మహేంద్రునిదృష్టి అద్యతనంలో ఆగమించి, ఆసీనుడైన మన్మథునిపై పడినది. మహేంద్రునికి వాటిల్లిన ఘోరవిపత్తుల నెన్నిటినో నివారించినవాడు మదనుడు. మహేంద్రపదవిని ఆక్రమించటానికి ప్రయత్నించే ప్రతివ్యక్తినీ పతనమొందించిన బుద్ధిమంతుడు, మదనుడు. ఆనాడు కూడా మదనుని మీదనే మహేంద్రుని ఆశలు ఆధారపడి ఉన్నవి.

మహేంద్రుని దృష్టి తనమీద పడేసరికి మదనుడు మహోత్సాహంతో పొంగిపోయి సదస్సంతా కలయజూచి, సుమబాణం ధరిస్తూ మహేంద్రుని కెదురుగా వినమ్రుడై నిలబడి:

"అభివాదాలు, మహానేతా! ఈ మదనుడు కర్తవ్య నిర్వహణలో ఎవ్వరికీ తీసిపోడు. ఈ సుమబాణుడు సాధించిన విజయాలు సదస్యులందరూ ఎరుగుదురు. నామీద ఉంచిన గురుతర భారాన్ని క్షణాల్లో పూర్తిచేసికొని వస్తాను. పరమశివుని మనసు మరల్చడానికి కూడా మదనుడు బెదరడు." అన్నాడు.

ఆఖరు అక్షరాలు ఉచ్చరిస్తూ ఉండగానే మహేంద్రుడు అధ్యక్షపీఠం నుండి ఒక్క అంగలో మదనుని చేరి, వీపుతట్టుతూ:

"మదనా! మహాసేనానీ, దేవజాతి నీసేవకు సదా కృతజ్ఞత చూపుతుంది. ఈ జాతికి సంఘటిల్లిన అద్యతన విషమ విషాద స్థితిగతులు నీవూ అనుభవిస్తున్నావు. అమరావతి అమరజాతికి ఆనందనందనం అయే అదృష్టరేఖ నీహస్తాలలో ఉన్నది. అందుకు హిమాలయ మహాముని పరమశివుని మనస్సు పార్వతి హృదయంతో సమ్మేళనం చెందాలి. నీరాకకు ఎదురుతెన్నులు చూస్తూ దేవజాతి యిక్కడే ఉంటుంది. దేవజాతికి మహ

దత్యోదయం పొందింది. అదిగో! ఏ నెచ్చెలి వసంతుడు కూడా నిన్ను అనుసరిస్తాడు.'

దేవజాతి ప్రముఖులతో మదన, వసంతులకు మహేంద్రుడు వీడ్కోలిచ్చి, హిమాలయంవైపు దారిచూపాడు. ఆ సమయంలో ఆచార్య బృహస్పతి ఆననసీమలో అవతరించిన అపూర్వ భావరేఖాపూర్వరంగంలో అంకురించిన ఆవేదనచ్ఛాయను అమరులెవరూ గుర్తించలేక పోయారు. అదృశ్యనధావి పరిణామం. ఆచార్యబృహస్పతి అజ్ఞాతవేదన.

జనతాపరిషత్తు పేశ్వర్ధంగా ముగిసింది. వసంత, రతీసహితుడై మదనుడు పూర్వ విజయగాథలను స్మృతికి తెచ్చుకొంటూ నడువసాగాడు. ఆ సమయంలో రతీదేవి హృదయంలో ఏదో అపశ్రుతి ధ్వనించినది. అయినా ఆమె సంబాళించుకొని పతిని అనుసరించినది.

ఉషస్సు

మామిడి పూసింది.
మాలతి మొగ్గ తొడిగింది.
మల్లె వికసించింది.
అరవిందం నెరవిచ్చింది.
మొగలి రేకులు పరచింది.
అశోకం హసించింది.
నల్లగలువలు ఫక్కున నవ్వినై .
జాజి సౌరభం వెదజల్లింది,
విరజాజి సుగంధం విరజిమ్మింది.

కోకిల గళతంత్రులు సంధమస్వరాలకి శ్రుతి సరిచేసి కొంటున్నై. పచ్చికబీళ్లలో స్వేచ్ఛగా విహరించే హరిణపు మగలేడి వరాళువ కావ్యాలంకారంతో గెంతింది. తామర పూదొన్నెలలో తుమ్మెదలు జంటలుగా మకరందాస్వాదం చేస్తున్నై. కరిణికి కరీంద్రుడు తొండంతో జలం అందిస్తున్నారు. ఆడుపిచ్చుకలు ఆడుతూ, నేలపై రెక్కలు టపటపలాడిస్తూ మగపిచ్చుకలవైపు చూస్తున్నై. గున్నమామి గుబురుల్లో గువ్వల జంటలు కువ-కువ లాడుతున్నై. ఇదంతా ఒక్క క్షణంలో జరిగిన పరిణామం.

సినీవాలి

తపోదీక్షలో ఉన్న పరమశివుని పదసన్నిధానంలో ఉన్న నందీశ్వరుడు పరవంశలా కలయజూడాడు. ప్రకృతి ప్రమోద భరితంగా ఉన్నది.

ఆశ్చర్య చకితుడయాడు.

దోహద ప్రక్రియలు లేకుండానే అశోకం అకాలంలో పూలుపూయటం మరీ విచిత్రంగా తోచింది. మరొక్కక్షణం అలానే చూదాడు. అంతలో విధి నందీశ్వరుణ్ణి విభ్రముణ్ణి చేసికొన్నది. తపోవనం వసంతశ్రీ సముపేతం కావటమే కాకుండా ప్రేమకలాపాలు కూడా సాగుతూండటం నందికి నచ్చలేదు. ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. నంది నేత్రాలు రక్తారుణములైనై.

శుకపిక సంతతుల కిలకిలారవాలతో కలకలలాడే తపోవనం నంది దృష్టిప్రసారంతో గజగజలాడి చిత్రపటంలా నిశ్చలంప, నిశ్చలస్థితిలో ఉండిపోయింది. హుంహుంకారావం చేస్తూ ఉన్న

పుంస్కోకిల కంఠంలోని తంత్రీస్పందనం ఆగిపోయింది. తుమ్మెదలు మెదలలేదు. ఆడులేడిని రాసికొనిఉన్న మగలేడి కొమ్ముటంచును కదల్పలేదు. ఎత్తిన తొండాన్ని దించలేదు కరిణీనాథుడు.

ఆ సమయానికి పార్వతి అడుగులలో అడుగులు వేసికొంటూ, మనోజ్ఞమైన కాంతులు వెదజల్లుతూ పరమశివుని సమీపించినది. పరమశివుడు కన్నులు అరమోడ్చాడు. పార్వతి అభివాదంచేసి పూలమాల అందిస్తున్నది. మాలను అందుకొనేందుకు చాచిన పరమశివునిహస్తం అలానే ఉండిపోయింది. పార్వతి క్రీగంట సిగ్గుతెరలు వ్రాలినై; పరమశివుని హృదయంలో పురాతనోస్మృతులు కదలినై, ఏవేవో అనిర్వచనీయానుభూతులు ప్రస్ఫుటంగా కదలాడినై; పార్వతి పాణితలంలో పరమశివుని హస్తం సంధింపబడింది.

పాణిగ్రహణానికి రహస్య పౌరోహిత్యం వహించి, మల్లెపొదమాటున ఉన్న మదనుడు సంతోష తరంగితస్వాంతుడై కన్నులు మిలమిల లాడించాడు. పరమశివుని హృదయం చెదరింది. ఆర్ద్రహృదయం ఘనీభవించి పార్వతి హస్తాన్ని పరిత్యజించింది.

అంతలో ఫాలనేత్రంలోని విస్ఫులింగాలు మదనుని మృదుగాత్రాన్ని భస్మీభూతంచేసినై.

తపోనిష్ఠకు భంగం వాటిల్లినస్థలం మరి యోగ్యం కాదనుకొని పరమశివుడు కదలిపోయాడు.

సౌందర్యం పార్వతిగా రూపుదాల్చిందని ప్రశంసించిన స్తుతిపాఠాలన్నీ ఆమెను ఆ సమయంలో ఆశ్వాసించలేకపోయినై.

తన సౌందర్య మహిమను వ్యర్థంగా తలపోసి. దుఃఖిస్తూ కొంటూ అవమానంతో అడుగు కదిల్చింది, పార్వతి.

సంతోషరేఖ

హిమవంతుడు బ్రతిమాలినాడు.

మేన మందలించినది.

చెలికత్తెలు అభ్యంతరం చెప్పారు.

అయినా పార్వతి మనోనిశ్చయం నిశ్చలంగానే ఉండిపోయింది. ఆశా సౌధాలు ఆదర్శహర్మ్యాలుగా నిర్మించుకోవటానికి దృఢసంకల్పం అవసరం అన్నది. పరమశివుని హృదయం తన హృదయంలో ఏవో కమ్మని బాధలు రేపుతున్నది. అవి కమ్మని గాథలుగా రచించుకోటానికి తాను దీక్ష తీసికొంటున్నానన్నది. హిమవంతుడు ఆమోదాన్ని వ్యక్తంచేసాడు. మేన కన్నీరు కనుపల నిల్పుకుండా అంగీకరించినది. చెలికత్తెలు అనుసరించారు.

పరమేశ్వరుని భర్తగా బడయుగోరి తపోదీక్ష వహించినది పార్వతి. నాన్యతోసాధ్య నియమాలతో అహోరాత్రాలు మహా తపస్సు చేయసాగింది.

మండుటెండలలో, మంచుజడులలో శరీరాన్ని శుష్కింపజేస్తున్నది. క్రమక్రమంగా ఆకు అలం ఆహారం చేసికొన్నది. తరువాయి చంద్రికలే ప్రాణదానం చేసినవి. వాయువే ఆహారమైనది.

అనాటికానాడు నియమాలు నియంతృత్వం సాగించినై, పార్వతిమీద. అయినా పార్వతి చలించలేదు. ఆమెలో ఆశారేఖ అభ్యుదయపథాన్వేషణం చేస్తున్నదేకాని అంతరించటం లేదు.

శిశిరఋతువునద్యశ్శాంత దంతాగ్నిమధ్యంలో పరమశివుని పత్ని గావటానికి సిద్ధంగా ఉన్నవార్త ఆనేతు, శీతాచలం వ్యాపించినది.

మహర్షులు సత్యపరిశీలనార్థులై వచ్చి తలలు వాల్చి తరలి పోతున్నారు. పార్వతి పరమవిష్ణలో ఉన్న ప్రాంతంలో హరిణ శాబకాలు పులిపిల్లలతో సరసాలాడుతున్నై.

బాలభానుడు ఉదయాచలంమీద ఉషఃశ్రీ రోచులను వ్యాపిస్తూ, ఉదయిస్తూన్న మహోదయంలో తపోవనానికి ఒక బ్రహ్మచారి వచ్చినవార్త చెలికత్తెలవలన విన్నది పార్వతి.

అతిథికి ఎదురేగి అర్ఘ్యపాద్యాలర్పించి. కుశలప్రశ్నలువేసి, మౌనంగా నిలబడ్డది.

ఆగంతుక బ్రహ్మచారి పార్వతీ మనోరథాన్ని చెలికత్తెలు చెప్పగా ఆకర్ణించి ఫక్కున నవ్వాడు. పార్వతి దరహసితవదన కమలం వెలవెల బారింది. బ్రహ్మచారి క్రీగంట పార్వతినిచూస్తూ:

"హరహర ! తల్లిదండ్రులు కారు, పరివారం పిశాచగణం, ఐశ్వర్యం బూడిద. వాహనం ముసలియెద్దు. ఆకారంలో మూడో కన్ను వికారం. సర్పాలు అలంకారాలు. ఒకటేమిటి, అన్ని విషయాల్లోనూ అనర్హుడే! అటువంటి అగర్భదరిద్రుని పాణిగ్రహ ణంచేసి ఏం సుఖపడగలవని యింత శ్రమపడుతున్నావ్. నీవంటి లావణ్యలహరిని ఏ యువరాజు తనకు రాణై వరించడు?" అన్నాడు.

పార్వతి పీలికసులలో అరుణరేఖలు అంకురించి. అంత రించినై. అంతలో ఆర్ద్రములయినై.

ఆమె తల ప్రక్కకు త్రిప్పి:

వటు బ్రహ్మచారి అతిప్రసంగం చేస్తున్నారు. అనవసర విషయాల్లో జోక్యం కలిగించుకోవటం మర్యాదకాదని చెప్పు. మీవ మర్యాదలు వారికి తెలీకపోతే దయచేసి కదలమను' అన్నది. మందగంభీరంగా.

అంతలోనే బ్రహ్మచారి పార్వతి హస్తంలో తన అరచేతిని ఉంచాడు.

పార్వతి హృదయంలో తొలకరించి ఆమెగాత్రం పులకరించింది. ఏదో పురానుభూతి మొలకలెత్తింది. మరేదో లజ్జ అలముకొన్నది.

'ఉమా!...'

పరమశివుడు మరి మాటాడలేదు. పార్వతి లజ్జావినమ్రమై 'స్వామీ...' అని కన్నులలోకి చూచినది.

ఆ సమయంలో ఆమె హృదయంలో లేతజాజులు కితకితలు పెట్టెనై. అవాఙ్మానస గోచరానుభూతి పరంపరలు స్రవించెనై.

'ఉమా!...'

పరమశివుడు ఆనందంగా పలికాడు.

పార్వతిని సిగ్గుతెరలు నేపథ్యంలోకిపంపినై.

పరమశివుడు మహానందంతో కదలిపోయాడు.

పార్వతి పాణిగ్రహణం అవశ్య కర్తవ్యంగా నిర్ణయించుకొన్నాడు.

సమర్థులను హిమవంతుని వద్దకు రాయబారం పంపాలనుకొంటూ విభు, నూతన తపోవనం చేరుకొన్నాడు.

సందేశలేఖ

పరమశివుడు నిష్క్రమించినవార్త పార్వతీదేవి హృదయంలో కొద్దిగా బాధను కలిగించినది. అయినా తన అభిమతం అక్షరరూపంనుండి ఆచరణకు అంకురార్పణ చేసికొన్న ఆనందం ఆమెను అనునయించినది.

అంతలో ఆమె మనస్సు ఆలోచనలో పడింది. తన సిగ్గును పరమశివుడు ఏ భావంగా స్వీకరించాడో అనే అనుమానం కలవర పరచినది.

అయినా ఆయనకు పరేంగితావగాహనశక్తి ఉండదా! అని సందేహ నివృత్తి చేసికొంది. ఏమైనా తన మనోగతాభిప్రాయాన్ని అభివ్యక్తీకరించే ఉద్దేశంతో చెలికత్తెను పిలిచి :

సఖీ! మహాకోశీప్రపాత సమీపంలో పరమశివులు ఉంటారు. ఆయనతో ఈ విధంగా చెప్పు :

నేను బాలికను. తల్లిదండ్రుల ఆజ్ఞ నాకు శిరోధార్యం. అందుచేత మీరు మానాన్నగారిని అడిగి నన్ను పరిణయమాడ గోరెదను' అన్నది. చెలికత్తె చిరునగవుతో బుగ్గమీద వేలువిడిచి కదలినది.

★

వివాహం

అభ్యర్థనం

దేవజాతిపై రాక్షసవర్గం జరిపే దౌర్జన్య చర్యలనుండి, అది కల్పించే దుర్భర, దుస్సహ, దురంతస్థితిగతుల నుండి రక్షించటానికి పార్వతి పాణిగ్రహణం అవశ్య మనేభావం పరమ

శివుని మనసులో మెదలుతూ ఉన్నది. అందుకు అనుకూలంగా పార్వతి హృదయం తనపై లగ్నంకావటం మరొక అడుగు ముందుకు వేయించినది.

పార్వతి మనోరథాన్ని ఈడేర్చటానికి, రాక్షసజాతి కర్కశక్రౌర్యాన్ని రూపుమాపటానికి కళ్యాణం అవసరం అనే నిర్ణయానికి వచ్చారు.

సంప్రదాయానుసారం ఎవరిని పంపాలా, అని ఆలోచిందుకొంటూ ఉన్న పరమశివుని దృష్టిలో సప్తర్షులు గోచరించారు. అరుంధతీ సమేతంగా మహర్షులను ఆహ్వానించారు. మహాతపస్వి అయిన పరమశివుని ఆహ్వానాన్ని అందుకొంటూనే వచ్చారు. ఋషులు. ఆర్య మునులకు అభివాదంచేసి. సముచితాసనాలపై ఉపవిష్టింపజేసి పరమశివుడు:

"ప్రజాహితాభిలాషులార ! మహర్షులార ! దేవతాతిపై మీకు గల అభిమానం అనన్యం. పార్వతి మనోభిప్రాయం మీకు విదితపూర్వం. దూరదృష్టికల మీకు అనంతర కర్తవ్యం నివేదించటం పునరుక్తి కాగలదు" అని ఆగాడు.

అరుంధతి మోములో అస్పష్టంగా అవతరించిన మందహాసాన్ని వశిష్ఠుడు క్రీగంటచూచి మౌనం వహించాడు.

సప్తఋషులు సంతోషస్వాంతంతో అధిగతార్థులై హిమాచల ప్రాంతానికి రాజధాని అయిన ఓషధిప్రస్థంపై పునడిచారు.

ప్రాంజలి బద్ధుడై పలికిన అతని కంఠం సమీపగిరి గుహలలో ప్రతిధ్వనించి, మహర్షులను ఆనందపరవశులను చేసింది.

. వివాహ వ్యవహార నిర్వహణదక్షతయున్న అంగిరసునికి అధికారం యిచ్చారు ప్రతినిధులు.

అంగిరసుడు :

"ఆయుష్మాన్! పరిణతవయస్క అయిన పార్వతిని పరమశివుని కిచ్చి పరిణయంచేయటం మా అభిమతం. ఈ కళ్యాణం ప్రపంచశాంతికి అవసరం" అని పలికాడు.

అరుంధతి మేన అదృష్టాన్ని కొనియాడి, పార్వతిని ముద్దాడింది. ఆ సమయంలో పార్వతి పరువంపుమోముపై దరహాసం లజ్జాపాణిగ్రహణం చేసినది. హిమవంతుడు మేనను సాభిప్రాయంగా చూసాడు.

మేన ఆనందాశ్రునేత్రాలు హిమవంతునికి సమాధాన మిచ్చినై.

సప్తఋషులు భవితవ్యాన్ని ఊహించుకొంటూ ఓషధిప్రస్థం నుండి మహాకోశీప్రపాతానికి ప్రస్థానించారు.

పార్వతి పడుకగదికి పరువుతీసింది.

ఆహ్వానం

రజిత మషీలేపపూర్ణములైన రసపాత్రలవోని సువర్ణ రేఖినులు భూర్జపత్రాలపై ,శ్రీ కారాలు దిద్దినై. మహాశిల్పులు శుభలేఖలు వ్రాసారు. చతుస్సముద్ర వేలావలయిత, విశాల విశ్వ

విశ్వాంతరాళికులకూ, అన్యప్రవణానీకానికి హిమాచల ప్రాంతాధిపతి హిమవంతుడు కుశలోటలు పంపినాడు. గౌరవార్హతల ననుసరించి పరిచ, సామంతుల ద్వారా పెద్దలకు 'స్వాగతం' పంపాడు. ముఖపరిచయస్థులకు వార్తలంపాడు. పరివారానికి పారితోషికా లిచ్చాడు.

ఆ నం దం

ఓషధిప్రస్థంలోని ముత్తైదువులు పార్వతిని పన్నీట జలక మాడించి సుగంధధూపంతో తలతుడిచి, చిక్కువిడదీసి, ముడి చుట్టి, మల్లె మందారాలు ముడిచారు. నుదుట కళ్యాణతిలకం, నునుబుగ్గ నుదిలోన కస్తూరి ఉంచిందొక ఇందువదన.

అదే సమయాన లేత పాదాలపై పసుపుపూసి, పారాణి గిలించిన దొక అలినీలవేణి. మణిమయ వేదికపై కూర్చుండ జేసినది, ఇంకొక సుమకోమలి.

పెండ్లికూతురును చూడవచ్చిన నగరనారీజనం పార్వతి సౌందర్యానికి ముగ్ధులై తలలువాల్చి ఆశీర్వదించారు. శ్రీగంధ దిక్కులుచూస్తూ, పెదవుల దరహాసమొలికిస్తూ ముత్తైదువులకు మ్రొక్కు పార్వతిని చూచిన అవివాహిత యువతులు అసూయ పడటం సహజం.

ఆశీస్సులు అందికొనేటప్పుడు, ఆమె శిరస్సు వంగటం చూస్తే యింకా మూడురోజులవరకూ మనోనాథుడు స్మృతిసీమ నుండి దృశ్యజగత్తుకు రాడన్న భారభావం ద్యోతకమవుతున్నది.

మేన విరామం లేకుండా నవవధువు పైటను సరిచేస్తూ, మేలిముసుగు సవరిస్తూన్నది.

శోభనం

బాలభానుని బంగారు కిరణాలు కైలాసశిఖరాన్ని ప్రకాశవంతం చేస్తున్న శుభసమయంలో సప్తమాతృకలు పరమశివుని పెండ్లికుమారుని చేసారు. ఆ వేళ శివుని మోములో అనిర్వచనీయానందం తాండవించినది. మగపెండ్లివారిపైన మహావిష్ణువు యాజమాన్యం వహించి, బంధుమిత్రులకు సముచిత సత్కారాలు జరుపుతున్నారు.

ఒక మహుహూర్తంలో ప్రమథగణం శంఖనాదంచేసి, ఢక్కావాయించి, డమరుకం మ్రోగించి ముందడుగు వేసింది.

• సప్తర్షి పరిషన్మధ్యంలో స్వస్తివాక్యం పలుకసాగాడు బ్రహ్మ. ఆదిత్యుడు ఆతపత్రం పట్టాడు. గంగా, యమునలు వీవనలు వీసారు. సప్తమాతృకలు పరమశివుని కిరువైపులా నడిచారు.

వృషభవాహనారూఢుడై పరమశివుడు పెండ్లికి తరలినాడు. మార్గమధ్యంలో వచ్చి కలసికొన్న దేవజాతిని పేరు, పేరునా నంది పరిచయంచేసాడు. పరమశివుడు చిరునగవుతో దేవతలరాశకు ఆనందం తెలిపాడు.

అవె మంగళతూర్యరవాలు! అదె! ఓషధిప్రస్థం. పచ్చని తోరణాలతో, పసుపుపచ్చని ద్వారాలతో అలరారే సౌధాలు, కదళీస్తంభాలతో, రత్నకాంతులతో, మణిదీప్తులతో అలరారే పెండ్లి పందిరి! కనుచూపు మేరనుండి రెప్పవాల్పకుండా సాగుతున్నారు మగపెండ్లివారు. పరమశివుడు ఓషధిప్రస్థ నగరంలో ప్రవేశించిన వార్త ముందుగా నగరనారీజనానికే చేరింది.

ప్రతిగృహగవాక్షం లోచనద్వయాలతో నిండిపోయింది. నవనవోదయోత్సాహంతో, అసంపూర్ణాలంకృతలైన మహిళలు పెండ్లికొడుకును చూడాలన్న కుతూహలంతో ఒళ్ళు మరచి పోయారు.

మగపెండ్లివారికి మంగళ వాద్యాలతో ఎదురేగి సముచిత సత్కారములరిపి విడిదికి నడిపించారు, కన్యాదాత హిమవంతుడు.

పరమశివుని సహోదరి మహాకాళిని అరుంధతి మేనకు ఎరుకపరచినపుడు ఆ కన్నతల్లి గుండె చెదిరింది. కాని అరుంధతి అనితరదృశ్యంగా ఆశ్వాసించుటవల్ల మేన మహాకాళిపై పుయూచి తలవాల్చినది.

మహాకాళి చిరునవ్వు నవ్వినది.

ఆ మందస్మితధ్వనికి మహామేరువులవంటివారే గజగజ లాడారు. వారినందరినీ ఆహ్వాన సంఘాధ్యక్షుడు విష్ణువు సముదా యించి, అది కాళి చిరునవ్వు అన్నాడు.

మగపెండ్లివారికి సర్వసదుపాయాలు సమకూర్చటానికి సమర్థులయిన సామంతులను పరివారాన్ని అప్పగించాడు, కన్యాదాత హిమవంతుడు.

గిరిరాజు ఔన్నత్యాన్ని కొనియాడాడు విష్ణువు.

బ్రహ్మ ఆశీర్వదించాడు.

ఆ సమయంలో ఆడబిడ్డను కన్నతండ్రులు హిమవంతునిపై ఈర్ష్యా దృక్కులు బరుపకపోవటం అసంభవం.

నగాధిపతి, సహృదయుడు, మహోదారుడు అయిన హిమాచలాధీశునకు చేదోడు, వాదోడుగా సాహాయ్యం

చేయటానికి, సామంత ధర్మాన్ని నిర్వహించటానికి, పరివార సమేతులై విచ్చేసారు: వింధ్య, మంధర, మేరు పర్వతరాజులు, మిత్ర, మంత్రి, సామంత, బాంధవ సహచరుల శిరోభూషణ కిరీటన్యస్థగిత మణిప్రభలతో ఓషధిప్రస్థం దివారాత్ర భేదాతీత మయినది. సామంతులు విడిది గృహాలోకనలో విస్మయం పొందు తున్నారు.

చింతామణి ద్యుతిసంయుత సుధర్మాస్థాన విరాజమాన సభామంటపంతో అదే మహేంద్రుని ఆవాససౌధం.

అప్సరోజన లాస్యవిన్యాసానుకూలంగా నిర్మింపబడిన వేదికముందు నవరత్న సింహాసనంపై చిరునవ్వులు వెదజల్లే అతడే మహేంద్రుడు. చింతామణి కిటప్రైపుల లోకపాలుర పీఠాలు. ఆ విడిది గృహానికి పార్శ్వభాగాన గరుడ, గంధర్వ, కిన్నెర, కింపురుష, యక్షజాతుల విలాస మందిరాలు.

మరికొంచెం దూరంలో దేవర్షి, బ్రహ్మర్షి మంత్రధ్వనులతో మహదానందదాయినియై సత్యలోకాన్ని తలపించే పితామహుని మందిరం. ప్రవాళాలతో వినిర్మింపబడిన కమలాసనంపై ఉపవిష్టు, డయిన ఆయనే చతుర్ముఖుడు. ఆ ప్రక్క వీణాపాణి వాణి.

కైలాసశిఖరోన్నతం, ధవళరోచిర్విలసితం, ప్రమథగణ కోలాహల సమన్వితం - అది పెండ్లికుమారుని ఆవాసం.

నవరత్నఖచిత సింహాసనంపై ప్రమథగణ నాట్యవిలోకనం చేస్తున్న ఆయనే పెండ్లికొడుకు, పరమశివుడు.

ఆయన పార్శ్వగ కసురెప్ప వేయకుండా మయూరనృత్య దర్శకత్వం నిర్వహిస్తున్న మనీషి నందీశ్వరుడు. ఆ నృత్య

దర్శకుని పార్శ్వభాగాన చండీశ్వర, భృంగీశ్వరులు. ప్రాంగణంలో విలాసలోచనాలతో పర్యవేక్షణ చేస్తూన్న సేనాపతి, వీరభద్రుడు.

వివిధ తరు, లతా, నికుంజ శోభితోద్యాన వనంలో, నిర్మల సరోవర సమీపాన నిర్మింపబడిన సౌధం లక్ష్మీనారాయణుల కేళీమందిరం. ఆ యిందుకాంతోపలోత్పల పర్యంకముపై రమాదేవితో వినోదాలాడుతూన్న పురుషోత్తముడు, మహావిష్ణువు

వీథిది గృహాలద్వార విమానాలపై దేవభాషలో రత్నాలతో పేర్లు చెక్కబడినై. మంత్రులు చూపిస్తూ ఉండగా చూచివస్తూన్న సామంతులను, మహేంద్ర సౌధంలో నాట్యం చేసే మేనకా, వరూధినీ పదనిస్వనాలు, చలింప చేసినై. లోకపాలురు, త్రిమూర్తులు కూడిన ఓషధిప్రస్థం త్రిలోకాలను ప్రతిబింబించే ధవళదర్పణమైనది.

ఋషులు స్వస్తివాచకం చేస్తుండగా పర్వతరాజ్ఞి మేనాదేవి దాస, దాసీజనంతో జామాతకు నీరాజన మీయ బయలుదేరి వచ్చినది.

దివ్యప్రభాపూర్ణ విగ్రహుండగు పరమశివుని ఆలోకించిన నిమేషంలో సమ్రాజ్ఞి మేనాదేవి హృదయం ఆనందతరంగిణి అయినది.

ఆమె విస్మయవిముగ్ధయై "అహో! ఈ అనిర్వచనీయ సౌందర్యమూర్తిని నా ముద్దులపట్టి పార్వతి వర్ణించనే లేకపోయింది."

అని మనసులో అనుకొన్నది.

పార్వతిని మంగళస్నానం చేయించి పీఠంమీద కూచోబెట్టారు.

పుణ్యాంగనలు హారతులిచ్చి, ఆశీర్వదించారు. పాణిగ్రహణ ముహూర్తము సమీపిస్తున్నది. పెండ్లికుమారుణ్ణి పీటల మీదకు తీసికొనిరండి, అని ఆదేశించారు పురోహితగర్గాచార్యులు.

హిమవంతుని సామంతులు కలశత్రయజలాలతో మంగళ స్నానం చేయించి, హారతులిప్పించారు, పరమశివునికి. స్నానానంతరం సుందరదుకూలాలు ధరించిన వరునకు సుమనోంజలు లర్పించారు.

శంఖ, భేరీ, పటహానక గోముఖాదివాద్యాలు ప్రతిధ్వనిస్తున్నై. దేవగాయకులు మంగళగీతాగానం చేస్తున్నారు. సావిత్రి, అరుంధతి, అనసూయ, లక్ష్మి, సరస్వతి సప్తమాతృకాసహితలై కళ్యాణయాత్రా సౌందర్యాన్ని యితోధికంచేస్తూ నడక సాగిస్తున్నారు.

వాయువు వింజామర, చంద్రుడు ఛత్రం పట్టి నడుస్తుండగా సూర్యుడు తేజఃపుంజాలను విరజిమ్ముతూ ముందడుగు వేస్తుంటే దేవతలు పుష్పవృష్టి కురిపిస్తుండగా, మునుల ఆశీఃపరంపరలతో పరమశివుడు గజవాహనారూఢుడై పెండ్లికి తరలినాడు. పితామహుడు, మహావిష్ణువు పెండ్లివారిని నడిపిస్తున్నారు.

అదిగో! హిమాచల ప్రదేశాధిపతి రాజసౌధం. సువర్ణ నిర్మిత రాజభవన పురోభాగం దివ్యకాంతిద్యుతి విరాజమానం. అక్కడే హిమవంతుడు ద్వారపూజ చేసాడు. స్వస్తివాక్య ధ్వనితో పరమశివుడు మందిరప్రవేశం చేసాడు.

అహో! అర్బుదానేక జనసందోహంతో క్రిక్కిరిసిన ఆ పెండ్లిపందిరి హిమవంతుని మహదైశ్వర్యాన్ని చాటుతోంది. రాజపురంధ్రీ లలామల భూషణప్రభలు రంభా తరువులో ప్రతిఫలించి వింత శోభలను సమకూరుస్తున్నై. నవరత్న తోరణ

మంత్రాలు శీతలవాయు విచలితములై నీరెండలను వెదజల్లుతూ ఉషశ్శోభలను సవిగమిస్తున్నవి

అంతర్వేది

కన్యాదాత, హిమవంతుడు పరమశివుని గజావరోహణం చేయించి సువర్ణపీఠంమీద కూర్చోబెట్టాడు. మేనాదేవి హారతి నిచ్చింది. విధివిధానంగా మధుపర్క సమర్పణ జరిగింది. అనంతరం దివ్యతేజస్విని పార్వతితన్న అంతర్వేదిమీదకు పరమశివుని యథావిధిగా తీసికొని వచ్చారు.

బ్రహ్మ-విష్ణువులు అనుసరించారు.

బృహస్పతి ఆదిగాగల మేధావులు లగ్నప్రతీక్ష చేస్తున్నారు.

గర్గ, వశిష్ఠ పురోహితులు ఘటికాయంత్రాన్ని నిర్ని మేష లోచనాలతో ఆలోకిస్తున్నారు.

ఆ సుముహూర్తాన పార్వతి దధ్యక్షత, కుశ, జలపూర్ణాంజలిని పరమశివుని శీర్షంపై ఉంచింది.

మేనా, హిమవంతులు కన్యాదానానికి ఉద్యుక్తులైనారు. మేన స్వర్ణాభరణభూషితాంగియై, జలకలశహస్తయై పతి ప్రక్కన కూర్చున్నది. హిమవంతుడు :

''పురోహిత గర్గాచార్యుల ఆదేశానుసారం, నారాయణ, చతురాననుల సమక్షంలో పరమశివునికి కన్యాదానం చేస్తున్నాను. ఈ శుభసమయంలో సంకల్పం కానీండి'' అన్నారు, ఉచ్చైస్వరంతో. విధివిధానంగా శుభసంకల్పం పఠించారు. హిమవంతుడు:

"ఇమాం కన్యాం తుభ్యమహం దదామి
పరమేశ్వరభార్యార్థం పరిగృహ్ణీష్వ"
అని ఉచ్చరిస్తూ కన్యాదానం చేసారు.

అనంతరం వధూ వరులను అంతర్వేదిమీదకు తీసికొని వచ్చారు. బ్రహ్మపర్యవేక్షణలో గర్గాచార్యులు ప్రజ్వలిత పవిత్రాగ్నిలో హోమం చేయించారు. ఉచ్చారణదక్షులు వేదమంత్ర పఠనం చేసారు.

ఋషిపత్నులు, దేవాంగనలు యువదంపతులకు హారతు లిచ్చారు. గంధర్వులగానం, అప్సరసల నాట్యం నవదంపతులకు శ్రవణ, నయనానంద దాయకములైనై.

కుమారసంభవం

ఉమా - మహేశుల పవిత్రప్రణయానురాగఫలంగా ఉద యించిన కుమారస్వామికి త్రికంత్కోటిదేవతలు సంతోష తరంగిత స్వాంతులై సుమనోంజలు లర్పించారు. మహేంద్రుడు అమితానంద భరితుడైనాడు.

ఆచార్య బృహస్పతి ఆననసీమలో మనోజ్ఞ మందహాసం స్థిరలాస్యం చేయసాగినది.

పార్వతీదేవి మృదుల హృదయంలో గిలిగింతలు రేగినవి. అదే క్షణాన తారకాసురుని గుండెలో మొగలిముళ్ళు గ్రుచ్చు కొన్నవి.

రాజర్షి విశ్వామిత్రుని సన్నిధానంలో కుమారస్వామికి జాతకర్మ, నామకరణాదులు జరిగినై. పరమశివుని పర్యవేక్షణలో శస్త్రాస్త్రవిశారదుడైన కుమారస్వామిని మహేంద్రుడు దేవ సేనానిగా ఆహ్వానించారు.

ఉమా-మహేశుల ఆశీస్సులనంది, అనుజ్ఞస్వీకరించి దేవజాతికి సేనానియై వదంతదిపి అమరావతి వైపు అడుగు వైచారు. కుమారసేనానికి ఇతర దేవసేనాపతులు అంజలి ఘటించారు. గంధర్వులు గానంచేసారు. కిన్నరులు వీణెలు సవరించారు. వరూధిని, మేనకలు గజ్జెకట్టారు.

శాంతిగీతం

అమర సేనాని కుమారస్వామి రాక్షసజాతి ఆధిపత్యాన్ని అధఃపతనం చేసే దృఢసంకల్పంతో విశ్రామంగా సేనావ్యూహ నిర్మాణాలను ఆలోచిస్తున్నాడు.

శకటవ్యూహం దేవసేనాపతికి అల్పంగా కన్పించింది. చక్రవ్యూహం అసురజాతికి కరతలామలకం, సూచీవ్యూహాన్ని రాక్షసజాతి మానుషవ్యూహంతో ఛిన్నాభిన్నం చేయగలదు. గరుడవ్యూహానికి ప్రతికక్షి అర్ధచంద్రవ్యూహంతో పక్షవిచ్ఛేదం చేస్తారు. పద్మవ్యూహం దేవజాతికే తలవంపు. కాగా, పోగా... ఆలోచించాడు, అమర సేనపతి.

దేవజాతి అదృష్టం కుమారస్వామి జననం.

క్రౌంచవ్యూహాన్ని నూతనంగా ఊహించి వన్నాడు, కుమారస్వామి.

నాసికాభాగాన వీరభద్రుడు; నేత్రాలుగా మహేంద్రుడు, విష్ణువు; పక్షాలుగా ఒకవైపున చండీశ్వర,నందీశ్వర, భృంగీశ్వరాది ప్రమథగణాధిపతులు; వేరొకవంక అగ్ని, యమ, వరుణాది

లోకపాలురు; పృష్ఠభాగాన దేవ, యక్ష, గరుడ, గంధర్వులు; ఉదరభాగాన తాను..

ఈ ద్రుశంగా పన్నిన క్రౌంచవ్యూహాన్ని తక్కుంగల సేనాధిపతులకు, సేనావివహానికి నివేదించి ఆలోచించమన్నారు. త్రింశత్కోటి దేవతలు మహానందంతో ఆమోదాన్ని తెలిపి :

'జై కుమారసేనానీ !

నినాదంతో కదం త్రొక్కి కదిలారు.

ఒక్కొక్క ఊపులో మహానగరాలను స్వాధీనం చేసి కొంటూ అమరావతిలో అడుగు పెట్టారు. రాక్షసజాతి హాహాకారాలతో తారకాసురుని త్రోల వాలినది. తారకాసురుడు మహోగ్రుడై నాడు. విశ్రాంతి తీసికొంటూ ఉన్న అసురీసేనా నివహం అహంకృతితో ఆవులించి అడుగు కదిపింది. దేవాసుర జాతులు అమరావతికి ఆమడదూరాన శిబిరాలునిలిపినై.

కుమారసేనాని శంఖధ్వానం చేసి దేవసైన్యాన్ని క్రౌంచ వ్యూహంలో నిలబెట్టాడు.

తారకాసురుడు కాహళాత్రోగించి అసురీశక్తిని రెచ్చగొట్ట, ప్రతివ్యూహానికై ఆలోచించాడు, ఆలోచించాడు.

ఆలోచన ఆలోచనగానే నిలిచిపోయింది.

ఆలోచన సమస్యా పరిశీలనకేగాని పరిష్కారానికి పనికి రాదనుకొని మూకఉమ్మడిగా ముందుకు దూకాడు.

రాక్షసజాతి దౌర్జన్యాన్ని 'రిరిరి' శక్తితో కుమారసేనాని విధ్వంసం చేస్తున్నాడు. పోరు ఘోరంగా సాగుతున్నది. విశ్వకర్మ

వినిర్మితమైన విమానంమీద ఉమా-మహేశులు, వాణీ-హిరణ్యగర్భులు ఆహవాలోకన కుతూహలురై వచ్చారు.

కుమారసేనాని కొదమసింగంలా కుప్పించి ఎగసి తారకునిపై బడి శిరచ్ఛేదం చేసాడు. రాక్షసజాతి దీనవదనంతో, చ్యుతధైర్యంతో పలాయన మంత్రం పఠించింది. కుమారసేనాని విజయశంఖధ్వానంలో అసురీశక్తుల పరాజయం ప్రతిధ్వనించింది.

నారదమహర్షి మహతి విశ్వశాంతి గీతాన్ని ఆలపించసాగినది.

జనతకు శాంతి. ప్రజాజీవితానికి ప్రశాంతి. ★★



ఉషశ్రీ మిషన్ ఆశయం – ఆశ

కొన్ని వేల సంవత్సరాలయింది మానవ జాతికి ఆది కావ్యాన్ని వాల్మీకి, పంచమకావ్యాన్ని వ్యాసుడూ అందించి. వాటిని అధ్యయనం చేసి అవగాహన చేసుకుని ఆ కథలు స్థలకాలాతీతాలని గుర్తించారు ఉషశ్రీ. అవి పురాణా లయినప్పటికీ వాటిలోని ధర్మసూక్ష్మాలూ, నైతిక విలువలూ ఈనాటి సమాజానికి ఎంతో అవసరమని గ్రహించారు. వాటి ప్రచారానికై తన జీవిత కాలమంతా కృషి చేశారు.

ఆ కృషి ఆయనతో ఆగిపోకూడదనే ఆశయంతో ప్రారంభించబడింది ఉషశ్రీ మిషన్. ఆయన భావాలూ, ఆలోచనలూ అందరూ చదువుకోడానికి అనువుగా పుస్తకాలు, వినడానికి వీలుగా క్యాసెట్లు అందించాలన్నదే ఉషశ్రీ మిషన్ ఆశయం.

ఈ ఆశయంతోటే ఇంతవరకూ "రామాయణంలో హనుమంతుడు", "ఏది సత్యం-ఏది అసత్యం" పుస్తకాలు ప్రచురించింది. త్వరలోనే ఉషశ్రీ రచించిన మరికొన్ని కథల సంపుటాలు ప్రచురించే ప్రయత్నంలో ఉన్నది.

పెద్దల సలహా, సహకారాలతో ఈ కార్యక్రమాలు ఇలా కొనసాగుతాయని ఆశ.

ఉషశ్రీ మిషన్
రేడియో కాలనీ,
విజయవాడ-520 008.

Title : Bhargavi Art Printers